

ంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
A. అఞ్జలి
ANDHRA PATRIKA



సంతృప్తి

—ఫోటో : ఎ. వి. రామమూర్తి



"కాళియమర్దన" శిల్పం

—ఫోటో: వి. కేశవశర్మ.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 1
5-9-56

దుర్ముఖ భాద్రపద శుద్ధ పాడ్యమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం: "టౌన్ బస్" చిత్రంలో ఎం. ఎన్. రాజం.

విచ్చలవిడిగా విదేశయాత్రలు:

ఖర్చు సర్కారుది; రాబడి వ్యక్తులదీ

రోజుకు ముగ్గురు ★

భారతీయుల ప్రయాణం

గత మూడేళ్ల వివరాలనుబట్టి రోజుకు సగటున దాదాపు 10 మంది విదేశీయులు మనదేశానికి యాత్ర వస్తున్నట్లు తేలుతున్నది: ఒక్క మనదేశంనుంచే రోజుకు సగటున ముగ్గురు భారతీయులు ప్రభుత్వం ఖర్చుమీద విదేశాలకు వెళ్లుతున్నారు! ఈ యాత్రలవల్ల ఖర్చుఅంతా ప్రభుత్వానిదీ, రాబడివ్యక్తులదీ అవుతున్నది. ఇటీవలే యూరప్‌లో యాత్ర ముగించి స్వదేశానికి తిరిగివచ్చిన ఆంధ్రపత్రిక డిప్యూటీ ఎడిటర్ శ్రీ కృష్ణ ఈ రెండవవ్యాసంలో "యాత్రికులస్వర్గం" అని ప్రఖ్యాతిగాంచిన స్విట్జర్లెండులో తమ అనుభవాలను వర్ణించారు; యాత్రికులను విశేషంగా ఆకర్షించడానికి మనదేశంలో జరగవలసిన ఏర్పాట్లను వివరించారు.

విదేశీ యాత్రికులను ఆకర్షించడానికి భారతదేశం బహు తాపత్రయ పడుతున్నది; యాత్రలను విపరీతంగా ప్రోత్సహిస్తున్నది. అసలు "యాత్రికుడు" అంటే ఎవరు? భారత ప్రభుత్వ రవాణా సౌకర్యాల శాఖలో యాత్రా సౌకర్యాల విభాగానికి సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీ సోమనాథ్ చిబ్ (ఎం. ఏ కాంటబ్) ఇటీవల ఒక వ్యాసంలో "యాత్రికుడు" అనే పదాన్ని ఈవిధంగా నిర్వచించారు: "వ్యాపారం నిమిత్తంగాని, ఆరోగ్యాభివృద్ధి కోసంగాని, ఖుషీకోసంగాని, చివరకు విద్యాభ్యాసం కోసంగాని ఒకదేశంనుంచి మరొకదేశం వెళ్ళే ఏ వ్యక్తినయినా యాత్రికుడే అనవచ్చు ఈ యాత్ర 24 గంటలలో పూర్తికావచ్చు; లేదా, ఆరునెలలపాటు పట్టవచ్చు. శ్రీ చిబ్ యాత్రికుల విషయమై ఈ వివరాలు కూడా తెలియజేశారు: "గత మూడు సంవత్సరాలలో భారతదేశానికి విదేశాలనుంచి ఒకలక్షా పదకొండు వేలమంది యాత్రికులు వచ్చారు. పాకిస్తాన్ నుంచి భూ మార్గాలద్వారా వచ్చినవాళ్ళు గాక, కత్తు విదేశాలనుంచే ఇంతమంది వచ్చారన్నమాట. అంటే, సగటున గత మూడేళ్ళలో సాలీనా 37 వేలమంది విదేశీయులు యాత్రార్థం మనదేశానికి వచ్చారని లెక్క తేలుతున్నది. వీరిలో దాదాపు నూటికి 25 వంతులమంది అమెరికన్లు; 16 వంతులమంది బ్రిటిష్‌వారు; 18 వంతులు పాకిస్తానీలు, మిగతా 41 వంతులమందీ ప్రపంచంలోని ఇతరదేశాలనుంచి వచ్చినవారు." దీన్నిబట్టి మొత్తం 37000 మంది యాత్రికులలో అమెరికన్లు 9.250, బ్రిటిష్‌వారు 5920, పాకిస్తానీలు 6660, మిగతావారు 15,170 మందివున్నట్టు విశదమవుతున్నది.

ఈ అమెరికన్లలో అధిక భాగం కులాసాగా విహరించి మనదేశంలోని వింతలూ విశేషాలూ తెలుసుకోడానికి వచ్చేవాళ్ళే. మిగతావాళ్ళ విషయం అలాకాదు. రూఢిగా చెప్పడానికి తగినన్ని పూర్తి వివరాలు లేకపోయినప్పటికీ, గత మూడేళ్ళలో భారతదేశం ఈ విదేశీయ యాత్రికులద్వారా దాదాపు 20 కోట్ల రూపాయలకు తక్కువ కాకుండా విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించిందనే చెప్పవచ్చునని శ్రీ చిబ్ వ్రాస్తున్నారు. అంటే సాలీనా 6 కోట్ల 60 లక్షల రూపాయలవరకూ విదేశీ ద్రవ్యం మనదేశానికి వీరిద్వారా లభ్యమైందన్నమాట. భారతదేశం ఆర్జించిందనే శ్రీ చిబ్ వర్ణిస్తున్నారు. గాని, ఇక్కడ 'భారతదేశం' అనే పదాన్ని ఏ అర్థంలో వాడారో స్పష్టపడడం లేదు. ఇంత విదేశీ ధనాన్నీ భారతప్రభుత్వమే ఆర్జించిందా, లేక - హోటలు యజమానులు, యాత్రా సౌకర్యాలను కల్పించే సంస్థలు (టూరిస్ట్ ఏజెన్సీలు) ఆర్జించినవా, మరెవరైనా కూడా ఈ ఆర్జనలో వాటాపంచుకున్నారా అనే విషయాన్ని వారు స్పష్టీకరించలేదు.

* * *

యాత్రాసౌకర్యాల అభివృద్ధికోసం ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో 33 కోట్ల 33 లక్షల 20 వేల రూపాయల ఖర్చును కేటాయించారు. అంటే సగటున 6 కోట్ల 66 లక్షల 60 వేల రూపాయలు సాలీనా ఖర్చు చేస్తారన్నమాట వచ్చే ఐదేళ్ళలో కూడా విదేశీ యాత్రికులు గతమూడు సంవత్సరాలలో వచ్చినట్టే వచ్చేపక్షంలో, శ్రీ చిబ్ తన యాత్రా సౌకర్యాల శాఖ కార్యక్ర

రోజుకు ముగ్గురు భారతీయుల ప్రయాణము

కలాపాలను అటు లాభంగాని, ఇటు నష్టం గాని లేని ధోరణిలో జోటాబోటిగా నిర్వహించిన వాడవుతాడు. అయితే, ఒకవిషయం మరచిపోకూడదు. విదేశీయాత్రికులు వచ్చినప్పుడల్లా ఖర్చులు భరించేది ప్రభుత్వమైతే, చాలావరకు విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించే వాళ్లు ప్రైవేట్ వ్యాపారస్థులై వుంటారన్నదే ఈ విషయం. విదేశీయుల యాత్రలలో వున్న ఒక విలక్షణమే ఇది.

ఇకపోతే, మన దేశంనుంచి విదేశాలకు వెళ్లే యాత్రికులవిషయం ఆలోచిద్దాము. శ్రీ చిబ్ నిర్వచనంప్రకారం విదేశాలకు తరుచూ సొంతపనులమీద వెళ్లుతున్న ఇతర భారతీయుల సంఖ్యను అలాయిదాగా వుంచినప్పటికీ, రోజుకు ఇంచుమించు ముగురు చొప్పున భారతీయోద్యోగులు విదేశాలకు వెళుతున్నారు! వెళ్లుతున్నారని చెప్పడం తప్పే అవుతుంది; ఎందుచేతనంటే, భారతప్రభుత్వమే వీరిని పంపిస్తున్నదికాబట్టి. చెమటోడ్చి కష్టపడి భారత పౌరుడు పన్ను చెల్లిస్తాడు; ఖర్చంతా అతగాడి ఖాతాకు వ్రాసి, "విశ్వవిహారంచేసి రండి" అనే ధోరణిలో మహా ఉదారమైన ఒకవిధానాన్ని ప్రభుత్వం అమలుపరుస్తున్నది! ఈ విధంగా విచ్చలవిడిగా విదేశీ యాత్రలను ప్రోత్సహించినందువల్ల అతి విలువైన విదేశీ ద్రవ్యమారకం ఎంత నష్టపడిపోతున్నదో చెప్పలేము.

యాత్రా నిర్వహణం అనేది కేవలం శాస్త్రమే కాదు; అదొక సజీవమైనకళ అనే చెప్పాలి; సాధ్యమైనంత ఎక్కువమంది యాత్రికులను ఆదేశం ఆకర్షించేట్లు చేయడమే గాక, వచ్చే యాత్రికులు సాధ్యమైనంత ఎక్కువగా తమ డబ్బును ఖర్చుపెట్టేట్లుకూడా చూడాలి; ఇందుకు అవసరమైన రకరకాల ఆకర్షణలను ఏర్పాటు చెయాలి; ఒక్కముక్కలో చెప్పాలంటే, విదేశీయాత్రికుల రాకమూలంగా మనదేశం ఆయాదేశాల డబ్బును విరివిగా ఆర్జించాలన్న మాట. ఏయే దృశ్యాలను వారికి చూపిస్తే అర్థవార్జనకు వీలున్నదో శ్రద్ధగా ఆలోచించాలి. యాత్రార్థంవచ్చే వారి ప్రధాన లక్ష్యం కులాసాకాలక్షేపమే అయివుంటుందని శ్రీ చిబ్ నిర్వచనం.

స్విట్జర్లెండులో ప్రభుత్వం యాత్రా సౌకర్యాలను ఒక లలితకళగా అభివృద్ధి చేసింది. స్విట్జర్లెండులో కాలుపెట్టగానే ప్రతివ్యక్తికీ, ప్రతి స్విస్ పౌరుడూ తన దేశాన్నీ, తన నగరాన్నీ, చివరకు తన పరిసరాలను, తను నివసించే గృహాన్నీ చూసుకొని ఎంత మురిసిపోతాడో, ఎంత గర్వపడతాడో ఇట్టే బోధపడుతుంది. ప్రపంచ చిన్నదే అయినప్పటికీ, ప్రపంచ ప్రజాస్వామిక రాజ్యాలలో అగ్రస్థానాన్ని అలంకరిస్తున్న కారణంచేతే స్విట్జర్లెండును ఇక్కడ ప్రత్యేకంగా ఉదహరిస్తున్నాను.

నేను బెర్న్ నగరంలో వుండగా ఒక కొత్త రైలుస్టేషన్ నిర్మాణం విషయమై హోరాహోరీగా వాగ్యుద్ధాలు సాగుతున్నవి. కొత్తస్టేషన్ నిర్మించి తీరవలసిందేనని చివరకు 'రిఫరెండం' ద్వారా నిర్ధారణ చేసివేశారు. విశిష్టమైన ప్రజాస్వామిక ధోరణిలో ఒక నిర్ణయాన్ని చేసినప్పుడు, ఆరు నూరైనా, నూరు ఆరైనా ఆ నిర్ణయాన్ని అమలుజరిపితీరవలసిందే. ప్రజాస్వామ్యమనే పేరుతో కాలహరణానికి అక్కడ ఆస్కారం లేదన్నమాట. 'రిఫరెండం' ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ ఎప్పుడైతే జరిగిపోయిందో, అప్పుడే బెర్న్ నగరంలో కొత్త రైలుస్టేషన్ నిర్మాణానికి ఉపక్రమించారు; పని సాగిపోతున్నది. వివాదగ్రస్తమైన ఏ సమస్యపైనైనా స్విస్ ప్రజాస్వామ్యంలో ఈవిధంగా ఒక తుదినిర్ణయాన్ని చేసివేయడం జరుగుతుంది.

స్విస్ రాజ్యాంగంలో కూడా ప్రాథమిక హక్కులన్నవి వున్నప్పటికీ, అక్కడి పౌరులు బహిరంగ ఉద్యానవనాలను, కంటికి ఇంపుగా, హాయిగా కనిపించే పచ్చికబయళ్లను నాశనం చేయడంగాని, నానా కశ్మలాన్నీ వీథులలో పడవేయడంగానీ జరగదు. వీథులవెంట తిరిగి వస్తువులు అమ్ముకునే వర్తకులు అక్కడ లండన్‌లో కూడా వున్నారుగాని, వాళ్లు కోసిన పండ్లముక్కలనూ, వుడికించిన ఆహారపదార్థాలనూ మాత్రం బజార్లలో తిరుగుతూ అమ్మరు; ఇంతేకాదు; చెత్తా చెదారం పడవేసి బజారను, పేవ్‌మెంట్లను ఖరాబ్ చెయ్యరు కూడా. అందుచేతే, స్విస్ పౌరులు అమిత పరిశుభ్రంగా వుంచుకొన్న తమ నగరాలను చూసి ఎంతో గర్వపడతారనీ, మురిసిపోతారని చెప్పాను. వివిధదేశాలనుంచి వచ్చే యాత్రికులను బాగా ఆకర్షించాలనే ఆసక్తితో తమ నగర సౌందర్యాన్ని స్విస్ పౌరులు అశ్రద్ధగా కాపాడుకుంటారు.

* * *

జనాభాను, వైశాల్యాన్నీ బట్టి మాస్తే ఇంటర్-లేకన్ అన్నది స్విట్జర్లెండులో బహు చిన్నవూరనే చెప్పాలి. పదివేలమంది ప్రజలు వుంటారో వుండరో. దేశదేశాల యాత్రికులను ఆకర్షించడానికి శాఖోపశాఖలుగా ఏర్పడి అత్యంత శ్రద్ధాసక్తులతో పని చేస్తున్న ప్రత్యేకవ్యవస్థ ఒకటి స్విట్జర్లెండులో వున్నది. ఇంటర్-లేకన్ పట్టణంలో వున్న దానిశాఖకు మేనేజరుగావున్న ఎర్నెస్ట్ హెస్ అనేఅతడు యూరప్‌ఖండం మొత్తంమీదేఅతిసమర్థుడని ప్రతీతి. మనోహరమైన దృశ్యాలతో రెండు సరస్సుల మధ్య వున్న ఈ ఇంటర్ లేకన్ పట్టణాన్ని దర్శించడానికి 1955 లో 1,54,828 మంది యాత్రికులు వెళ్లారంటే, ఎర్నెస్ట్ హెస్ సామర్థ్యాన్ని గ్రహించవచ్చు; 1954 లో అక్కడికి వెళ్లిన యాత్రికులు 1,45,436 మంది. వీరిలో అమెరికన్లు 34,834, బ్రిటిష్‌వారు 34,586, ఫ్రెంచివారు 20,371, జర్మన్లు 9,673, భారతీయులు 1,099 మంది వున్నారు. అక్కడ నాలాంటి బీదయాత్రికుడే ఎక్కువఖర్చు చేయలేకుండా వుండలేకపోయాడంటే, ఈ యాత్రికుల ద్వారా స్విట్జర్లెండు ఎంత విదేశీద్రవ్యాన్ని ఆర్జించగలుగుతున్నదో ఊహించవచ్చు.

ప్రతిహోటలులో యాత్రికుడువెళ్లగానే మడిచివున్న ఒక చిన్న కార్డుసైజు కరపత్రం లాంటి పుస్తకాన్ని ఇస్తారు. యాత్రికుడు బసచేసే గదినంబరు, ఆ పట్టణం మ్యాపు దానిలో అచ్చువేసివుంటవి. ప్రతి యాత్రికుడూ అవూళ్ళో తప్పకుండా చూడవలసిన స్థలాలపేళ్లో మొదలైనవన్నీ సమగ్రంగా వ్రాసివుంటవి.

నాటకశాలలు, సినిమాహాల్సు, హోటళ్లు, ఔషధశాలలు, క్షౌరశాలలు, ఆస్పత్రులు, మామూలు వైద్యులు, దంత వైద్యులు, పోలీసు స్టేషన్లు, చర్చిభవనాలు మొదలైన పేర్లూ చిరునామాలే గాక, ఏ నెలలో స్థానిక వాతావరణ పరిస్థితులు ఏవిధంగా వుంటేదీ కూడా ఈ కరపత్రం క్షుణ్ణంగా వివరిస్తుంది. వ్యాపారానికి సంబంధించిన ఎడ్వర్టయిజ్‌మెంట్లను కూడా. దీనిలో అచ్చువేస్తారు; ఈవిధంగా దానికయే ఖర్చును రాబట్టుకుంటారు.

* * *

ఇంటర్ లేకన్ పట్టణంలో మోటారు కార్ల పోటీవల్ల గుర్రపు బగ్గీల వాడకానికి ఏవిధమైన తాకిడీ తగలలేదు. బగ్గీల వాడకాన్ని అక్కడివారు బహు జాగ్రతగా కాపాడుకుంటున్నారు. అంత చిన్నవూళ్లో మొత్తం 22 బగ్గీలు వున్నవి. ప్రతి బగ్గీకీ చక్కటి యూనిఫారమ్ ధరించి ఎత్తు టోపీ పెట్టుకున్న 'సారథి' వుంటాడు. సరోవరం గట్టుమీద వున్న హోటలుకు ఈ బగ్గీలో ఎక్కి అక్కడి అడవిగుండా పోతూవుంటే బహు హుషార్‌గా వుంటుంది. సరోవర విహారానికీ, ఆతపస్నానానికీ, సమస్త ఆహార పానీయాలకు, అవసరమైన సౌకర్యాలన్నిటినీ ఈ హోటలు సమకూర్చుతుంది.

అక్కడి మనోహర దృశ్యాలను చూడగానే నాకు హరిద్వారం సమీపంలోని మన హృషీకేశం జ్ఞాపకం వచ్చింది. అయితే

ఇక్కడ హృషీకేశానికి అట్టేమంది విదేశీ యాత్రికులు వెళ్లరు. వెళ్లే కొద్దిమంది విదేశీయులు కూడా సాధువులు వుండే ప్రాంతానికి గాక, గంగానదికి అవలగా అరణ్యంలో వున్న రహదారి బంగాళాకు వెళ్లడం జరుగుతున్నది. తగినన్ని సౌకర్యాలను సమకూరిస్తే, మన హృషీకేశాన్ని సర్వోత్తమమైన, అత్యంత ఆకర్షకమైన యాత్రాస్థలంగా తయారుచేయవచ్చు అయితే మద్యం సేవించకూడదనీ, జీవహింస చేయరాదనీ, చేపలు పట్టరాదనీ వున్న ఆదర్శాలు ఇందుకు అడ్డువచ్చే ప్రమాదంవున్నది.


సర్వసాధారణంగా స్విట్జర్లెండులో యాత్రికుల రద్దీ సంవత్సరం మొత్తంమీద ఒక్కొక్క ఋతువులోనే వుంటుంది ఆ హడావుడి తగ్గిపోగానే టూరిస్ట్ ఆఫీసుల మేనేజర్లందరూ ఒకచోట సమావేశమై భవిష్యత్ కార్యక్రమాన్ని గురించీ, యాత్రికులను మరీ విస్తారంగా ఆకర్షించడానికి చేయవలసిన ఏర్పాట్లను గురించీ చర్చిస్తారు. దేశం మొత్తంమీద ఏ ప్రాంతానికి ఎందరెందరు యాత్రికులు వచ్చిందీ సవివరంగా పరిశీలిస్తారు. ఒకవేళ వారిసంఖ్య ఎక్కడైనా తగ్గిపోవడం జరిగితే, ఎందుకు తగ్గిందీ శ్రద్ధగా అన్వేషించి తెలుసుకుంటారు ఏమిచేస్తే తమ ఏర్పాట్లలోవున్న లోటుపాట్లను సర్దుబాటు చేయడానికి వీలవుతుందో ఆలోచిస్తారు. ఈ పరిశీలనంతా జరిగిన పిమ్మట ప్రచారకార్యక్రమానికి పథకాలనుతయారు చేసుకుంటారు. ఈ స్విస్ మేనేజర్లందరూ చాలా చిన్న చిన్న ఉద్యోగాలలోనుంచి పైకివచ్చిన ఉద్దండులు; మంచి అనుభవజ్ఞులు. యాత్రికులను ఆకర్షించే మార్గాలన్నీ వీరికి కరతలామలకాలు.

*   *   *

అక్కడ స్విట్జర్లెండులో పరిస్థితులు ఈవిధంగా వుంటే, ఇక్కడ భారతదేశంలో మన ప్రభుత్వం ఓడరేవుల అభివృద్ధివిషయమై శ్రద్ధ వహించడానికి రహదారి మరమ్మతుల శాఖ ఇంజనీరును ఒకాయన్ను నియమించాలని ఉద్దేశిస్తున్నది! రోడ్లపనులకూ ఓడరేవుల అభివృద్ధికీ ఏమిటి సంబంధం?

యాత్రికుల సౌకర్యాభివృద్ధిపట్ల శ్రద్ధ వహించడానికి డిప్యూటీ కార్యదర్శిగా నియమించిన శ్రీ సోమనాథ్ చిబ్ కూడా ఇటీవలివరకూ ఆల్ ఇండియా రేడియో ఉద్యోగిగా వుండేవారు ఈ నియామకాల గొడవను తలుచుకుంటే, ఈ మధ్య 'అంతఃపుర విప్లవం' జరిగేవరకూ నేపాలులో సంప్రదాయసిద్ధంగా అమలు జరుగుతూ వచ్చిన ఆచారం ఒకటి జ్ఞాపకం వస్తున్నది. కొన్నికొన్ని నేపాలీ కుటుంబాలలో పుట్టిన మొగపిల్లలందరూ ఏ సైనికానుభవంతో గాని, శిక్షణతో గాని నిమిత్తం లేకుండానే పుట్టుకతోనే సేనానులయ్యేవాళ్లు! అది వారి నామధేయాల విశేషం!

విదేశీ యాత్రికులను ఎక్కువగా ఆకర్షించాలనే ఉద్దేశంవుంటే, భారతదేశం స్విట్జర్లెండునుంచి కొంతమంది నిపుణులను పిలిపించాలి వారిచేత సమగ్రమైన ఒక పథకాన్ని తయారు చేయించడం ఉత్తమం. యాత్రికులు తాగకూడదనీ, మాంసభక్షణ చేయకూడదనీ లేనిపోని శ్రీరంగనీతులు చెప్పినందువల్ల ప్రయోజనంలేదు విలాసార్థం వచ్చే యాత్రికులెవరూ 'మాత పిడికిలి' ధోరణిలో తెచ్చుకున్న డబ్బు మిగుల్చుకుపోదామనిగాని, నైతిక సూత్రాలను తుచ. తప్పకుండా ఖాతరు చేద్దామనిగాని రావడం జరగదు ఇదేవిధంగా వాళ్లందరూ ఖద్దరు దుప్పట్లు పరిచిన పక్కలమీదనే శయనించాలని నిర్బంధించడం కూడా అర్థంలేని విషయమే అంతర్జాతీయవిమానయానం సాగిస్తున్న 'ఎర్ ఇండియా ఇంటర్నేషనల్' సేవ ప్రపంచ యాత్రికులందరిమన్ననను పొందగలిగింది. ప్రతి యాత్రికుడికీ ఉత్తమమైన ఆహారం, ఉత్తమోత్తమమైన పానీయాలు లభ్యంకావడమే ఇందుకు కారణమని వేరే చెప్పనవసరంలేదు. ఈ విమానాలలోకూడా మద్యనిషేధాన్ని అమలుజరిపితే, ఫలితాలు ఎలావుండేదీ శ్రీ జగ్జీవన్‌రామ్‌కు తెలిసివస్తుంది. మొత్తంమీద సారాంశం ఏమిటంటే, కొంతమంది ఘరానా పెద్దలే యాత్రికులెవరూ రాకుండా మూసే మార్గాలను అన్వేషిస్తున్నారు; ఈ పరిస్థితులలో యాత్రా సౌకర్యాలను నిర్దిష్టమైన పద్ధతిలో పెట్టడానికి చేసే ఖర్చంతా శుద్ధ దండుగమారి వ్యవహారమే అవుతుంది! ★



బెజవాడలో ఆంధ్ర చలన చిత్ర వాణిజ్యమండలి భవనానికి గవర్నరు శ్రీ త్రివేదీ ఆగష్టు 20న శంకుస్థాపన చేశారు.

క్షుధాగ్ని జ్వాల

ప్రాచీన గాథాలహరి

పి. గణపతి శాస్త్రి

౧

'భవతి, భిక్షాం దేహి!' "భవతి! భిక్షాం దేహి' అని వ్యాసమహర్షి శిష్యులు జైమిని, పైల, సుమంతులు ఇంకా మిగిలిన అంతేవాసులు ఒకే ఒక స్వరంతో గంభీరంగా గొంతెత్తి అరిచారు. అయినా ఆ యిల్లాలెవరో గాని ద్వారం తెరిచిపట్టెడన్నం వారి భిక్షాపాత్రలలో పడవేసిన పాపానపోలేదు. అసలా గృహిణీమతల్లి ఎవరో గాని ద్వారమే తెరవలేదు! చిట్టచివరికి వ్యాసమహర్షి కూడా శాయశక్తులా గొంతెత్తి 'భవతి భిక్షాం దేహి!' అని ముమ్మారు ప్రార్థించాడు. అయినా ఎవరు మారు పలకలేదు!

కాశికానగరంలో గ్రీష్మాతపం నడినెత్తి మాడ్చివేస్తూంది. ఎక్కడా ఆకల్లాడిన జాడ కూడా కనిపించలేదు. కాకులు కావుకావని అరవడానికి కూడా శక్తిలేక అల్లల్లాడిపోతున్నాయి. అజీవాల ఆర్తనాదం కంఠనాళాలలోనే చిక్కుపడిపోయింది.

తరవాత వ్యాసమహర్షి శిష్యగణంతో మరి ఒక ఇంటికి బయలుదేరాడు. అక్కడా ఎవరు మారు పలకలేదు. అలాగలాగ వారంతా ఆవీథి అంతా గాలించివేశారు. ఎక్కడా ఎవరు ద్వారం తెరచే జాడయినా గోచరించలేదు.

పిమ్మట వారందరు ఇంకొక వీథికివెళ్లారు. ఆవీథిలో కూడా ఎవరూ వారికి పట్టెడన్నం పెట్టిన పాపాన పోలేదు. ఇంకొక వీథికి వెళ్ళారు. కాని అక్కడా అంతే జరిగింది.

వ్యాసమహర్షి శిష్యులందరితోను కలిసి వారణాసీనగరం ప్రవేశించినప్పటినించీ ఇదే వరస! పాపం ఎవరు వారికి పట్టెడన్నం పెట్టలేదు.

కృష్ణద్వైపాయనుడు శిష్యగణంతో కలిసి వారణాసిలో ప్రవేశించినప్పటినుంచీ క్రమక్రమంగా ఏడు రోజులు గడిచిపోయాయి. ఆ ఏడు రోజుల నించీ శిష్యులకు గాని, వ్యాసునికి గాని ఎక్కడా ఒక్క మెతుకైనా భిక్షాన్నం దొరకలేదు. అదేమి దైవదుర్విపాకమో మరి!

శ్రీ విశ్వేశ్వర దేవ వతం సాక్షాత్తుగా వెలసిన కాశీ మహానగరమది! దివోదాస మహారాజు కాశీరాజ్యం పరిపాలిస్తూంటే ధర్మదేవత నాలుగుపాదాలతోను నడుస్తున్నదని కాశీరాజ్య ప్రజలంతా ఎలుగెత్తి చాటుతున్నారు. ఆ మహారాజు రాజ్యంలోనే వ్యాసమహర్షివంటి మహామహితాత్ముని శిష్యగణానికెక్కడా పట్టెడన్నం దొరకలేదు!

అంతలో వడగాడ్పు ఒక్కమారుగా ఈ చెంపనించి ఆ చెంపకు ఈడ్చికొట్టింది! ఆ దెబ్బతో చెట్లమీద తలదాచుకొన్న పక్షులన్నీ ఎండుటాకుల్లా గలగలా రాలి నేలమీద పడిపోయాయి! అంతవరకు నడవలేక నడుస్తున్న వ్యాసమహర్షి శిష్యులలో కొందరిక నడవలేక అక్కడే చదికిలపడిపోయారు. కొంతమంది గట్టిగా వడగొట్టి అక్కడే పడిపోయారు. కొనప్రాణాలతో మిగిలిన మరికొందరు శిష్యులు పడిపోయిన వారికి శీతలోపచారాలు చేశారు.

జైమిని ఆబీభత్సం చూచి వ్యాసమహర్షి సన్నిధికివచ్చి నెమ్మదిగా ఏదో విన్నవింప వలెనని అనుకొన్నాడు. కాని నోరారిపోవడంచేత మరి మాటలాడలేకపోయాడు. పైల సుమంతాది ప్రధాన శిష్యులకిక ఏ మనడానికీ పాలుపోలేదు.

వారంతా ఆర్యావర్తంలో ఎన్నెన్నో మహాపుణ్యతీర్థాలు సేవించారు. ఆ పుణ్యతీర్థాలన్నిటిలోను ఎక్కడికి వెళ్లినా మృష్టాన్న భోజనమే! మహర్షి కృష్ణద్వైపాయన సంయమిని సందర్శించవలెననే తహతహతో బ్రహ్మణ్యులనేకులాయన కెదురేగి మహర్షి సముచితమయిన అతిథిసత్కారాలు చేసి తమ తమ జన్మలు పావనమైనా యని భావించేవారు. మహర్షి కేగాక శిష్యులందరికీ పంచభక్ష్య పరమాన్నాలతో మృష్టాన్నభోజనం పెట్టి వారి ఆశీర్వర్తంలో తలలు వంచేవారు! అలాంటి కృష్ణద్వైపాయన సంయమికీ, శిష్యగణానికీ నేటికిలాంటి దురవస్థ సంప్రాప్తించింది!

అయినా వ్యాసమహర్షి అధైర్యం చెందక మిగిలిన అంతేవాసిగణంతో కలిసి ఆపార్శ్వంలో ఉన్న మరి ఒక వీథికి వెళ్ళాడు. అది కాశీనగరంలో రాజవీథిగా పేరెన్నికగన్న సోమవీథి. ఆ వీథిలో నిలబడి వ్యాసమహర్షి శిష్యులందరితోను కలిసి ఒకే గొంతుతో "భవతి! భిక్షాం దేహి!" అని మూడు సారులు గొంతెత్తి అరిచి భిక్ష పెట్టవలసిందని అర్థించాడు.

సోమవీథిలో ఇండ్లన్నీ ఎండ వేడిమి భరించలేక కళ్లు మూసుకొన్నట్లు కనిపించాయి. ఆ వీథి మధ్యంలో బాటలన్నీ ఎండమావులై మెరిశాయి. అంతేగాని ఒక్కరు వ్యాసమహర్షి అభ్యర్థన ఆలకించే జాడ కనిపించలేదు. అటుపిమ్మట ఒకరిద్దరు శిష్యులిక నిలబడలేక చాపచుట్టుగా బాటమీద పడిపోయారు. సాత్యవతేయ మహర్షికి కూడా నాలుక పిడచకట్టుకుపోయింది. కాళ్లలో నిలబడేశక్తియావత్తు ఒక్కమారుగా నశించిపోయింది.

"విశ్వనాథుడే ప్రత్యక్షదైవతమై ఈ మహానగరం పరిపాలిస్తున్నాడే! అన్నపూర్ణా మహాదేవి ఆయన సన్నిధిని నిలబడి ప్రాణులందరికీ స్వయంగా అన్నప్రదానం చేయిస్తున్నదే! డుంఠి విఘ్నేశ్వరస్వామి, కాలభైరవుడు మొదలయిన దేవతలందరు తామై కొలువున్న పరమపునీతమైన ఈ వారణాసీ నగరంలోనే పట్టెడన్నం కరవై పోయెనే! విశ్వేశ్వరాది మహాదేవతలందరు పరమ ధార్మికులయిన నాశిష్యులందరు అన్నపానాలు లేక ప్రాణాచారాలుపడి పోతున్నా చూచి ఊరకున్నారే! ఈ దేవతలందరు కేవలం కఠినశిలామూర్తులు! కాశీనగరంలోని బ్రాహ్మణులందరు పరమపాపండులు!" అని వ్యాస

మహర్షి హృదయంలో అనేకమైన క్రోధ జ్వాలా పరంపరలు చెలరేగాయి. అతని గర్భంలో క్షుదాగ్ని జ్వాల ఆరని చిచ్చై వెలిగి బ్రహ్మరంధ్రంవరకు నాలుకలు చాచింది!

అంతలో అంతవరకు లోలోపలే రగులుకొంటున్న వ్యాసమహర్షి క్రోధాగ్నిజ్వాల ఒక్కమారుగా భగుమనిమండింది.

కమండులువులో మిగిలిన ఉదకంతో ముమ్మారాచమించి కాశీనగరవాసులందరినీ శాపాగ్నిజ్వాలలతో దహించివెయ్యవలెనని అనుకొన్నాడు. కాని అంతలోనే కొంత నిగ్రహం అవలంబించి ఆనగరవాసులందరినీ ఈక్రింది శాపవాక్యంతో శపించివెయ్యవలెనని నిశ్చయించాడు.

"మా భూత్త్రైపూరుషీ విద్యా
మాభూత్త్రైపూరుషం ధనం
మాభూత్త్రైపూరుషీ భక్తిః
కాశ్యాం నివసతాం సదా."

అనే తీవ్రశాపవాక్యం అతని జిహ్వాగ్రందాకా వచ్చింది.

'కాశీనగరవాసులకు భక్తి విద్యా ధనాలు మూడు, మూడు పురుషాంతరాలవరకైనా సక్రమంగా సంప్రాప్తించకపోవుగాక!' అని వ్యాసమహర్షి కాశీవాసులందరినీ శపించివెయ్యాలని అనుకొన్నాడు.

కాని అంతలోనే పైలుడది కనిపెట్టాడు. వెంటనే శిష్యులందరికీ సన్నసన్నగా ఆ విషయం తెలుపుచేశాడు. వారందరు తమ విశాలఫాలభాగాలపై దోసిళ్ళొగ్గినిలబడి "మహర్షీ! క్రోధం ఉపసంహరించవలసిం" దని పరిపరివిధాలుగా ప్రాధేయపడ్డారు. వ్యాసుడాక్షణంలోనే మణికర్ణికాజలంతో శపించివెయ్యవలెనని నిశ్చయించాడు. అతని బొమముడినుండి క్రోధాగ్నిజ్వాలా ధూమమాలిక సన్నసన్నగా పైకిలేచింది.

౨

ఆక్షణంలో కొంతదూరంలో ఒక సన్నని పిలుపు వినిపించింది.

"బ్రాహ్మణవరేణ్యా! ఎందుకయ్యా! నీకంతట క్రోధం! ఆ శాపసంకల్పం ఉపసంహరించి ఒక్కమారిక్కడికి విచ్చేయవయ్యా!"

ఆ ఆహ్వానం వినేసరికి మహర్షి హృదయంలో అమృతవర్షం కురిసినట్లయింది. గుండె జల్లుమన్నది. కృష్ణద్వైపాయనుడొక్కమారు కన్నులెత్తి ఆ తియ్యని ఎలుగు వెలువడిన దిశవైపు అవలోకించాడు.

అతని కెదురుగా పచ్చని దబ్బపండువంటి పండు ముత్తైదువ ప్రత్యక్షమైనది. ఆమె అప్పుడే తన భవంతిసింహద్వారం తలుపోరగా తెరిచి ముంగిలిలో రెండడుగులు వేసి నిలబడింది. ఆమె అందెలసవ్వడి సన్నగా ధ్వనించే కరకంకణాల కలకలంలో విలీనమైపోయింది. ఆముత్తైదువ వేణీభరం చాలావరకు నెరిసిపోయింది. వెడదకన్నులు రెండు ఫాలతలం అంతటికీ ప్రదక్షిణం చేస్తున్నట్టుగా వికసించాయి.

ఆమెను సందర్శించగానే వ్యాసునికి కొంచెం ఆశ రేకెత్తింది. ఆ యిల్లాలు పట్టెడన్నమైనా పెట్టకపోతుందా అని అనిపించింది. నోటి చివరిదాకా వచ్చిన శాపవాక్యం అలాగే ఆపివేసి తొందరగా అడుగులు వేసుకుంటూ ఆమె సన్నిధికి వెళ్ళి నిలుచున్నాడు.

ఆమె ఆప్యాయంగా పిలిచిన పిలుపు ఇంకా అతని హృదయంలో మారుమోగుతూనే ఉంది. అది ఎంత తియ్యని పిలుపు!

వ్యాసమహర్షి కా పురంధ్రి ఎవ్వరో తెలియలేదు! అలాగే విస్తుపోయి కొంతసేపామెవైపు చూచాడు. అప్రయత్నంగా అతని హస్తాలు రెండు చేయెత్తి ఆమెకు నమస్కరించాయి

ఆ పురంధ్రీమతల్లి మహర్షి నమస్కారానికి ప్రతినమస్కారం చెయ్యకుండానే ఒక చిన్న చిరునవ్వు ఒలకబోసి మహర్షినీ విధంగా మందలించింది:

"నాయనా! విశాలాక్షీదేవి ప్రతిదినము మధ్యాహ్నవేళలో అతిథి అభ్యాగతులందరికీ స్వయంగా మృష్టాన్నం వడ్డించే మహానగరిమతల్లి కాశిక! శ్రీవిశ్వేశ్వరదేవదేవుని అర్ధాంగీమణి! తానే స్వయంగా కాశీనగరిగా అవతరించింది!

"ఏడురోజులపాటన్నం దొరకలేదన్నంతమాత్రాన ఇలాగ పసిపాపలా ఏడుస్తున్నావా? నీ శమదమాది సద్గుణసంపత్తి అంతా ఏమయిపోయిందయ్యా! నీ మహాధైర్యం అంతా ఇంతమాత్రంచేతనే నట్టేట కలిపివేశావయ్యా? ఆకలిగొన్నవారెలాంటి పాపకృత్యానికైనా ఒడిగడతారు! సరిగా అదే జరిగింది.

"పరమశివదేవుని అర్ధాంగి అయినటువంటి కాశికానగరిపైనే కన్నెఱ్ఱజేశావే! ఇది వింటే ఆ దేవదేవునికిక నీమీద ఎంతటి క్రోధం వస్తుందో కొంచెమైనా గ్రహించావా?

బ్రాహ్మణుడవైపోయావు గనక నీమీద కోపగించడం ధర్మంకాదు!

సరే! దానికేమిగాని స్నానం చేసి వెంటనే భోజనానికి రా, నాయనా!"

ఆ ముత్తైదువ ఎంత సన్నసన్నగా చివాట్లు పెట్టినా భోజనానికి రావలసిందని ఆహ్వానించేసరికి మహర్షి గుండె మళ్ళీ జల్లుమంది. ఎంతో భక్తిప్రపత్తులతో ఆ ఇల్లాలి వైపు చూచి సవినయంగా విన్నవించుకొన్నాడు:

"అమ్మా! ఇన్నాళ్ళకైనా భోజనం అనే మాట చెవినిబడేసరికే నా కడుపు నిండిపోయింది! అయితే తల్లీ! ఒక్క సందేహం! భోజనానికి నేనొక్కణ్ణే వచ్చేదా? నా శిష్యులనందరినీకూడా తోడుకొనిరావచ్చునా? అమ్మా! వారివి నా ప్రాణాలవంటివేగదా! వారి నందరినీ విడిచిపెట్టి ఒక్కణ్ణీ నేనెలాగ రాగలనమ్మా!"

ఆ మాటమీద ఆమె కలకల నవ్వింది:

"నాయనా! నీవు నీ శిష్యులందరినీ వెంటబెట్టుకొని రావచ్చును! మీరందరు వెంటనే స్నానసంధ్యాదులు ముగించుకొని రండి! అంతా తిరిగి వచ్చేసరికి పదార్థాలన్నీ సిద్ధం చేయిస్తాను. నీలకంఠుడు నీ గుండెధైర్యం పరిశీలించడానికే ఈ విషమపరీక్ష చేసిఉంటాడు. అంతేగాని కాశీనగరిలో మృష్టాన్నానికి లోటేమిటి నాయనా?"

వెంటనే వ్యాసమహర్షి శిష్యులందరు భాగీరథిలో స్నానసంధ్యాదులు నిర్వర్తించుకొని భోజనానికి వచ్చారు. ముందుగా తమ రాక ఆ ఇల్లాలికి తెలియజేశారు.

ఆమె వారినందరినీ ఎంతో ఆప్యాయంగా భవంతిలోపలి కాహ్వానించింది.

ఆ సమయంలో ఒక పరిచారిక ఆమెకు బంగారు గొడుగు పట్టింది. ఇంకొక పరిచారిక తాంబూలకరండకం ధరించి అప్పుడప్పుడామెకు కర్పూర తాంబూలపు చిలక లందిస్తూ ఎంతో వినయంగా నిలబడింది.

అనంతరం శిష్యులందరితో కలిసి వ్యాసమహర్షి ఒక విశాలమైన చతుశ్శాలలో సమాసీనుడైనాడు. ఆ చతుశ్శాల అంతటా అగరుధూపమాలిక ఒల్లిబిల్లిగా అలముకొన్నాయి.

అంతలో కొందరు పరిచారకలు వారి అందరి ఎదుట లేతలేత అరటిఆకులు వేశారు.

★ క్షుధాగ్ని జ్వాల ★

శిష్యులందరు తమ దేవతార్చనాదికం ముగించుకొని ఎప్పుడెప్పుడని భోజనాని కెదురు తెన్నులు చూస్తూ కూర్చున్నారు. అంతలో ఆ ముత్తైదువ బ్రాహ్మణు లందరికీ క్రమంగా ఆపోశనం వడ్డించింది. పైలసుమంతాదివ్యాసశిష్యులందరు కలిసి మున్నూరుగురుదాకా ఉన్నారు. అందరికీ అంతలోనే అంత విందు జరగగలదంటే వారెవరికీ ఏమీ నమ్మక కలగలేదు.

వారందరు ఆపోశనం వడ్డించినా ఇంకా భోజనపదార్థాలు రాలేదేమని అలాగే ఎదురు తెన్నులు చూచారు.

"మరికొందరు ఎక్కడా వంటకాలు చేసిన జాడగాని, పొగచిన జాడగాని లేదే! ఇంతమందికీ ఈ ఇల్లాలు భోజనం వడ్డించగలదా? లేక ఇదంతా కపటనాటకమేనా!" అని ఆశ్చర్యపోయారు.

ఇంకా మరి కొంద 'రా ముత్తైదువ మాటలలో ఎక్కడా కల్లా, కపటము కానరావే! ఎంతో చల్లదనం వెల్లివిరిసిందే! ఇంతా చేసి పట్టెడన్నమైనా పెట్టలేకపోతారా?' అని అనేక విధాలుగా వితర్కించుకొన్నారు.

అలాగ కొంచెంసేపు గడిచిపోయిన పిమ్మట కొందరు పరిచారికలు వచ్చి అరిటాకులలో పంచభక్ష్య పరమాన్నాలు, ఇంకా ఎన్నెన్నో చిత్ర చిత్రమైన వంటకాలు వడ్డించారు. వ్యాసమహర్షి శిష్యులు ఆ పదార్థాలన్నీ కంఠదఘ్నంగా ఆరగించి, గ్రువ త్రేన్చారు. అనంతరం కొందరు పరిచారికలు వారందరికీ కర్పూర తాంబూలాలందించారు.

తలవని తలంపుగా కలిసివచ్చిన ఆ అదృష్టానికి మురిసిపోతూ శిష్యులందరు ఎంతో సంతోషించారు. వేదికలపై సుఖాసీనులై భుక్తాయాసం తీర్చుకొంటూ కూర్చున్నారు. సాక్షాత్తు కాశీవిశ్వనాథుని దేవేరి అన్నపూర్ణాదేవే స్వయంగా తమ కటువంటి భరద్వాజవిందు చెయ్యగలదనీ తదితరులకంతటి శక్తిసామర్థ్యాలు లేవనీ అనుకొన్నారు.

3

అంతలో వారందరికీ ఎవరో రత్నపాదుకలతో నడిచివస్తున్న సవ్వడి వినిపించింది. వ్యాసమహర్షి, మున్నూరు శిష్యులు ఒక్కమారుగా తలలెత్తి చూచారు.

గౌరీ విశ్వనాథు లిద్దరు రత్నపాదుకల మెరుపులతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వారందరు సమాసీనులైఉన్న చతుశ్శాల లోనికి విచ్చేశారు.

జయవిజయులుగాని, నందికేశుడుగాని వారిద్దరికీ బరాబరులు చేస్తూ ముందు నడిచి రావడం ఒక పరిపాటి. ఈనాడటువంటిదేమీ కనిపించలేదు.

విశ్వనాథుని ముఖంలో రోషం తాండవిస్తోంది. గౌరీదేవి ముఖం కన్నతల్లి ముఖంలా చల్లని చిరునవ్వు వెన్నెలలు విరజిమ్ముతోంది. జైమిని పైలాది ప్రముఖ శిష్యులందరు విశ్వనాథదేవుని ముఖంలోని రోషావేశం చూచి నోట మాట లేక తమవల్ల ఏమి అపరాధం జరిగిందో అని పరిపరివిధాలుగా మథనపడ్డారు. అయితే అందరు సవినయంగా లేచి నిలబడి ఆ పురాణదంపతు లిద్దరికీ సగౌరవంగా ప్రత్యుత్థానం చేసి సాష్టాంగనమస్కారాలు చేశారు.

కాశీ విశ్వనాథుని దృష్టి ముమ్ముందుగా వ్యాసమహర్షిపై పడింది. వ్యాసుడా క్రోధారుణ ముఖభంగిమ చూచి గజగజ వణికిపోయాడు.

విశ్వనాథుడు వ్యాసునిపై నిప్పులు కురిపిస్తూ ఆజ్ఞాపించాడు:

"దురాత్మా! నీవేదో భారత సంహిత రచించానని కన్నుమిన్ను కానకుండా సంచరిస్తున్నావే! దేవరన్యాయంతో భారతవంశం నిలబెట్టిన నీకౌచిత్యానౌచిత్యజ్ఞానమెక్కడిది? మత్స్యగంధీ ప్రథమ పుత్రుడవై జన్మించిన నీవీనాడు తగుదునమ్మా అని నా దేవేరి కాశీకాదేవిని శపించవలెనని సంకల్పించినావా?

"నిర్భాగ్యుడా! వెంటనే నీవీ కాశీపురి విడిచిపో! పోకుండా నీ విక్కడ ఒక్క క్షణమైనా నిలబడ్డావంటే నీ ముఖం రాతిబండ మీద బరబరా ఈడ్పించివేస్తాను! తెలిసిందా?"

ఆవిధంగా కాశీ విశ్వనాథుడు హుంకరించేసరికి వ్యాసమహర్షి ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. శిష్యులందరు భయోద్వేగంతో ఇక ఏమిచెయ్యడానికీ పాలుపోక అలాగే శిలాస్తంభాలై నిలుచుండిపోయారు.

వెంటనే వ్యాసుడు గౌరీ విశ్వనాథు లిద్దరి పాదాలపైన పడి క్షుధాగ్ని జ్వాలకు తాళలేక ఆవిధంగా అపరాధం చేశాననీ తన తప్పిదం మన్నించవలసినదనీ ప్రార్థించాడు.

అయితే అతడు తిరిగి లేచి చూచేసరికి విశ్వనాథు డక్కడ లేడు! గౌరీదేవిమాత్రమే అక్కడ నిలబడి ఉన్నది.

వ్యాసుని దైన్యం చూచి ఆ దేవి ఎంతో జాలిపడి అతని నీవిధంగా ఓదార్చింది:

"నాయనా! నీవీ విధి వైపరీత్యానికేమీ భయపడకు! ఆకటిచిచ్చు భరింపలేక ఆ విధమైన దుష్ప్రవృత్తిలో ప్రవేశించావు! అది సహజమే! నేను నిన్నెన్నడు మరవనులే! అయితే విశ్వనాథదేవుని ఆజ్ఞప్రకారం నీవీ కాశీనగరి విడిచి వెళ్లిపోవలసిందే!

కాని నీవు వేరే ఇంకెక్కడికీ వెళ్ళిపోవలసిన ఆవశ్యకత ఏమీలేదు! వెంటనే దక్షారామానికి వెళ్ళిపో! అక్కడ భీమనాయకుడు నిన్నెప్పుడు కంటికి రెప్పలా కాపాడుతూండగలడు! దక్షారామం సాక్షాత్తు దక్షిణకాశీ! అక్కడ నీకు సమస్తమైన శ్రేయస్సులు సిద్ధించగలవు!"

ఆ విధంగా గౌరీదేవి అభయం ఇచ్చిన తరవాత వ్యాసుడు కొంచెం సేదదీరి శిష్యసంఘంతో కలిసి వెంటనే దక్షిణకాశీకి బయలుదేరాడు.

కాశీనగర నిర్వాసనం అతని హృదయానికి తీరని వేదన కలిగించింది.

ఆకటిచిచ్చువల్లగదా! నేనంతటి దేవతాపచారం తలపెట్టాను! ఆకటిచిచ్చెంతటివానినైనా ఆకృత్య నరకంలో కూలద్రోసివేస్తుందిగదా!"

అని ఆ సమయంలో కృష్ణద్వైపాయనుడు తన దుస్సంకల్పాని కెంతో కించపడ్డాడు. ఒకదీర్ఘనిశ్వాసం విడిచిపెట్టాడు.

★

నిర్మల

మధ్యాహ్నం సరిగా ఒంటిగంట అయింది. విజయనగరం మహారాజావారి కోటసిపాయి గట్టిగా ఒంటిగంట కొట్టేడు. పాటలో పల్లవి అందుకున్నట్టు కాలేజీ బంట్రోతు ఆ శబ్దం అందుకుని టంగు-టంగు మంటూ గంటలు పరంపరగా కొంతసేపు కొట్టేడు. ఆ పూటకు విద్యాబోధ చాలించమని ఉపాధ్యాయులకూ, ఇక బసలకు వెళ్ళండని విద్యార్థులకూ ఆగంట కొట్టడంమూలంగా హెచ్చరిక అయింది.

తూర్పు పడమర్లకు చాలా దూరం వ్యాపించివున్న కాలేజీ మేడమెట్లు ఎక్కటకూ, దిగటకు మూడు మెట్ల వరుసలు ఉన్నాయి. తూర్పుకొసను ఒకటి-పడమటికొసను ఒకటి-మధ్యను ఒకటీ. తూర్పుకొస మెట్లవరస విద్యార్థినుల రాకపోకలకు ప్రత్యేకించబడ్డది. గంటకొట్టగానే కాలేజీ తరగతుల విద్యార్థినులంతా - పూల వనంలో పుష్పజాతులలాగుననూ, వాటిమీద యెగిరి నేత్రోత్సవంచేసే సీతాకోక చిలుకలలాగుననూ-అతి రభసంగా మెట్లు దిగివస్తున్నారు. వారి వైఖరిచూస్తే - బసలకు తిరిగి వెళ్లుతున్నట్టు కనబడలేదు. జట్టుగా అంతా ఒక్కదగ్గరకే-ఏదో కార్యం సాధించేటందుకు తొందరగా వస్తున్నారు. ఏమంటే మెట్లు దిగి, వారు గేటువైపు నడవడంలేదు. క్లాసులుండే గదులను ఆనుకొని-దక్షిణంగా ఉన్న చీడీమీదనుంచి - లేడీ వలంటీర్లలాగ - వరసగా, క్రమంగా, తొందరగా వస్తున్నారు.

వాటి నాలుగోఫారం క్లాసు, మధ్యమెట్లకు పడమటగా ఉన్న గదిలో ఉండేది- ఆ క్లాసు మేష్టరు - అన్నాజీరావుగారు. ఆయన క్లాసు గదిలోకే యీ విద్యార్థినీ బృందం అంతా బిలబిలలాడుతూ వస్తున్నారు. అందులో ఒక ఆమె "ఈయన పేరు అన్నాజీరావుగారు ఏమిటే? తిమ్మాజీరావు అనేపేరు వినంకాదూ?" అని భోగట్టా చేసింది. "నీకు కొడుకుపుడితే ఆ పేరుపెట్టి ముచ్చట తీర్చుకో" అన్నది. ప్రక్కనున్న ఆమె, నవ్వుతూ—

ఇంతట్లో అన్నాజీరావు మేష్టారు కాళ్ళజోళ్లు తొడిగి, మూలపెట్టుకున్న గొడుగు అందుకొని, తిరిగి రాబోతూ ఒక అడుగు వేశారో, లేదోగాని అంతలోనే విద్యార్థినీ బృందంలో చాలామంది ఆయన క్లాసు గదిలో ప్రవేశించారు. కొందరు గడప దగ్గిరా, కిటికీలదగ్గిరా సర్దుకుని బైటనే నిలబడ్డారు.

ఆడపిల్లలు - ఇంతమంది - ఒక్కమాటు తన క్లాసు గదిలో చొరబడ్డందుకు మేష్టారు విభ్రాంతులైనారు. వాళ్ళలో చాలామంది ఒకప్పుడు తనదగ్గిర ఫోర్తుఫారం చదివిన శిష్యురాళ్ళే! ఈ మధ్యనే ఆయనకు చాలా గొప్ప విపత్తు ప్రాప్తించింది. ఆయనే నేడు చెయ్యి గాల్చుకుని, వండుకుని, ఎక్కడ లేటు అవుతానో అనే భీతి చేత ఉడికీ ఉడకని మెతుకులిన్ని-ఉలుకూ-పలుకూ నోట పడేసుకొని-చచ్చి చెడి ఎలాగో వచ్చిపడి లేటు మార్కు కాకుండా రిజిష్టరులో సంతకం చేసి-ఏపూటకు ఆ పూట ఒడ్డునపడుతున్నారు. ఒంటి గంటకు

"విరల్"

కడుపులో కరకర ఆకలి వేస్తున్నది-కాఫీ హోటేలుకు తొందరగా పోదామనుకుంటూ ఉండగా—ఈ బాలికలమూక వచ్చిపడ్డది. ఎందుకోసం వచ్చినట్టు? ఆయనకి ఏమీ బోధపడలేదు—మోటుతనంగా వదుల్చుకొనిపోవడానికి వీలుగా లేదు. అయినా తన ప్రాత విద్యార్థినీ బృందం ఆకస్మికంగా తనను చేరవచ్చినప్పుడు—మానవుడుగానూ, వాళ్ళ ఉపాధ్యాయుడుగానూ—వాళ్ళ యోగక్షేమం అయినా అడగడం తన కనీస ధర్మం అనీ ఆయనకు తోచినది. "అమ్మాయిలూ? మీకూ, మీవాళ్లందరకూ క్షేమమా?" అని కుశల ప్రశ్న వేశారు. "దైవకృపవల్లనూ, మీ ఆశీర్వచనంవల్లనూ మా అందరికీ క్షేమమేనండి. కాని పాపం తమకే గొప్ప గ్రహచారం తటస్థించిందని ఈమధ్యనే విన్నాం!" డాక్టర్ జాన్సన్ జీవచరిత్ర వ్రాస్తూ లెస్లీ స్టీఫెన్ అన్నాడు కదా!

"ఒక నిర్భాగ్యుని జీవనం దుఃఖభాజనము చెయ్యాలంటే - వాని దౌర్భాగ్య దేవత భార్యావియోగంకంటె దారుణమైనకష్టం ఏదీ ప్రాప్తమయేటట్టు చేయలేదు." అన్నది, ఒక విదుషీమణి

"ఆ గ్రంథం రచించిన దొరకూడా అదే దురవస్థకు పాలుపడ్డాడు గనుకను, దెబ్బ చుఱ్ఱుమని నసాళమంటినది గనుకను, స్వానుభవంవల్ల ఆ కష్టం యెటువంటిదో బాగా అవగతం చేసుకొని అంతటి సానుభూతితో, అంత చక్కగా వ్రాయగలిగేడు. అది మధ్యధరాసముద్రపు పడమటి ఒడ్డుకు అవతల దేశాలలోమాట అది మన భరతభూమికి వర్తించదు" అన్నది, మరొక బుద్ధిమంతురాలు. ఆ మాట అందుకొని మరొక వివేకవతి "మన భరతభూమిలో పెళ్ళి కేవలం ఒక బొమ్మలాట! అందులో, భార్య చస్తే భర్త పచ్చగా మళ్ళీ పెళ్ళికొడుకవుతాడు- కట్నంకూడా మళ్ళీ గుంజుకుంటాడు. ఒక తుండుగుడ్డ పోతే మరో తుండు అమర్చుకున్నట్టు - ఒకర్తె చస్తే మరొకర్తెను అమర్చుకొని బాజాబజంత్రీలతో పల్లకి యెక్కి ఊరేగుతాడు! మన తెనుగు దేశంలో ఒక కవి - ఒకరి తరవాత మరొకర్తె - వరసగా ఎనమండుగుర్ని పెళ్లాడాడట!

అదే భర్తచస్తే-భార్య ఏమున్నది? వట్టి మోడు-నిట్టాట - దీపపు సెమ్మె! సైను పంచా-బోడిగుండూ! సంఘంలో యావన్మందికీ గడ్డిపరకకంటే చులకన!" సుల్తానా బేగం ఇలాఅంది: "మా తురకసుల్తానులూ నవాబులూ-బాదుషాలూ-అరె అల్లా! ఆడవాళ్లు పడుచుపిల్లలంటే-రాత్రికి పడకసరుకూ—ప్రొద్దుట పీకనరుకూ! సాఫ్-సఫాయ్. అంతే ఆడకూతురు బతుకు. చదవలేదా "అరేబియన్ నైట్సు?"

"ఏమైనా, మీ తురకలలోనూ, నష్పుల లోనూకూడా కొంతనయమే-దేవుడిచ్చిన జాతియినా మిగులుతుంది-తక్కిన బ్రాహ్మల్లో మరీఘోరం."

"తలలు బోడులైతే-తలపులు బోడులవుతాయా? చూడు! ఆ పందిరిపీఠిలో ఆవిడ-రామేశ్వరంవెళ్లి జుత్తు తీయించుకుని వచ్చి ఏడాదికాలేదు అప్పుడే రెండు సార్లు పట్నంవెళ్లి వచ్చింది—"

"ఆవిడెను ఎందుకు అనాలంటాను. ఉప్పూ పులుసూ తినే మానవశరీరం

మనసా్న వైరాగ్యంకలిగి భిక్షుణీ-సన్యాసీ-అయితే తప్ప-నిర్బంధించి-విరూపుల్ని చేస్తే శరీరోన్మాదం అణగారిపోతుందా? పోదు-"

"మేష్టారూ! క్షమించండి! మేం ఒక మాట విన్నాం. నిజం మీ వల్ల తెలుసుకుందాం అని యిలాగ వచ్చాం. మీరూ దైవాత్తూ ప్రాప్తించిన లోపం భర్తీ చేసుకుంటారట కాదూ!

"అట!యేవిటే? మన కాలేజీలో ఇంటర్ సీనియర్ చదువుతున్న అమ్మాయి-నిర్మలని-ఈయనికి ఇవ్వడానికి నిశ్చయం చేశారట-మేష్టారు చేసుకోడానికి ఒప్పుకున్నారట కూడాను. కట్నం మాత్రం లేదట!"

"ముసలి పెళ్లికొడుకులకు కూడా కట్నాలా?

"మేష్టారికి మధ్యాన్నం అయిందివిభమోన్యాపడి."

"మరి లుబ్ధావధాన్లు చెప్పినట్లు-యాభయియేళ్ళకే ముసలంటావేమే?"

"మేష్టారుకి మైలకుద్ది కాగానే - పధ్నాలుగో నాటి రాత్రే లగ్నం కావలసింది-"

"ఇంగ్లండు రాజు ఏడో ఎడ్వర్డు చచ్చిపోతే శవాన్ని అలాగే అట్టేబెట్టి, అతని కొడుకు అయిదో జార్జికి అవసర పట్టాభిషేకం జరిగించారు. అపరకర్మ ఆ తరవాత వారం పదిరోజులికి జరిగింది. ఇంగ్లండు అరాజకంగా ఒక్క క్షణం ఉండకూడదు.

"అదే విధంగా మన దేశంలో ఒకడి భార్య చచ్చిపోతే-మైల పోగానే-మగవాడు మరో పెళ్ళాన్ని ఇట్టే పెళ్ళాడేస్తాడు"

"ఎందు చేతనో?

"నేను ఒక శాస్త్రులుగార్ని నీలాగే అడిగితే ఆయన సమాధానం చెప్పేరు: ఏమని అంటే—భరతభూమిలో బ్రాహ్మణుడికి-మగవాడికి ధర్మశాస్త్రం నాలుగు ఆశ్రమాలు విధిస్తున్నది—1 బ్రహ్మచర్యం. 2 గృహాస్థాశ్రమం. 3. వానప్రస్థం. 4. సన్యాసం. భార్య చచ్చిపోయి, తిరిగి పెళ్లాడనివాడు పై నాలిగింటిలో ఏ ఆశ్రమంలో వాడని చెప్పగలం? కనుక—ఆ భర్త తనకి భార్యలేనిలోపం— వెంటనే భర్తీ చేసుకోవాలట."

"బాగుంది—ముందు కొత్త పెళ్లాన్ని పెళ్లాడేసి, తరవాత పాత పెళ్ళాం అంత్యక్రియల పనిచూస్తే—ఇంగ్లండు రాజ సాంప్రదాయం అనుసరించిన వాళ్లం అవుతామేమో?"

"చాలా బాగుంటుంది—కాని రెండు కారణాలవల్ల అలా జరగడం సాధ్యం కాదు. ఏమంటే—(1) సిద్ధంగా కొత్త పెళ్ళికూతురు అమరదు. ఒకవేళ అమిరినా—(2) మృతాశౌచం అంటారు. మైల పన్నెండు రోజులు దాకా పోదు. తరవాతగాని పెళ్లి వల్లపడదు."

అప్పుడు ఒక అమ్మాయి తక్కిన వాళ్లను "ఉండండర్రా" అని ఊరిడి, విచారించి

"మేష్టారూ! మా నిర్మలని మీకిచ్చి పెళ్లి చేయడం నిశ్చయం అయిందంటూరా! లేదంటూరా? నిశ్చయం అయితే పెళ్ళి ఎప్పుడు? మా దగ్గర దాచక నిజం చెప్పండి" అని తీవ్రంగా చూస్తూ, అన్నాజీరావుగారిని సూటీగా అడిగింది.

మేష్టారు "పెళ్ళి నిర్ణయమయిన మాట నిజమే. నెల దాటకుండా—శుభముహూర్తము ఎప్పుడు కుదిరితే—పెళ్ళి అప్పుడే" అని ఆయన జవాబు చెప్పేరు.


"అయితే—నేను - ఒకమాట అంటాను. మీరు కోపపడకండేం."

మే:—చెప్పు, అమ్మా! నీ మనస్సులో మాట స్పష్టంగా చెప్పు. సంశయించకు."

"థాంక్స్ — మేష్టారూ — నాకు ఆస్వతంత్రం ఇచ్చినందుకు థాంక్స్—మరీ-మా నిర్మల మీదగ్గిర ఫోర్తుఫారమ్ చదువుకుందా? లేదా?"

మేష్టారు: "జ్ఞాపకంగా చెప్పలేను. అయితే నా స్టూడెంటు అయి వుండవచ్చును టెన్నిసన్ రాసినట్టు నా మేష్టరీ: "Students may come and students may go-But I go on for ever—కనీసం పాతిక ఏళ్లి దాకా. నిర్మల నా వద్ద చదివి ఉండవచ్చు."

"చదివితే మీ కుమార్తెవంటిది. లేకపోతే మీ ఉభయుల వయస్సుల తేడాలనిబట్టి చూస్తే—మీరు తాతగారూ, ఆ అమ్మాయి మీ మనమరాలు—లాగ కనబడుతుంది. మీకు కూతురో, మనమరాలో అనుకోతగ్గ బాలికను తగుదునని మీరు పెళ్లాడడం ఏమి యోగ్యంగా ఉంది? — ఆలోచించి చూచారా?...మీరు యీ ఉద్యోగం ఇంక—మహా చేస్తే—ఐదేళ్లు—ఆతరవాత-కాలేజీ అధికార్లు-"తప్పుకోండి మేష్టారూ-పైకి నడవండి" అంటారు. రోజూ రెండు పూట్లా నోరు నొప్పెట్టేలాగ అరిచి పాఠాలు చెప్పే మేష్టర్లు-నిశ్శబ్దంగా రాసుకుంటూ ఆఫీసు పని చేసే గుమాస్తాల్లాగ-అట్టేకాలం బతికలేరు. దక్షిణంనుంచి కాలుడు మిమ్మల్ని 'కాల్' చేస్తాడు. మీదారిని మీరు వెళతారు. ఇప్పుడు పెళ్లాడబోయే ఆవిడ-జీవితాంతందాకా బతకాలి. మీరు నిష్క్రమించిన పదో నాటితో ఆవిడ పసుపూ-కుంకుమా-వగైరా-ఫైనల్. రేవులో మంగలి యెదట కూలబడి సిగ చెతికిసుంది-సంఘం. గిరీశం చెప్పినట్టు-పదేపదె క్షౌరం. మీ ప్రాణానికి ఉసూరుమంటూ మీ వితంతువుని ఎంత కాలం బతకమంటూరు? మేష్టారూ. దూరం ఆలోచించండి. నిర్మల తల్లీ-తండ్రీ నిరుపేదలు. ఈడువచ్చిన పిల్లను పెళ్ళి చేయకుండా ఇంట వుంచుకోవడం బహుభారం. ఆ అమ్మాయిని ఎలాగో వదుల్చుకుందాం. కట్నం లేకుండా పెళ్లి చేసి పంపించేదాం. ఆతరవాత దాని కర్మానికి మేం ఏం చేస్తాం అని - తప్పించుకోవడముకు వాళ్లు యత్నిస్తున్నారు-దొరికినదే దొండపండని మీరు చూస్తున్నారు. మన సంఘంయొక్క ఈ దురవస్థ బాగుపడడానికి ఎవరు ఏమి చెయ్యాలో బోధపడడము లేదు-వెనక అరేబియాలో ఆడపిల్ల పుట్టగానే ఇసకలో కప్పెట్టేసేవారు-ఆడపిల్ల పుట్టగానే మనం చంపేస్తే-గవర్నమెంటు మనల్ని ఉరిదీస్తుంది - ఈ పసిపిల్లల్ని పెంచి, పెద్దవాళ్ళను చేసి, విద్యాబుద్ధులు చెప్పించి,తగిన వరుడికి ఇచ్చి, పెళ్లి చెయ్యడం బహుకష్టసాధ్యం. నిర్మల చాలా తెలివైనపిల్ల. పేదల కడుపున పుట్టింది. ఎవరో కొందరు చందాలు వేసుకొని - పనికొచ్చే పిలగదా అని చదివిస్తున్నారు. ఆవిడెకు వివాహం ఇష్టం లేదు - కన్యగానే ఉండి పెద్దచదువు చదివి సంఘ సేవ చెయ్యాలనే సంకల్పంలో వుంది. ఇష్టంలేని పిల్లని బలవంతంగా పెళ్ళాడి మీరేం సుఖపడతారు? ఆవిడను ఏం సుఖపెడతారు? బాగా ఆలోచించి మరీ అడుగు వెయ్యండి. దేవపారిజాత పుష్పంవలె నిర్మల అయిన మా నిర్మల గొంతు కోయకండి. మీ వయస్సుకీ - అభిరుచుకీ తగినదీ - మీ ఆర్జనమీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవనం చెయ్యగలదీ దొరికితే-ఒక పూర్వసువాసినిని పెళ్లి చేసుకోండి. ప్రయత్నించండి. ఇపుడు మాత్రం ఈ పెళ్ళి చేసుకోనని మా అందరియెదట మీరు బహిరంగంగా ప్రకటించాలి" అని ఒక విద్యార్థిని చేసినగంభీరోపన్యాసం చెవులప్పగించి విని, తాను నిర్మలను వివాహం చేసుకోవడంవల్ల రాగల విపత్పరంపరను మనోనేత్రంతో స్పష్టంగా మేష్టారు చూచారు. ఆయనకుండె బద్దలైపోయింది-ఆదౌర్భాగ్యం ఎంత దారుణమైనదో ఆయనకు కళ్లకు కటినట్టు అయినది. గద్గదస్వరంతో ఆయన ఇలా అన్నారు: "అమ్మాయిల్లూ!- ఊబిలో పడి కూరుకుపోకుండా నన్నూ, నాబారిని పడకుండా-దేవపారిజాతపుష్పంవంటి కన్యకామణి-నిర్మలనూ సంరక్షించి మీరు ధన్యులైనారు. కృతజ్ఞతాపూర్వకంగా మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను-స్వార్థం త్యజించి చాలామంది కన్యకలు సంఘోద్ధరణ-దేశోద్ధరణలకు పూనుకుంటేనేగాని దేశం బాగుపడదు. నాకు బాగా బుద్ధిచెప్పినారు-నేను ఇక ఏకన్యకనూ పెండ్లి చేసుకోను - భగవత్ సాక్షిగా చెపుతున్నాను-నమ్మండి. మీరు భారత భాగ్యదేవతలు. భావితరం ప్రజానీకానికి మాతృదేవతలు. నాకన్న చిన్నవారైనా నాకర్తవ్యం బాగా ఉపదేశం చేశారు. భగవంతుడు మీకు ఆయురారోగ్య ఐశ్వర్యములిచ్చి వీరమాతలు అయ్యేటట్లు వరమిచ్చి ఆశీర్వదించమని చేతులు మోడ్చి నమస్కరిస్తున్నాను" అనేసరికి బాలికలంతా ఒక్కసారి చప్పట్లుచరిచి హర్షము వెల్లడిచేశారు. ★



ఢిల్లీ విధానసభ రద్దయితే న్యూఢిల్లీ సభ్యులకు నిరుద్యోగం — ఆహారవ్యవసాయశాఖ కార్యదర్శి చైనా విహారం — భారత రక్షణశాఖమంత్రి అపూర్వ బధిర ప్రహసనం.

ఢిల్లీ రాష్ట్రంలో ప్రజాస్వామిక పరిపాలనే ఉండాలనే ఆందోళనలో రెండో భాగం ఇటీవల ప్రారంభమైంది. అధికారంలోవున్న ఏ పెద్దమనిషిమాటలనో ఆసరా తీసుకుని ఒక స్థానిక వార్తాపత్రిక ఢిల్లీకి మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే శాసనం త్వరలో జరగబోతోందని వ్రాసింది. ఈ మునిసిపల్ కార్పొరేషన్‌కు న్యూఢిల్లీ పైనా, రాయబార వర్గాలుండే ప్రాంతం పైనా అధికారం ఉండదనికూడా ఆ పత్రిక వ్రాసింది

మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినంతమాత్రాన స్వయంపరిపాలన ఇచ్చినట్లు కాదని వాదించేవర్గంవారు మాత్రం, ఢిల్లీ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎటువంటి పరిపాలనావ్యవస్థ ఏర్పాటు చేయబోతోందో తెలుసుకునే నిమిత్తం కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ధేబర్, హోంశాఖా మంత్రి పండిట్ పంత్, అందరిలోకీ సీనియర్ మంత్రి శ్రీ ఆజాద్, ఈ త్రిమూర్తులను దర్శించాలని నిర్ణయించుకున్నారు.

ప్రస్తుతానికి న్యూఢిల్లీలో మకాంచేసిన "ప్రజాస్వామిక వ్యవస్థా"వాదులు కార్పొరేషన్ అధికారంనుండి న్యూఢిల్లీని మినహాయించడానికి వీల్లేదని ప్రతిఘటించ నిర్ణయించారు. వీరికి వచ్చినబాధ ఏమిటంటే నిరుద్యోగసమస్యను ఎలా ఎదుర్కోవాలీ అని. కార్మికులకైనా నిరుద్యోగబాధ లేదుగాని, శాసనసభ్యులకు మాత్రం ఆ బాధ ఉన్నది. ఢిల్లీ విధాన సభను రద్దుచేయడం ద్వారా, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు సుమారు యాభైమంది సభ్యులను నిరుద్యోగులుగా చేయబోతోంది. విధానసభలోని కొందరు సభ్యులకైనా మునిసిపల్ కార్పొరేషనులో సభ్యత్వం లభిస్తుంది కనుక ఫరవాలేదు.

కాని విధానసభలోని న్యూఢిల్లీ ప్రతినిధులకు మాత్రం అటువంటి సభ్యతా్వవకాశం లేదు కనుక వారు నిరుద్యోగులు కాకతప్పదు. అందుచేతనే వారు న్యూఢిల్లీని కార్పొరేషనునుండి మినహాయించడానికి వీల్లేదని ఆందోళన చేస్తున్నారు.

"ప్రజారాజ్య" అతివాదులు "ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిం"దనే నినాదం దొరకబుచ్చుకుని గగ్గోలు లేవదీశారు. ఈ "ప్రజారాజ్య" వాదులు కామెర్ల వ్యాధినుండి ప్రజలను రక్షించడానికి ఏమి చేశారనేది దేవరహస్యం. కామెర్ల వ్యాధి విచారణసంఘ నివేదిక చర్చించడానికి ఢిల్లీ విధానసభ సమావేశమైనప్పుడు సభలో 'కోరం' లేదని వార్తాపత్రికలు ప్రకటించాయి.

న్యూఢిల్లీని మునిసిపల్ కార్పొరేషన్ నుండి మినహాయించాలని ప్రభుత్వంచేసే వాదం కూడా బలహీనంగానే ఉంది. న్యూఢిల్లీ మునిసిపల్ కమిటీలో అందరూ నామినేటెడ్ సభ్యులే. వీరిలో ఎక్కువ మంది అధికారులే. ఈ అధికారవరేణ్యులు భారత రాజధానిలో జీవనసౌకర్యాలను రక్షించడానికి ఏం జాగ్రత్తలు తీసుకొన్నారు? స్వాతంత్ర్యం వచ్చినవాటి నుంచీ కేంద్ర ఆరోగ్యశాఖ పనిచేసిన పద్ధతి చూస్తే, ఈ నామినేటెడ్ మునిసిపల్ సంఘం రద్దయిపోవడమే శ్రేయస్కరమని పిస్తోంది. అయితే న్యూఢిల్లీని "ప్రజాస్వామ్యవాదు"లని పేరుపెట్టుకున్న ఏ ఇద్దరికో అప్పగించాలని కాదు; పని చెయ్యడం మానేసిన అధికార సభ్యులను ఆరోగ్యశాఖ తీవ్రంగా హెచ్చరించి శ్రద్ధగా పనిచేయించాలని మాత్రమే.

* * *

విదేశీ ద్రవ్యమారకం అంతకంతకీ కిష్టమై పోతున్నప్పటికీ, "ఖర్చంతా దేశానికి రుద్ది విదేశాలు చూసి రావా"లనే ఉద్యమం మటుకు విజృంభిస్తోంది. భారతదేశపు విదేశీ ద్రవ్యమారకంలో ఎంత ఖర్చవుతోందీ అంచనా వేసి చూస్తే, ఈ మధ్య రెండు రోజులకి అయిగురురు చొప్పున విదేశాలకి బయల్దేరిపోతున్నారని తేలింది. శ్రీ టి టి. కృష్ణమాచారి, డా॥ కైలాస్‌నాథ్ కట్జూ లాంటి మంత్రులను మినహాయిస్తే, ఆఖరికి పార్లమెంటరీ కార్యదర్శులు కూడా ప్రజాధనం జేబులో వేసుకుని విదేశయాత్రలు చేసుకుని తిరిగి వస్తున్నారు. ఉదాహరణకి, అవసరంగా గొప్పవాడైపోయిన శ్రీబి.ఆర్. భగత్ పార్లమెంటరీ కార్యదర్శిగా ఉన్నప్పుడు అమెరికా, కెనడా, యూరప్‌లో కొంతభాగం, జపాన్, ఆగ్నేయాసియాలో కొంతభాగం చూసి చక్కా వచ్చారు. ఆహార పదార్థాల ధరలు నానాటికీ మిన్నంటుతూండగా, గిడ్డంగి సౌకర్యాల అభివృద్ధి చట్టం అమలులోకి రావలసి ఉండగా, ద్వితీయ ప్రణాళికలో ఎంతెంత ఉత్పత్తి చేయాలనే విషయమై ప్లానింగ్ సంఘానికీ ఆహార వ్యవసాయశాఖకీ యుద్ధం జరుగుతూండగా, ఆహార వ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ పి. ఎన్. థాపర్ మటుకు ఒకసారి రోమ్ వెళ్ళి బోలెడు నేర్చుకువచ్చి ఇంకా బోలెడు నేర్చుకోడానికి ఇప్పుడు చైనాలో పర్యటిస్తున్నారు. సుమారు నాలుగు నెలలనుంచీ ఈయన విహారంలోనే ఉన్నారు. ఆహార వ్యవసాయశాఖకి బహుశా కార్యదర్శి అక్కర్లేదేమో, కార్యదర్శి లేకపోయినా జరిగేపని ఎలాగు జరిగిపోతుందేమో అని కొందరు భావిస్తున్నారు.

ఫారిన్ ఎఫైర్స్ జూలై సంచికలో ఒక

★ న్యూఢిల్లీ లేఖ ★

వ్యాసం వ్రాస్తూ హెన్రీ ఎమ్. రిస్టన్ ఇలా వ్రాశాడు:

"అమెరికాలో విదేశాంగ మంత్రి విదేశాల్లో ఉన్నప్పుడు ఉపమంత్రి మంత్రిత్వ హోదాలో అధ్యక్షునికి సలహాలివ్వడానికి వీల్లేదు.

ఈవిధంగా మంత్రి విదేశాలకు వెళ్లడం వల్ల అనేకమైన చిక్కులు సంభవిస్తాయి. విదేశాంగశాఖలో ఏ ఒక్క అధికారి తాత్కాలికంగా పనిలోకి రాకపోయినా ఆ అధికారి మామూలుగా చేసేపని అంతా ఆగిపోతుంది. దీనివల్ల మొత్తం ఆశాఖ పనికే దెబ్బ తగులుతుంది."

విదేశ విహారానికి కల్పించబడే అనేక మినహలకు మరో ఉదాహరణగా ఇటీవల ఒకవార్త వెలువడింది:

"సుప్రసిద్ధ రచయితల గ్రంథాలు ఇకమీద కారు చౌకధరలలో ప్రతివాడికీ లభ్యమవుతాయి.

ప్రభుత్వం ఇటీవల స్థాపించిన జాతీయ గ్రంథ ప్రచురణ మండలి (నేషనల్ బుక్ ట్రస్టు) ప్రజలకు పఠనాభ్యాసం కలుగజేసే ఉద్దేశంతో భారీ ఎత్తున ప్రసిద్ధ గ్రంథాలు ప్రచురిస్తుంది.

చిన్న చిన్న పుస్తకాలధర అర్థరూపాయి, పన్నెండు అణాలకు మించదు.

ఇద్దరు అధికారులను అక్టోబరులో రష్యా అమెరికా, బ్రిటన్, తూర్పు ఆఫ్రికాలకు పంపిస్తారు. వీరు భారీఎత్తు ప్రచురణ, అమ్మకం పద్ధతులను పరిశీలిస్తారు.

రష్యాలో ఈఅధికారులిద్దరూ "విదేశ భాషా ప్రచురణాలయం" పనిచేసే పద్ధతులు పరిశీలిస్తారు. ఈ ప్రచురణాలయం లక్షలు లక్షలు పుస్తకాలు ప్రచురిస్తుంది. రష్యాలో ప్రధాని నెహ్రూ పర్యటించినప్పుడు దాన్ని బాగా మెచ్చుకున్నారు. ఈ అధికారులు బ్రిటన్, అమెరికాలలో చవకగా మంచి పుస్తకాలు ముద్రించే వ్యాపార సంస్థలను దర్శిస్తారు."

ఇంతకూ ఒక ముక్కలో చెప్పాలంటే అదృష్టజాతకులైన ఏ ఇద్దరు అధికారులో ప్రజాధనం జేబులో వేసుకుని రష్యా, అమెరికా, బ్రిటన్, తూర్పు ఆఫ్రికా చూసి వస్తారన్నమాట. పూర్వపు వాణిజ్యశాఖ అధికారి ఒకాయన ఇలాగే లైట్‌హౌస్‌లను గూర్చి నివేదిక తయారుచేద్దామనే సదుద్దేశంతో విదేశాలన్నీ తిరిగివచ్చాడు. పర్యటన జయప్రదంగా, ఖుషీగా, జరిగింది. కాని నివేదిక మాత్రం తయారుకాలేదు. ఇక లైట్‌హౌస్‌లను ఆధునిక పద్ధతులలో అభివృద్ధిచేసే పనిమాత్రం రవాణాశాఖ కార్యదర్శి శ్రీ నీలకంఠ మహాదేవ అయ్యర్ పూనుకుంటే నేగాని జరగలేదు.

* * *

ఇతర దేశాలవాళ్లు భారతదేశం సాధించిన అభివృద్ధినిగూర్చి చేసిన ప్రశంసలను భారత ప్రధాని అస్తమానమూ ఉటంకిస్తూ ఉంటారు. జాన్‌స్ట్రాచీ భారత రక్షణశాఖ మంత్రి (బహుశా డా॥ కైలాసనాథ్ కట్జూ)ని గూర్చి చేసిన ప్రశంస ఇందుకొక ఉదాహరణ. "పేజెస్ ఫ్రమ్ ఇండియన్ డైరీ" అనే గ్రంథంలో జాన్‌స్ట్రాచీ ఇలా వ్రాశారు:

"మంత్రిగారూ! మీ రాజపుత్ర దళం చేసే కవాతు ఈ దినమంతా చూశాను. ఆ దళంలోని మంచి మంచి వాళ్ళందర్నీ ఏరినట్లున్నారే?" అన్నాను నేను.

"అవును" అంటూ మంత్రిగారు గది అంతా కలయచూసి "అవును. వచ్చేనెల మేము బుద్ధజయంతి ఉత్సవాలు చేయబోతున్నాము, తెలుసా?" అన్నారు.

"మీ రాజపుత్ర సైనికులను వివిధ దశలలో ఎలా తరిఫీదు చేస్తారో కూడా నాకు చూపించారు. ఒక ముఠాలో కొత్తగా ఆరోజునే దళంలోకి చేరినవారున్నారు. ఇంకో ముఠాలో పది రోజుల క్రితం చేరినవారూ, ఇంకో ముఠాలో 21 రోజుల క్రిందట చేరినవారూ ఉన్నారు. 21 రోజుల క్రితం చేరిన సైనికులకు అప్పుడే బేయొనెట్ ప్రయోగం నేర్పుతున్నారు. చాలా నైపుణ్యంతో వారు ప్రయోగం నేర్చుకుంటున్నారని నాకనిపించింది," అని నేనన్నాను.

"అంతేకాదు. మేము బుద్ధజయంతితో పాటు, సంబుద్ధి, పరినిర్వాణ ఉత్సవాలను గూడా వైభవంగా జరపదలచుకున్నాము."

"నేను చూసిన సైనికులలో రాజపుత్ర దళంవారేకాక, అంగరక్షకదళంవారుకూడా ఉన్నారని చెప్పారు. మీ రాష్ట్రపతి భవనం వద్ద ఉన్న అంగరక్షకులు మంచి చురుకైనవాళ్లని నాకనిపించింది," అని మళ్లీ అన్నాను.

మంత్రిగారిలా సమాధానమిచ్చారు: "మామూలుగా ప్రాచీన సంప్రదాయం ప్రకారం బుద్ధుని జననం, సంబుద్ధి, నిర్వాణం మూడూ ఒక రోజునే పడ్డాయి." ఓ చిన్న చిరునవ్వు విసిరి "ఇది చారిత్రకంగా నిజమో కాదో ఎవరు చెప్పగలరు? ఏమైనా మేము మాత్రం మూడూ ఒక రోజునే చేస్తాము," అన్నారు.

నేను: "కవాతు మైదానంలో అంతా చూసిన తరవాత రాజపుత్రదళం తాలూకు భోజనశాలలో నాకు విందు చేశారు. ముఖ్యంగా యువక ఉద్యోగులు నాకుబాగా నచ్చారు. వారు మంచి దేశభక్తులేకాక, మీ ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోనూ, దేశాభివృద్ధి విషయంలోనూ మంచి ఆసక్తి కనబరుస్తున్నట్లు అనిపించింది."

మంత్రి: "మీరొకటి మాత్రం జ్ఞాపకముంచుకోవాలి. మేము బౌద్ధమతం, హిందూమతం పరస్పర విరుద్ధ మతాలని ఎప్పుడూ భావించము. మా బ్రాహ్మణులకు బుద్ధుడు సాక్షాత్తు భగవంతుని అవతారమే. మీరు బౌద్ధమతానికీ హిందూ మతానికీ సంబంధం లేదని అనుకుంటారు గాని మేములా అనుకోము. అందుకే మేమీ ఉత్సవాలు చేస్తున్నాము."

నేను: "మీ సాయుధ సైన్యంలోని మూడుశాఖలూ మీ దేశానికి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించగలవని నా నమ్మకం. మీ సైన్య శాఖలలో కొన్నిటిని చూసే అవకాశం నాకు కలగజేసినందుకు కృతజ్ఞుణ్ణి."

మంత్రిగారు (బహుశా డా॥ కట్జూ) భారతదేశపు అహింసా విధానాన్ని భారత సాయుధ సైన్యాన్ని సమన్వయం చేయడానికి ప్రయత్నించారనుకుంటాను. అన్ని దేశాలకూ బ్రాడ్‌కాస్టు చేయవలసినంత చక్కగా పై సంభాషణ నడిపిన డా॥ కట్జూ గారికి తప్పకుండా ప్రమోషను ఇవ్వాలి.

ఢిల్లీ ప్రాంతంలో ఒక కథ చెప్పుకుంటారు: దారుణమైన చెముడుగల ఒక పెద్ద మనిషి వంకాయలు కొనుక్కుని మార్కెట్టునుంచి తిరిగి వస్తోంటే, దోవలో ఒక స్నేహితుడు కనిపించి "ఏమోయ్, కులాసా?" అని అడిగాడు.

చెవిటివాడు: "ఆ, ఏం లేదు, వంకాయలు కొనుక్కుని వస్తున్నాను.

మిత్రుడు: పిల్లలంతా కులాసా?"

చెవిటివాడు: "వేపుడు కూర చేయిస్తాను."

దీనిపై వేరే వ్యాఖ్యానమెందుకు? ★

చిలుకపచ్చ సిల్కు చీర

అమ్మనబ్రోలు

శ్రీరస్తు చిరంజీవులైన మా అల్లుళ్లు వలూరి జనార్దనరావును పుత్రపౌత్రాభివృద్ధిగా దీవించి వ్రాయునది. తె॥ యిక్కడ అంతా క్షేమము. మీ క్షేమములు తరచుగా వ్రాయుచుండవలయును. మా అమ్మాయి చి॥ సౌ॥ జానకిని చూచి చాలా రోజులైనది. దానిని చూడవలెనని యిక్కడ అందరము ఉవ్విళ్ళూరుతున్నాము. గనుక వీలు చూచుకుని నీవు దాన్ని యిచ్చట దింపిపోగలవని నమ్ముతున్నాను. ఏమో వ్రాశాననుకోవద్దు. మీ అత్తగారు, మరదళ్లు మరీ మరీ వ్రాయమన్నారు. ఇక్కడ యావన్మంది కుశలము.

గ్రహించవలెను.

ఇట్లు

నుదురుపాటి శేషాచలం వ్రాలు.

నీవు కూడా వీలైతే నాలుగురోజులు ఆఫీసుకు సెలవు పెట్టి రావలెను. ను॥ శే॥

* * *

గుంటూరు

మామగారికి-నమస్కారాలు.

మీరు వ్రాసిన కార్డు చేరినది. మీ అమ్మాయికి చదివి వినిపించినాను. ప్రస్తుతం ఆఫీసు ఇన్‌స్పెక్షన్ జరుగుతున్నందువల్ల మాకు సెలవు దుర్లభం. అందువల్ల మీ అమ్మాయిని శ్రమ అనుకోక మీరేవచ్చి తీసుకుపోతే నాకేమాత్రం అభ్యంతరము లేదు. అత్తగారికి యీ సంగతి చెప్పవలెను. చి॥ పిల్లలు క్షేమముగా ఉన్నారని తలుస్తాను.

ఇట్లు,

వ॥ జనార్దనరావు.

* * *

అమ్మనబ్రోలు

శ్రీరస్తు చిరంజీవులైన మా అల్లుళ్లు వల్లూరి జనార్దనరావును పుత్రపౌత్రాభివృద్ధిగా దీవించి వ్రాయునది. తె॥ నీవు వ్రాసిన జాబు చేరినది. ఇచ్చట మీ అత్తగారికి ఒంట్లో బాగులేదు. పిల్లలే వంటపని చూస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో నేను గడపదాటి వచ్చుటకు వీలుపడేటట్లుగా లేదు—నేను బొత్తిగా పెద్దవాడినైపోయినాను. ఒక్కపూట ఎట్లాగో వీలుచేసుకుని చి॥ అమ్మాయిని తీసుకువచ్చి యిచ్చట దింపిపొమ్మని మరీమరీ కోరుతున్నాను. ఇచ్చట యావన్మంది క్షేమము. నీయొక్క, చి॥ జానకియొక్క క్షేమము తరచు తెలుపవలెను.

గ్రహించవలెను.

ఇట్లు,

నుదురుపాటి శేషాచలం వ్రాలు.

* * *

గుంటూరు

మామగారికి.నమస్కారములు.

మీరు కోరిన ప్రకారము రేపు రాత్రి ప్యాసింజరుకు నేను మీ అమ్మాయిని తీసుకుని వస్తున్నాను. కనుక తెలియపరుస్తున్నాను. అత్తగారి ఆరోగ్య పరిస్థితి ఎట్లా ఉన్నది?

ఇట్లు,

వి. జె. రావు.

* * *

అమ్మనబ్రోలు

పూజ్యులైన భర్తగారికి—జానకి అనేక నమస్కారములుచేసి వ్రాయునది ఏమనగా—

ఇచ్చట అంతా క్షేమము. అచ్చటి మీ క్షేమములు వ్రాయగోరుతాను. ఇక్కడ మా అమ్మకు కులాసా చిక్కినది. మొన్ననే పథ్యము పెట్టినాము. మీకు హోటలు భోజనము సరిపడదు. ఎట్లా తింటున్నారో అనే ఎల్లప్పుడూ ఆలోచిస్తున్నాను. పనిమనిషిని ఒక కంట కనిపెట్టి ఉండండి - ఏ వస్తువు కనబడ్డా బతకనివ్వదు. దొడ్లో పూస్తున్న సన్నజాజిపూలు, గన్నేరుపూలు పక్కింటి సుందరిని కోసుకోమని చెప్పండి. ఊరికే వాడిపోతే మనకేమి లాభం? ఇక్కడ నాకు తోచటంలేదు. మా చెల్లెళ్లు కులాసాగా ఉన్నారు. మీరు సినిమాలకి ఎక్కువగా పోయి నిద్ర చెడగొట్టుకోవద్దు. అసలే మీది జబ్బు శరీరం.

ఇంతే సంగతులు,

చిత్తగించవలెను

మీ జానకి.

పాలమనిషికి నాగాలు పోను పోయిన నెలకు యివ్వవలసింది రెండు రూపాయలే.

వ॥ జా॥

* * *

గుంటూరు

ప్రియమైన జానకికి—

నీ ఉత్తరం చేరింది. అత్తగారికి పథ్యం పెట్టినట్లు రాశావు. చాలా సంతోషం. నేను అనుకున్నంతగా హోటలు భోజనం అసహ్యంగా లేదు. బ్రాడీపేట 'శంకరవిలాస్'లో భోజనం చేస్తున్నాను. రోజు కొక ఇంగ్లీషు కూర చేస్తున్నాడు. నాకు బాగానే ఉన్నది. అయినా నాలుగురోజుల భాగ్యానికి ఎక్కడో అక్కడ తింటే సరిపోతుంది. సుందరి రోజూ మనదొడ్లో పూలు కోసు కెళ్లుతున్నది. పనిమనిషి సరిగ్గా రావటం లేదు. పాలమనిషికి నీ లెఖ్ఖ ప్రకారం డబ్బు లిచ్చేశాను. వాటిని గురించి ఏమీ బెంగ పెట్టుకోవద్దు. ఇక్కడికి మంచి హిందీ పిక్చర్సు రావటంలేదు. నీకు తెలిసిందేగదా! తెలుగు పిక్చర్సుకి పోయి డబ్బుపెట్టి తలనొప్పి కొనితెచ్చుకోలేను. మొన్నటి ఉత్తరం మీద యింగ్లీషులో అడ్రసు రాసింది నువ్వే ననుకుంటాను. తప్పులేకుండా చక్కగా రాశావు. అలా రాయటం చేస్తుకుంటుంటే అదే అలవాటవుతుంది.

ఇక ఉంటాను,

నీ

జనార్దనరావు.

* * *

అమ్మనబ్రోలు

పూజ్యులైన భర్తగారికి.

జానకి అనేక నమస్కారములు.

యిచ్చట అంతా క్షేమము, మీ క్షేమము తెలుపగోర్తాను. అమ్మకి పూర్తిగా స్వస్థత చిక్కినది. నేను పదిపదిహేను రోజుల్లో బయల్దేరి వద్దామనుకుంటున్నాను. ఇక్కడ బొత్తిగా పొద్దుపోవటం లేదు. నాకు చెల్లెళ్లతో గవ్వలాట్టం తప్ప చేయగలపని కూడా కనబడటంలేదు. రోజూ పాలు ఎన్ని పోయించుకుంటున్నారు? కాఫీ కాచుకుంటున్నారా లేక బజారు చివర ఉన్న అయ్యరు హోటలువాడికి ముడుపు చెల్లిస్తున్నారా? మీది అసలే జబ్బు శరీరమని ప్రతిసారీ గుర్తు చెయ్యవలసి వస్తున్నది.

* * *

కొండముది దత్తాత్రేయశర్మ

చిలుకపచ్చ సిల్కు చీర

హోటళ్లల్లో అన్నీ నూనె వస్తువులు గనుక ఎక్కువగా తినవద్దు. డబ్బుకు డబ్బూ దండగ. పైగా వంటికి మంచిది కాదు. రోడ్డితలుపుకు తాళంమాత్రం తప్పకుండా వేస్తుండండి. సన్నజాజిపూలు యింకా పూస్తున్నాయా? సుందరి రోజూ యిష్ట మొచ్చినన్ని కోసుకెళ్ళి వంకులజడ వేయించుకుంటున్నది కాబోలు!

త్వరలో జవాబు రాయవలెనని కోరిక.

ఇట్లు
మీ
ప్రియమైన జానకి.

● * *

గుంటూరు,


ప్రియమైన జానకికి,

ఈమధ్య యిక్కడో చిత్రం జరిగింది. మన వీధిచివర డాబాయింటి వాళ్లమ్మాయి వసంతికి పెళ్ళి సంబంధం వచ్చిందిట. ఆ వచ్చే పెళ్ళికొడుక్కి 'చిలుక పచ్చసిల్కు చీరం'టే తగని ప్రేమట. ఈసంగతి ఎలాగో వీళ్లకి ముందే తెలిసి పెళ్ళిచూపులనాడు ఆ అమ్మాయికి చిలుక పచ్చసిల్కు చీర కట్టి చూపించాలనుకున్నారట. మన వీధిలో ఆ చీర నీదగ్గర తప్ప మరెక్కడా లేదని ఆపిల్ల మేనత్తా—దాని చెల్లెలూ ఆదరాబాదరాగా పడి మనింటికొచ్చారు. ఆ చీర ఏమిటో నాకు తెలియదని ముందు తప్పించుకుందామని చూశాను. ఆ పిల్ల మేనత్త పెద్ద ఆరిందాలాగా 'మీకు తెలియకపోతే ఆడవాళ్ళం మాకు తెలియదుటండీ ఆ గుడ్డలబీరువా బీగాలిట్లా పారెయ్యండి' అన్నది. ఇంకేమి మాట్లాడేది? తాళంచెవులిచ్చేశాను. ఐదు నిమిషాల్లో ఆ సిల్కుచీర తెచ్చి 'పెళ్లిచూపు లైపోగానే పంపుతాలెండి జానకి వచ్చిన తర్వాత నేను చెబుతాను కావాలంటే' అని చెప్పి తీసుకెళ్ళింది. చీర తీసుకెళ్లి వారంపైనే అయింది. ఇంతవరకూ చీర మనింటికి రాలేదు. అక్కడికీ వసంత చెల్లెల్ని పిల్చి "ఇవాళ రోజూ పెళ్ళి చూపులేనా ఏమిటి? మాచీర తీసుకురా"మ్మని గట్టిగా చెప్పాను. ఆపిల్ల 'అమ్మో! నాకు తెలీదు. ఆచీర తెస్తే మా అత్తయ్య తంతుంది.' అని జవాబిచ్చింది వాళ్ళ అత్తయ్య కనబడితే నిలదీసి అడిగేద్దును. ఇంతవరకూ కనబడలేదు. నీవు చీరను గురించి ఏమీ బెంగపెట్టుకోవద్దు. చీర ఎట్లా రాకపోతుందో చూస్తాను. చీర పాడైతే దాని ఖరీదు అణాపైసల్తో సహా కట్టిస్తాను.

ఏ సంగతీ మళ్ళీ రాస్తాను.

నీ
జనార్దనరావు.

● * *



గోదావరి దృశ్యం

ఫోటో: పి. మనూరం

అమ్మనబ్రోలు

పూజ్యులైన భర్తగారికి

జానకి అనేక నమస్కారములు.

మీరు రాసిన రెండు పేజీల ఉత్తరం చదివి ఆశ్చర్యపోయినాను. ఇచ్చిన వస్తువు తిరిగి తెప్పించుకునే శక్తి లేనివారు ఎందుకు యివ్వాలి? దీంట్లో తప్పంతా మీదే. దాని చెయ్యి అసలే మంచిది కాదు. అది అడిగితే మాత్రం అడిగినవాళ్ళు యింట్లో లేరని చెప్పక గుడ్డల బీరువా తాళంచెవులెందుకివ్వాలి? అది బీరువా అంతా వెతికి పారేసి ఉంటుంది. చేతికి అందినంత వరకూ ఒకటో రెండో గుడ్డలు చక్కబెట్టుకొని ఉంటుంది. అసలప్పుడు మీరు ఏధ్యానంలో ఉన్నారో? నా చిలకపచ్చ సిల్కుచీరకు ఏ నష్టం వచ్చినా మీరే బాధ్యులు. ఒకవేళ పోతే కొనివ్వక తప్పదు. అసలు మీ మెతకదనం చూసే ఎత్తుకెళ్ళిన సిల్కుచీరను తిరిగి యివ్వటానికి దానికి బుద్ధి పుట్టటంలేదు.

అవ్వ! యీ సంగతి నలుగురికీ తెలిస్తే ఎంత నామర్దా? పని చీర పోతే పోయిందిగాని ఈ విషయం నలుగురి చెవుల్లో పడనివ్వవద్దు. నేనొచ్చి అన్ని విషయాలు చక్కబెట్టుకుంటాను. వీలైతే కొప్పమ్మ పిన్నిగారితో మాత్రం యిట్లా అని చెప్పండి.

ఈ ఉత్తరం చదివిన వెంటనే చించివేయవలయును.

ఇంతే సంగతులు
ఇట్లు మీ
జానకి

* * *

గుంటూరు

ప్రియమైన జానకికి,

'మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ' సామెతగా ఉంది నీ ఉత్తరం. చీరెను గురించి నేను బాధపడుతుంటే నీవు నన్ను అర్థం చేసుకోలేక పోయినావు. నీ ఉత్తరంతో ఆటంబాంబు పడ్డ వాడి మాదిరిగా ఫీలయ్యాను.

నిన్న సాయంత్రం శివాలయం దగ్గర మేనత్త కనిపించింది. చీర విషయం అటుంచ దామనుకుంటే ఆమెకు అంగరక్షకులుగా యిద్దరు ధవళవస్త్ర కిరీటధారు లున్నారు. వారేదైనా అపార్థం చేసుకుంటారేమో నని అప్పటికి ఒదిలేశాను.

ఇవ్వాళ ఉదయం (నేనీ ఉత్తరం ఆఫీసులో కూర్చుని 11 గంటలకు రాస్తున్నాను) వసంత చెల్లెలు (జానకి ఊరినుంచి వచ్చిందేమో మా అత్తయ్య చూసి రమ్మన్నదండీ అని వచ్చింది. 'అది యింకా రాలేదుగాని మా చీర ఎందుకు తేలేదు?' అని అడిగాను. ఆ పిల్ల వగరూ బెగరూ లేకుండా ఎకసక్కెంగా నవ్వేసి తుర్రున పారిపోయింది.

ప్రస్తుతం పరిస్థితి యిట్లా ఉన్నది. కొద్ది కాలంలో చీర లభించే లక్షణాలు కనబడుతున్నాయి.

అశనిపాతంలో అంబువు....

హైడ్రోజన్ బాంబు కూడా అభివృద్ధికి దోహదం చెయ్యగలదు. దాని వల్ల వర్తక వ్యాపారాలు బాగా పెరుగుతాయి!

అమెరికా వాణిజ్యమండలి సమావేశంలో, ఒక ఆర్థిక శాస్త్రవేత్త, ఈ మధ్య వెలిబుచ్చిన అభిప్రాయం ఇది.

...ఎప్పుడు ఎంత ముప్పు వచ్చిపడుతుందోనన్న భయంతో జనం భవిష్యత్తుపై సుదీర్ఘ పథకాలు వేసుకోరు. అంటే, ఆట్టే రోజులు ఈ జనం, ఈ గోళం, ఇలా ఉండకపోవచ్చునన్న అభిప్రాయం కలుగుతుందన్నమాట. తత్ఫలితంగా, ఉన్నవాళ్లూ ఉన్నంతలోనే వీలైనంత ఎక్కువ సుఖపడదాం అనే తత్వం బయలుదేరి బాగా వంటబడుతుంది. అక్కడితో అందరు డబ్బు వెనకేసుకునే ధోరణికి ఉద్వాసన చెప్పి చురుకుగా ధారాళంగా ఖర్చుపెట్టడం మొదలుపెడతారు. అంతా జీవన ప్రమాణం పెరుగుతుందన్నమాట.

ఇదీ ఆ అమెరికన్ వేత్త వాల్టర్-ఇ. హోడ్లీ జూనియర్ చేసిన వాదం.

మొత్తంమీద, ప్రపంచవ్యాప్తంగా మహా విధ్వంసకశక్తిగల ఆయుధమని పేరుపడ్డ హైడ్రోజన్ బాంబు భయంకర మేఘాల మధ్య, "ఫరవాలేదు. తరవాత సంగతి ఏమైనా ముందు వ్యాపారం బాగుపడుతుంది" అని ఓదార్చే డాలర్ మెరుపులు చూపించడానికి ఇదే తొలిసారి.

శ్రావణి

'శాస్త్రి'

నీలి మబ్బులలోన
గాలి వాలులలోన
తెలి మాలికలై
బలాక లాకాశాన
బాలికా బాలకుల
కోలాహలములోన
మేళ తాళాలెగసె
మింటి దివ్వెలలోన
ప్రేలాడె హరివిల్లు నీలాలనింగిపై
లీలగా రతనాల డోలికాకృతియై

* * *

వారిధారావళుల నవభాసితమై
గగనాన, సాంధ్యరా
గారుణ శ్రావణేందిర విహార
మొనర్చె సుహృద్వరా! గృహ
ద్వారము జేరి, క్రొమ్మెరుగు దా
రల జాడ్కి నిగిడ్చి, వేడిక
న్నీ రొలికింతువే! అనుగు నె
చ్చెలి యెవ్వరి కోసమో గదా!

* * *

జలధరనాద మించుకదిశా
పథ సీమ వదించె నేని, నె
చ్చెలి యెపుడో గృహాంగణము
చేరక పోవదు లెమ్మ, వేలపై
కలవరమంద నేల చెలికాడ!

నిజమిద్ది నమ్మవిూ! ధరా
తలదృఢరాగ బంధమౌని
శాంతి మనశ్వరమై నిలంబడున్

* * *

తరుశాఖికలు వర్షధారలో తలవాల్చి
చదలేటి నీట మజ్జనము సలిపె
పసిరి పచ్చికలలో మిసిమితో విలసిల్లె
నవశాద్వ లాంకూర నాట్యలీల
ఆకాశగానమే యాలకించెనో యేమొ
లీల నూగాడె వల్లీచయమ్ము
హరితశోభామనోహరమై ప్రపంచమ్ము
నూతన భువనమ్ము భాతి వెలిగ
నాకలోకమ్ము మిథ్యయో కాక నిజమొ!
ఎవ్వరెరుగరులే! దాని కేమిగాని
అమృత వర్షామనోజ్ఞమీ యవనితలము
దివ్యధామమ్ము సౌందర్యదీపితమ్ము!

* * *

హారమ్ములతో గడు నా
య్యారముతో లలితభూష
ణాంబరములతో
పేరంటమ్మున కరిగెడు
నారీ నివహమ్ము లోచన
ద్వయి మెరసెన్

* * *

జలజల వర్షావీణా
కిలరావము రేగ హృదయకమనీయమ్మై
ఇలయే కల్యాణీమం
గళరాగాలాపగీతి గా స్వనియించెన్
—(ఆకాశవాణి సౌజన్యంతో).

నిద్రాభంగం!

ప్రభుత్వోద్యోగి: ఇవాళ్టి నించి ఆఫీసుకి "టీ" పంపించవద్దు. ఏ కాఫీ అయినా పంపు.

భార్య: అదేం? మీకు "టీ" అంటే ప్రాణంగా.

ఆయన: అయితే అయింది గాని, ఆ టీ, తాగిన క్షణం నించి అస్సలు నిద్రపట్టటం లేదంటే నమ్మ.

దెబ్బపై దెబ్బ

"రసాయనిక ఎరువులమాహాత్మ్యము" గురించి గంభీరంగా గంటసేపైతే ఉపన్యాసం దంచేసిన వ్యవసాయ శాస్త్ర పట్టభద్రుడు ఉపన్యాసాంతంలో ఢంకా మీద దెబ్బ కొట్టి వేయేల...? అన్నారు.

అని "ఒక్కటే చెబుతా వినండి, ఒక ఎకరం పంటకి సరిపోయే ఎరువుని చొక్కా జేబులో వేసుకుతిరిగే రోజు అట్టే దూరంలేదంటే నమ్మండి" అని ఉద్ఘాటించాడు.

"మరే ఆ ఎరువులో పండే పంటను కూడా రెండు జేబుల్లో వేసుకుని నిక్షేపంలా తిరగొచ్చు" అన్నాడు నమ్మకం కుదరని 'భారత దేశపు వెన్నెముక'

★ చిలుకపచ్చ సిల్కు చీర ★

ఏమైనా నేను ఆశావాదిని. వివరాలు మరో ఉత్తరంలో రాస్తాను.

నీ

జనార్దనరావు.

*   *   *

అమ్మనబ్రోలు

పూజ్యులైన భర్తగారికి.

జానకి అనేక నమస్కారాలు.

మీ ఉత్తరము చూచి చాలా గాభరా పడినాను. పోయినవస్తువేదో ఎట్లాగూ పోయింది గదా! యింకా వాళ్ళతో మీరు మాట్లాడట మెందుకు? అది ఎంతకయినా తెగించేరకం. ఆ సిల్కు చీరకు ఎప్పుడో నీళ్లు వదులుకున్నాను. మీకు అది కనబడ్డా దానితో మాట్లాడవద్దు. అసలు దాన్ని గురించి గానీ, చీరను గురించి గానీ ఆలోచించవద్దు. ఇంకోవారం రోజులలో నేను వచ్చి ఎట్లాగూ దానిపని పడతాను. ఈలోగా ఏమీ లేనట్టే మామూలుగా ఉండండి. పోనీ రెండురోజులు శెలవు పెట్టి యిక్కడికి రాకూడదా? ఎప్పుడూ ఉండే ఆఫీసు పనేగదా! అదేమైనా తరుగుతుందా? పెరుగుతుందా?

సన్న జాజిపూలు సుందరిని తప్ప ఎవరినీ కోసుకోనివ్వవద్దు.

ఇక్కడ అంతా క్షేమము.

ఇంతేసంగతులు

మీ ప్రియమైన

వల్లూరి జానకి.

*   *   *

ప్రియమైన జానకికి—

గుంటూరు

ఇప్పుట నేను కులాసాగానే ఉన్నాను- చీరెనుగురించి ఆలోచించటం మానుకున్నాను. నిన్న మాతమ్ముడు శర్మ వాల్తేరు నుంచి ఉత్తరం రాశాడు. రెండు రోజుల్లో బయల్దేరి గుంటూరు వస్తున్నానని, పది రోజులు యిక్కడ ఉంటానని, నాతో ఏదో ముఖ్యవిషయం మాటాడాలని కూడా రాశాడు. వాడు రాకరాక వస్తున్నాడు. నీవు యింట్లో లేకపోతే హోటలుకూడు ఇక్కడా వాడికి తప్పదు: కనుక వీలుచూచుకుని నీవు యిక్కడికి వెంటనే వచ్చెయ్యి, మామగారితో ఈసంగతి చెప్పు.

రేపే రావటానికి ప్రయత్నించు.

మీ అందరి క్షేమములు తెలియజేయ గోర్తాను—

నీ

జనార్దనరావు.

*   *   *

అమ్మనబ్రోలు,

పూజ్యులైన భర్తగారికి నమస్కారములు,

నేను నిన్న బయల్దేరుదామనుకుంటుండగా మా అమ్మకు తిరిగి జ్వరంతగిలినది. ఇవ్వాళా రేపూ చూపి బయల్దేరమని నాన్న ఒకటే గోల చేస్తున్నాడు. అందువల్ల మరిదిని ఇంకో నాలుగు రోజులు ఎక్కువగా ఉండేటట్లు చూడండి. తప్పకుండా రెండు రోజుల్లో వస్తాను.

మీ,

జానకి.

*   *   *

గుంటూరు,

ప్రియమైన జానకికి—

నీ "చిలుక పచ్చసిల్కు చీర" గర్తపురి ప్రణయ చరిత్రలో క్రొత్త పుటలు లిఖించటానికి ద్రోహదంచేసింది. శర్మ నిన్న ఎక్సుప్రెస్‌లో వచ్చాడు. నీ సిల్కు చీరె కథ సంగ్రహంగా రాస్తున్నాను:

వసంతకి పెళ్ళి సంబంధం వచ్చిందని మన సిల్కు చీర తీసుకెళ్ళిన నాడు పెళ్ళికొడుకు ఎందుచేతో రాలేదుట. ఆ మరు వారంలో వస్తాడని జాబు వచ్చిందట. అందువల్ల ఈలోగా చీరెయిచ్చి మళ్ళీ తీసుకెళ్ళి మళ్ళీ తిరిగి తెచ్చి యివ్వటం దేనికనే ఉద్దేశ్యంతో చీరెను వాళ్ళింట్లోనే ఉంచారట. అసలు అమితాశ్చర్యకరమైన విషయమేమిటంటే వసంతను చూడవచ్చిన పెళ్ళి కొడుకు మన శర్మేను. వసంత అన్నయ్య మోహన్‌రావుకూడా వీడితో బాటు వాల్తేరులో యఫ్. యల్. చదువుతున్నాడు. పైగా యిద్దరూ రూంమేట్సు. మన వాడేదో కథలు గిలుకుతుంటాడుగా! వాడి ప్రతి కథలోనూ కథానాయికను చిలుక పచ్చసిల్కు చీరె తప్ప మరోటి కట్టనివ్వడటగా! ఆ కథలేవో నీవే చదివుంటావు! నాకు ఆ గోలే పట్టదాయె, చిలుక పచ్చ సిల్కు చీరంటే మనవాడికి వల్లమాలిన ప్రేమని మోహన్‌రావు కనిపెట్టాడుట. వసంత ఇంటర్ లోపార్ట్ తీతప్పినాదాని గ్రూపులో "స్పెషల్ తెలుగు" తీసుకుందిట. అది వాళ్ళన్నయ్యకి రాసే ఉత్తరాల నిండా కవిత్వం గీకి వదిలి పెట్టేదిట. సరే! ఒకటి రెండు ఉత్తరాలు మనవాడి కంటబడ్డాయి. దాంతో మనవాడికి ఆ అమ్మాయి మీద "ప్రబంధ ప్రేమ" పుట్టుకొచ్చింది మోహన్‌రావు సమయం కనిపెట్టి మనవాడిని పిల్లని చూడటానికి ఒప్పించి ఇంటికో జాబు రాశాడుట. వచ్చే వరుడికి చిలుక పచ్చ సిల్కు చీరంటే తగని ప్రేమని, వసంతని పెళ్ళి చూపుల నాడు ఆ చీర కట్టుకోమని, శర్మ నా తమ్ముడని కూడా మోహన్ రాశాడట. అయినా శర్మకు తెలియకుండా మన ఎదుట బయట పెట్టట మెందుకులే అని ఊరుకున్నదిట "మేనత్త". కాని అనుకున్న ప్రకారం ఆనాడు రాలేక పోయారు శర్మా, మోహన్. కొన్ని ముఖ్యమైన క్లాసులున్నందువల్ల రావటానికి వీలులేకపోయింది. వచ్చేవారం చివరలో వస్తామని మోహన్ జాబురాశాడుట. శర్మ అకస్మాత్తుగా వచ్చి పెండ్లి నిశ్చయం చేసుకుని మనల్ని ఆశ్చర్యపర్చుదామని ఈ విషయం బయటికి పొక్కనివ్వ వద్దన్నాడుట. ఈ లోగా నీవు వచ్చావేమో చీర పంపుదామని కబురుచేస్తే నీవు యింకా రాలేదని తెలిసింది. ఈ నాలుగు రోజుల్లో మళ్ళీ చీర తిప్పియివ్వటమెందుకులే అనుకుని వాళ్ళింట్లోనే ఉంచారుట. ఇది జరిగినకథ.

సరే శర్మ మన యింట్లోనే దిగాడు. సంగతంతా చెప్పి వసంతను చూడటానికి నీవు లేనందుకు ఎంతో నొచ్చుకున్నాడు. శర్మను మించిన మాటకారి మోహన్. వాళ్ళింట్లో కూర్చున్న ఆకాసేపు ఒకటే గోల. మనవాడు ఏదో కాబోయే ఇంటల్లుడు గదూ! కాస్త మౌనం పాటించాడులే. నేనెప్పుడూ వసంతని అంత పరీక్షగా చూడలేదు. గాని చెబితే నమ్మవు. ఆ చిలుకపచ్చ సిల్కు చీరెలో సాక్షాత్తు లక్ష్మీదేవిలాగా వెలిగిపోయిందంటే నమ్మ. కట్నం కానుకలూ వద్దని, వారిస్తామన్న ఐదు వేలూ 'బహుమతి'గా పుచ్చుకుంటానన్నాడు. కాబోయే అడ్వొకేటు గదూ!

'ఒరేయ్! పిల్లని చూశావా? చిలుకపచ్చ సిల్కు చీరెనే చూస్తూ కూర్చున్నావురా?' అని అడిగాడు మన 'బాలు'.

"మైగాడ్! చిలుకపచ్చ సిల్కు చీరంటే అదిట్రా. నేనింతవరకూ ఎక్కడా చూసిన పాపాన పోలేదు. ఏదో ఊహించుకుని కథల్లో వాడుతున్నాగాని!" అని శర్మ తేల్చేశాడు... మేమిద్దరం నోళ్లు తెరిచాము.

★ చిలుకపచ్చ సిల్కుచీర ★

"నాదగ్గరంటే అన్నావు గాని... మోహన్ దగ్గర అనేవు! నీ భావనాశక్తిని బజారు పాలు చేస్తాడు" అని బాలుగాడు సలహా యిచ్చాడు.

ఇంతకూ నీ చిలుకపచ్చ సిల్కుచీరకే ఈ 'క్రెడిట్' అంతాపోతుంది—పెళ్ళి చేసుకోనని పంతంపట్టిన శర్మను పెళ్ళికి ఒప్పించేసింది, 'చిలకపచ్చ సిల్కుచీర' అని ఇక్కడ అందరి అభిప్రాయమూ.

ఇక ముహూర్తాలు పెట్టుకోటమే తరువాయి. అత్తగారికి ప్రస్తుతం ఎట్లాఉన్నది? నీవు త్వరపడి రానక్కరలేదు. శర్మ రెండు రోజుల్లో వాల్తేరు వెళ్ళిపోతానంటున్నాడు. వాడి పెళ్ళిలో నీకొక చిలుకపచ్చ సిల్కుచీర ప్రజెంటు చేస్తాడుట. ఇక ఉంటాను.

నీ

జనార్దనరావు.

P.S: నీ చీర నిన్న సాయంత్రమే మన యింటికి చేరింది. కనుక నీవు నిశ్చింతగా నిద పోవచ్చు.

*　　*　　*

అమ్మనబ్రోలు

పూజ్యులైన భర్తగారికి—

జానకి అనేక నమస్కారములు.

మీరు రాసిన అంతపెద్ద 'కథ' నవ్వు తెప్పిస్తున్నది. ఇదంతా చూస్తే ఏదో 'కథ'గా కనబడుతున్నది గాని జరిగిన విషయం మాదిరిగా లేదని నాకు అనిపిస్తున్నది కొంప దీసి 'సిల్కుచీర'ను గురించి మనిద్దరిమధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల విషయం మరిదికి చెప్పుతారేమో! అతను ఏమాత్రం సందు దొరికినా ఈ విషయమంతా ఒక 'కథ'గా రాసి ఏ పత్రికకో పంపుతాడు. అప్పుడు పలువురికీ తెలిస్తే నవ్వుతారు—పైగా నా ఉత్తరాల్లో వసంత మేనత్తను గురించి చాలా కటువుగా రాశాను. వాళ్ళకి ఈ సంగతి తెలిస్తే రేపు బాగుండదు. తన పెళ్ళిలో నాకు ఓ 'చిలుకపచ్చ సిల్కుచీర' కొని పెడతానని మరిది అన్నాడని రాశారు. ఎంత మాత్రం మాట నిలుపుకుంటాడో చూస్తానుగా! అమ్మకి కులాసా చిక్కింది. నేను ఈ వారంలో తప్పక వచ్చేస్తున్నాను. మరిదిని వెళ్ళనివ్వవద్దు. ఆటలు పట్టించటానికి యింతకన్నా నాకు సమయం దొరకదు—యింత గ్రంథం నడిపిన పెద్దమనిషిని ఒదల కూడదు.

మన ఉత్తరాలు మాత్రం బయటపడకుండా జాగ్రత్త వహించండి. శర్మకు తెలిస్తేమాత్రం ఊరుకోడు. ఇంతకీ వసంత అదృష్టవంతురాలు. దానికి అనుకూలుడూ, చదువూ, అందం, ఆస్తీ, ఉన్నవాడు భర్తగా దొరికాడు. ఇక్కడ మా చెల్లెళ్లు కులాసాగా ఉన్నారు—

ఇంతే సంగతులు

మీ జానకి— ★

నిగ్రహానుగ్రహాలు

నిలుచున్న పాటున ఒకసారి వచ్చి తనని కలుసుకోవలసిందని రాఘవేంద్రంగారి దగ్గరినుంచి కబురు వచ్చింది. ఉలికిపడ్డాడు శేఖరం. తనేం పొరబాటు చేశాడు? ఏదో చేసివుంటాడు! చేసివుండకపోతే రాఘవేంద్రం గారు కబురు పంపరు.

శేఖరం చరచరా యింట్లోకి వెళ్లాడు. "ఏమేవ్" అని పద్మని పిలిచాడు. "ఎందుకో గానీ రాఘవేంద్రంగారు కబురు పంపించారు వచ్చి కలుసుకోమని" అంటూ తన ముఖం ఆ వార్త వినగానే ఎలా మారిందో తెలుసుకోడానికి అద్దంముందు నిలుచున్నాడు.

"అదేమిటండీ! క్షణంలో అలా అయిపోయారు! ఆ రాఘవేంద్రంగారు కొట్టి కొఱికివేస్తారేమిటి! ఐనా మీరిప్పుడేం చేశారనికి?" అంటూ విసుక్కోయింది పద్మ.

"ఏమిటో, ఏంపాడో" అంటూ పైకుడ్డ విదిలించి భుజంపైన వేసుకుని శేఖరం వీధిలో పడ్డాడు.

ఇనుప కమ్ముల గేటును మెల్లగా తోసుకుని కోటలా వున్న రాఘవేంద్రంగారి కాంపౌండులో ప్రవేశించాడు శేఖరం. ఓ వైపున వరుసగా నిలిచిన రెండెద్దుల బళ్లు, మరోవైపున కొండలా పోసివున్న వేరుశనగ పొట్టు మధ్యనించీ అతడు తిన్నగా కచేరీ చావడి సమీపించాడు. రాఘవేంద్రంగారి తాతగారు ఓ జమీను ఇరవై ఏళ్ళపాటు కౌలుకట్టుంచుకున్న సందర్భంలో ఆ కట్టడానికి కచేరీ చావడని పేరొచ్చింది. జమీ పోయినా ఆ పేరుమాత్రం స్థిరంగా నిలిచిపోయింది. ఇప్పటికీ అయిదారుగురు గుమాస్తాలక్కడ నిర్విరామంగా పనిచేస్తుంటారు.

చావడి దాటుకుంటే ఓ చిన్న వుద్యానవనం చూపరులకు దృగ్గోచర మౌతుంది. రాఘవేంద్రంగారి కుమారుల్లో ఒకతను అమెరికా వెళ్లి వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీలు పొంది వచ్చాడు. ఈ పూలతోట అతడి పర్యవేక్షణలో పెరుగుతుంది. తోటకు మధ్యగా పదడుగుల వెడల్పుతో చావడినుంచి రాఘవేంద్రంగారి ఏకాంత భవనం వరకూ ఒక పూలపందిరి వెదురు తడికలపైన అల్లుకుని వుంది. మనసుతో పాటు వాతావరణం కూడా ఆహ్లాదకరంగా వున్నప్పుడు, రాఘవేంద్రంగారు ఆ పందిరి క్రింద పచారు చేస్తుంటారు. కానీ ఆయన అలా ఆహ్లాదంగా వుండడమనేది జన్మకంతా శివరాత్రిలా సంవత్సరానికి ఏ ఒకటి రెండు సార్లో జరిగే సంగతి. ఆయన ముఖంలో సర్వసాధారణంగా చిరాకు చిందులు త్రొక్కుతుంటుంది. తనకు తానుగా ఆయన ఎవరికైనా కబురు పంపిస్తే తప్ప పిలవని పేరంటంగా ఆయన్ను కలుసుకోడానికి సాహసించే వాళ్లు అరుదు. తరచుగా ఆయన కోసం పెద్ద పెద్ద వుద్యోగులు వస్తుంటారు. వచ్చిన వాళ్లు బంగళాలో విడిదిచేసి ఆయన కబురు కోసం

మధురాంతకం రాజారాం

ఎదురు చూస్తారు. ఆ కబురు వాళ్లవాళ్ల అదృష్టంకొద్దీ, వేళా విశేషం కొద్దీ ఎప్పుడో ఒకప్పుడు వస్తే రావచ్చు. లేదా, రాకపోవచ్చు. అలా కబురు రానిపక్షంలో అక్కడ వేచివుండి లాభంలేదని పెద్ద వుద్యోగులు తమ కోపాన్ని క్రింది వుద్యోగులపైన చూపించడానికి వీలుగా, హుటాహుటిగా తమ స్వస్థానాలకు వెళ్లిపోతారు.

రాఘవేంద్రంగారి ఏకాంత గృహంలో మూడు గదులున్నాయి. కుడివైపు గది ఎప్పుడూ తాళం వేసి వుంటుంది. అందులో ముఖ్యమైన రికార్డులు, ఇనప్పెట్టెలు వున్నాయని చెప్పుకుంటారు. ఎడమవైపు గదికి మూడు కిటికీలు, రెండు వెంటిలేటర్లూ వున్నాయి. గాలీ, వెలుతురు ఎంతకావాలంటే అంత రాఘవేంద్రంగారి యిష్టప్రకారం ఆ గదిలో ప్రవేశిస్తాయి. లేబవళ్లలో రమారమి మూడొంతులకాలం రాఘవేంద్రంగారు ఆ గదిలో పట్టె మంచంపైన పాలసముద్రంలో వటపత్రశాయిలా పవ్వళిస్తారు. ఆయనకు గుండె దడవుందని లోకంలో ప్రతీతి. ఉన్నదో లేదో ఆ గది గోడపైన పెద్ద సైజులో విలసిల్లుతున్న వేంకటేశ్వరుడికి తెలియాలి. మనకు తెలియదు.

ఎవరికోసమైనా కబురు వెళ్లిన తర్వాత రాఘవేంద్రంగారు వాళ్ళని కలుసుకోడానికి మెల్లగా మధ్య గదిలోకి వస్తారు. గది అనడంకన్నా ఆ భాగాన్ని హాలనడం సమంజసం. ఆ హాల్లో నాలుగైదు కుర్చీలు, ఒక ఈజీచేర్, మధ్యలో ఒక పెద్ద టేబిలు యింతే మాత్రమున్నాయి. రాఘవేంద్రం గారు టేబిలు కెదురుగా ఈజీచేర్ లో పడు

★ నిగ్రహానుగ్రహాలు ★

కుంటారు. టేబిలుపైన మంచి కాలికో బైండులో ఒక పెద్ద పుస్తకం వుంటుంది. అది భగవద్గీత అని కొందరు చెబుతారు. రాఘవేంద్రంగారు ప్రతిరోజూ గీతా పారాయణం చేస్తారని కూడా ఒక లోక ప్రథ వుంది. ఈ మాటలోని నిజానిజాలు కూడా తెలియవు.

శేఖరం గుమ్మం దగ్గర నిలబడ్డాడు. వంగి ఓరకంటితో లోపలికి చూచాడు. రాఘవేంద్రంగారు ఈజీచేర్‌లో పడుకుని అర్ధనిమీలిత నేత్రులై చుట్ట కాల్చుకుంటున్నారు. మామూలు సమయాల్లోకన్నా చుట్ట కాలుస్తున్నప్పుడు, ఆయన్ని కలుసుకోడం శ్రేయస్కరమని శేఖరం యిదివరకు కలిగిన తన అనుభవాల వల్ల ఒక అంచనా వేసి దాన్ని అట్టే పెట్టి వుంచాడు.

ఒకడుగు లోపలికి వేస్తూనే, శేఖరం "నమస్కారమండీ" అంటూ చేతులు జోడించాడు. శేఖరం రాకతో రాఘవేంద్రం గారిలో ఏ మాత్రం సంచలనమైనా కలిగిందని చెప్పడం కష్టం. ఆ అర్ధనిమీలిత నేత్రాలకు హాల్లో ముందరి భాగమంతా కనిపిస్తూ వుంది. బహుశా శేఖరం కూడా ఆయనకు కనిపించి వుండవచ్చు. అతడి మాటలు సైతం ఆయన వీనుల దాకా వెళ్ళివుండవచ్చు. కానీ ఆయనలో శేఖరాన్ని కన్నట్టు, అతడి మాటలు విన్నట్టు కించిత్తు మార్పయినా పొడచూపక పోవడం మాత్రం తథ్యం.

"తమరు పిలిపించారని పోస్టాఫీసుకు వెళ్ళిపోతున్న వాణ్ణి నేరుగా యిక్కడికే వచ్చాను" అన్నాడు శేఖరం ఒక వారగా, వినమ్రంగా నిలబడి. శేఖరం ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడుగా ఆ వూరికి వచ్చాడు. వచ్చిన నాడు పుత్రాళ్ళకు ట్యూషన్లు చెప్పి, అడపాదడపా చావడిలో పనిచేసి, రాఘవేంద్రంగారికి ప్రీతిపాత్రుడయ్యాడు. ఏ తత్ఫలితంగా అతడికి పోస్టుమాస్టరు గిరీ కూడా లభించింది. అందుకు శేఖరం రాఘవేంద్రంగారికి ఈ క్షణం వరకూ కృతజ్ఞుడు!

"నిలబడ్డారేం మాష్టరుగారూ! అలా కుర్చీలో కూచోండి" అన్నారు రాఘవేంద్రంగారు ఆఖరుకు నోరు తెరిచి.

శేఖరం వున్నపాటున వుక్కిరిబిక్కిరై పోయాడు. అయిపోదూ మరి! రాఘవేంద్రంగారి సన్నిధిలో తనకింతటి మర్యాద అపూర్వం!

"అబ్బె, ఎందుకులెండి" అని మెల్లగా తనలో తానే స్వగతంలా పలికాడు శేఖరం.

"మరేం లేదు" అంటూ రాఘవేంద్రంగారు గొంతు సవరించుకున్నారు. "లేక లేక ఈ సంవత్సరం వేరుశెనగ వ్యాపారంలో దిగానా! పోదూ రెండు వేల మూటలు అమ్ముడుపోకుండా, స్టాకు నిలిచిపోయాయి. ఆ స్టాకును కాస్తా అమ్మిపెడతారేమోనని..." రాఘవేంద్రంగారు లేచి నిటారుగా కూచుంటూ "మీకోసం కబురు పంపాను" అంటూ వాక్యం పూర్తిచేశారు.

శేఖరం నిర్ఘాంతపోయాడు. రాఘవేంద్రంగారు తనకు తెలిసి పదేళ్ళుగా వేరుశెనగ వ్యాపారం చేస్తున్నారు. ఆయన చేతిక్రింద నాలుగు ప్రొపెలరు పనిచేస్తున్నాయి ఎంతస్టాకయినా ఆయనకేచాలదు. రెండు వేల మూటలేమిటి! స్టాకు నిలిచిపోవడమేమిటి! తను అమ్మిపెట్టడమేమిటి!

"నాకేం అర్థంకావడంలేదండీ" అంటూ శేఖరం అమాయకంగా, తెలతెలపోతూ విన్నవించుకున్నాడు.

"ఇప్పుడర్థంకాదులే! మీరువెళ్ళండి" అంటూ రాఘవేంద్రంగారు పైకిలేచారు. మందగమనంతో పడకగదిలోకి వెళ్ళిపోయారు.

* * *

కట్టగట్టుకుని రన్నరు వెళ్ళిపోయిన తర్వాత శేఖరం పొలాలపైన తిరిగి తిరిగి ఎనిమిది గంటలకు ఇల్లు చేరుకున్నాడు. "ఏమండీ! రాఘవేంద్రంగారు కనిపించారా" అంది పద్మ. తలాడిస్తూ శేఖరం మౌనంగా మంచంపైన కూలబడ్డాడు.

"అదేమండీ! అలా వున్నారు! ఆయనేమైనా నోరు పారేసుకున్నాడేమిటి?" అని మళ్ళీ ప్రశ్నించింది పద్మ.

"ఎవడైనా అసమర్థుడుంటే, వాడు నోరు పారేసుకుంటాడు. రాఘవేంద్రంగారెప్పుడూ నోరు పారేసుకోరు" అన్నాడు తీవ్రంగా శేఖరం. అనడమేమిటి, పద్మ ఏదో పెద్దపొరబాటుచేసినట్టు మందలించాడు శేఖరం!

"పోనీ, ఆయనేమన్నాడో చెబుదురూ!" అని బ్రతిమాలుకుంది పద్మ.

"ఏమంత పెద్దపని కాదనుకో! ఆయన దగ్గర రెండువేలమూటల వేరుశెనగ స్టాకు నిలిచిపోయిందట! దాన్ని కాస్తా అమ్మిపెట్టమంటున్నాడు."


"మిమ్మల్నా! మిమ్మల్నా" అంటూ విస్తుపోయింది పద్మ.

"నన్నే. నన్నే!" అని బిక్కమొగం వేశాడు శేఖరం.

అసలు విషయం తనకు తెలిసిపోయినట్టు, అసలే పెద్దవయిన తనకళ్ళను మరీ, పెద్దవి చేసి "అహాఁ అదాసంగతి!" అంటూ రాగం దీసింది పద్మ.

"అదే అదే! ఎలాగైనా నీ బుర్రే నయం పద్మా! అప్పుడే అనుకున్నాను ఈ రాద్ధాంతానికి కీలకమేమిటో కనిపెట్టే నువ్వే కనిపెట్టాలని! ఏదీ, ఏమిటో చెప్పు" అంటూ శేఖరం కొంచెం జరిగి కూచున్నాడు.

"ఏముందండీ మీరుమరీనూ! పోతేపోయిందని ఆ పదిమూటల కాయల్నీ రాఘవేంద్రంగారి మండీకే తోలించివుంటే బాగుండేది. పదో, యిరవయ్యో కలిసొస్తుందని మరెవరికో బేరం చెప్పారు. పోనీ మీ బేరసారాలు గుట్టుగా వుంచారాఅంటే అదీ లేదు. మీతోబాటూ మరి నలుగురెగుర్ని కలుపుకుని మొత్తం ఒక లారీసరుకు బయటూరికి చేరవేయించారు. ఆ విషయం రాఘవేంద్రంగారికి తెలిసిందేమో!"



సింహాచల దేవాలయంలో నరసింహావతార శిల్పం

ఫొటో: జి. సత్యనారాయణ.

జ్ఞానోదయమైన తపస్విలా శేఖరం లేచి నిల్చున్నాడు రెండుమూడు క్షణాలపాటు అలా బ్రమ్మపడిపోయి తరువాత మెల్లగా పచారు చేయసాగేడు.

గ్రామానికి చుట్టుపట్ల నాలుగైదుమైళ్ల వరకూ మరొక బేరగాడు వచ్చి సరుకు కొనుగోలు చేయకూడదని రాఘవేంద్రంగారు మొదటినుంచీ ఒక ఆనవాయితీ అమల్లో వుంచారు అథవా ఎవడైనా బేరానికి వచ్చినా వాడికి సరుకివ్వకూడదు అలా యిస్తే ఆ తరువాత అతడున్నాడు, రాఘవేంద్రంగారున్నారు. ఇంతకూ తన మాట మీరినవాణ్ణి రాఘవేంద్రంగారు దూషించినట్లు గానీ, పరాభవించినట్లుగానీ నిదర్శనాలు లేవు ఆయన ఊహా అని మనసులో అనుకుంటాడు! అంతే! కొంగల కార్యాన్ని గంధర్వులే తీరుస్తారు!

పది పది హేను నిముషాల ఆలోచన తర్వాత శేఖరం ఓ నిర్ణయానికి వచ్చాడు అంతగా తనను సాధింపదలచుకుంటే రాఘవేంద్రంగా రేం చేయగలరు? తనవా పూళ్ళోనుంచి మార్పించ గలరు పోనీ! తన కేం యిదే వూరని వ్రాసిపెటలేదు రాము డున్నాడు రాజ్యముంది ట్రాన్స్ఫరు అర్జీ పెస్తే దట్ మోహానరంగా అని తను పెట్టే బేడా సర్దుకుంటాడు అంతేమరి! కానున్నది కాకమానదు కదా!

★ నిగ్రహానుగ్రహాలు ★

అంతే అయింది! రాఘవేంద్రం గారితో చేతీ అయి వారంరోజులు తిరక్కముందే శేఖరానికి ట్రాన్స్ఫరు ఆర్డరు చేతికందింది.

“నువ్వు ఫలానా వూరికి మార్చబడ్డావు! ఫలానా వాడు ఆవూరినుంచీ వస్తాడు. అతడికి చార్జీ ఒప్పగించి నువ్వు వారంరోజుల్లో పదరు ఫలానా వూరిలో వుద్యోగంలో చేరవలసింది.” అంటోంది వుత్తరువు.

సామానులన్నిటిని పాక్ చేయించి రైల్లో వాటిని భార్యా బిడ్డలతో సహా స్వంత వూరికి పంపించి రాబోతున్న ఆ ఫలానా వారికోసం ఎదురు తెన్నులు చూస్తూ కూచున్నాడు శేఖరం.

నాలుగోరోజున క్రొత్త టీచరు వూళ్లోకి విజయం చేశాడు. వచ్చినవాడు ఒక్క రోజంతా శేఖరం స్వయం పాకంలో భాగాలు పంచుకుని తిన్నశాస్త్రిలు ముగించి, వూళ్లో చాలామందితో భాగాలు పరిచయం కుదుర్చుకుని, ఆ సాయంత్రం రాఘవేంద్రం గారిని దర్శించి ఆ మరునాడు వుద్యోగం చార్జీ పుచ్చుకున్నాడు.

“ఇప్పటి కొకటయింది. ఇక పోస్టాఫీసొకటుంది. ఆ పనికూడా మీకే అప్పగించవలసివుంటుందని పైవాళ్ల నడిగి కనుక్కొన్నాను” అన్నాడు శేఖరం.


“పోస్టాఫీసా! అబ్బే! నాకు అవసరం లేదండీ” అంటూ నాలుక చప్పరించేశాడు కొత్త టీచరు వేంకటేశం.

“అదేమిటండీ! ఇది ఏకోపాధ్యాయ పాఠశాలని తెలుసు గదా మీకు! ఇక్కడ ఎవరైతే టీచరుగా వుంటాడో అతడే పోస్టాఫీసుకూడా చూచుకోడం పరిపాటి. ఊరికే ధర్మానికి కాదు గదా! ఇరవై రూపాయలంటే మరేం చేదుకాదు గదా మనకు!” అన్నాడు శేఖరం.

వెంకటేశం శేఖరాన్ని తన గదిలోకి తీసుకెళ్లి రహస్యమని మరిమరీ చెప్పి చేతిలో చేయి వేయించుకుని “నన్నేం చేయమంటారు శేఖరం గారూ! సిరివస్తే మోకాలడ్డవలసిన దౌర్భాగ్యున్నయిపోయాను. రాఘవేంద్రంగారొక్కటే మాటచెప్పారు తనమాట లేందే మీ దగ్గరనుంచీ పోస్టాఫీసు చార్జీ పుచ్చుకోవద్దన్నారు. అందుకని ఇలా గవలసి వచ్చింది” అని నచ్చచెప్పుకున్నాడు.

శేఖరానికి ఒళ్లు మండింది. పై అధికారులకు సైతం తలవంచని ఆత్మాభిమానం విద్యుల్లతలా అతని శరీరంలో సుళ్లు తిరిగింది. “అంతా మన మేలుకే వెంకటేశం గారూ! జరిగేదంతా జరగనివ్వండి” అంటూ అతడు మెల్లగా పదేళ్లు తన జవసత్వాలు హరించివేసిన స్కూల్లోనుంచి బయటికి వచ్చేశాడు.

ఆ రాత్రంతా శేఖరం నిద్ర పోకుండా ఆలోచించాడు. నిజానికి యిప్పుడు తనేం పొరబాటు చేశాడు? ఎవరో దయతలచి తన కందుబాటులో లేని పొలాన్ని వీలైతే తనని సాగుచేసుకోమన్నారు. ఆ మేరకు పొలాన్ని దున్నించి విత్తనాలు వేయించి పైరు పెట్టాడు. పైరు ఫలితానికి వచ్చినప్పుడు అడివి మేకొలు తినిపోకుండా రాత్రిపూట కాపుదారీ పెట్టించాడు. ఇంతచేసీ ఆబ్బరంగా తను పదిమూటల కాయలు పండించుకుంటే దానివల్ల అర్థాంతరంగా యింతవ్యవహారంవచ్చిపడింది. పండించుకునే వారికి తనపంటను వీలయినంత గిట్టుబాటుకు



“మే ఘై ర్మే దు ర మం బ రం...”

ఫోటో: జి. ఎస్. శర్మ

అమ్మకు నే హక్కుంది తను చేసిందంతే! ఏవిధంగా ఆలోచించినా తను దోషికాడు రాఘవేంద్రంగారి ఎదుట అపరాధిగా నిల బడ వలసిన అవసరం తనకి లేదు!

మరునాటి వుదయం శేఖరం బస్సెక్కి తను బదిలీ అయిన వూరికి వెళ్ళి ఛార్జి పుచ్చు కుని పుచ్చుకున్న మరుగంటలో నే మూడు నెలల ప్రివిలేజ్ లీవుకు అప్లైచేసి తిరిగి వచ్చాడు.

ఆ రాత్రి సైతం శేఖరానికి నిద్రపట్ట లేదు తెలతేరకు మూడు నెలల ప్రివిలేజి లీవు వృధా కాబోతున్నది క్యాజువల్ లీవు యింతకు మునుపే ఖర్చయిపోయింది ఈ మూడు నెలలు గడచిన తర్వాత తనకైనా రోగం ముంచుకువస్తే తప్పా సెలవు దొర కదు. అవతల చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ పెళ్ళిళ్ళనీ, పబ్బాలనీ బోలెడుపనులున్నాయి అవి తను లేకపోతే జరుగవు. బాహ్య పరి స్థితుల కతులబోనులో తన్నుకలాడుతున్న తనకు ఈ మూడు నెలలు గడిచే లోపుగా చిత్తభ్రమే కలిగిపోతుందేమో!

శేఖరం ఆ ఆవేదనలో రెండు పేపర్లు ఫైల్లోనుంచి లాగి పైవాళ్ళకు విన్నపం వ్రాసుకున్నాడు ఈ పోస్టాఫీసు బాధ్యతని స్వీకరించడానికి ఈవూళ్ళో ఎవరూ ముందుకు రావడంలేదు కారణం అనూహ్యంగావుంది. తను బిడ్డలు గలవాడు! వీలైనంత త్వరగా ఈ

నిగ్రహానుగ్రహాలు

బాధల బందినుంచి తనకు విముక్తి కలిగించితే ఆ జన్మాంతం కృతజ్ఞుడుగా వుండగలడు!

విన్నపానికి మూడోరోజున ప్రత్యుత్తరం వచ్చింది. "పోస్టాఫీసును బాధ్యతగల వ్యక్తికి ఒప్పగించడం నీ బాధ్యత! అంతవరకూ ఏ పరిస్థితుల్లోగానీ నీ రాజీనామా అంగీకరింపబడదు. ఈ వుత్తరువును మీరితే నీవు చట్టప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలకి బాధ్యుడివి!"

శేఖరం కింకర్తవ్యం తోచక పిచ్చివాడిలా జుట్టు పీకేసుకున్నాడు!

రోజులు మెల్లగా దొర్లిపోతున్నాయి. బిడ్డలు తనకోసం కలవరిస్తున్నారని, తప్పకుండా ఒకసారి వచ్చిపోవలసిందనీ పద్మ జాబు వ్రాసింది. "వీల్లేదు. ఇప్పుడు నేను వివరంగా జాబు వ్రాసే స్థితిలోకూడా లేను" అని శేఖరం బదులు వ్రాశాడు.

మూడోనెల పూర్తి కావడానికిక వారం రోజులున్నాయనగా తనకు మరొక రెండు నెలలపాటు సెలవు పొడిగించవలసిందని శేఖరం జిల్లాబోర్డుకు మనవి పంపుకున్నాడు.

"ప్రివిలేజిలీవు పూర్తిగా వినియోగించుకోబడినందువల్ల నీకోరిక నిరాకరింపబడింది. నువ్వు తక్షణం వుద్యోగంలో చేరవలసింది. లేకపోతే నీ సర్వీసు యింతటితో 'బ్రేక్' అయిపోవడానికి అవకాశం వుంది." అని జిల్లాబోర్డు శేఖరం పైకి చక్రాయుధం వదిలింది!

వెంటబడి తరుముతున్న చక్రాయుధం బారినుంచి తప్పించుకోడానికి శేఖరం జిల్లా ముఖ్యపట్టణానికి పరుగులు తీశాడు. ఇటు విద్యాశాఖాధికారుల్నీ, అటు తపాలాశాఖ వాళ్లనీ కలుసుకుని తననీ విషమ, విపత్కర పరిస్థితిలో నుంచి తప్పించకపోతే వీల్లేదని మొరబెట్టుకున్నాడు.

అధికారుల్లో కొందరు తామసులు. వాళ్ల కళ్ళకు లోకమంతా దోష భూయిష్ఠంగా కన్పిస్తుంది. వాళ్లు శేఖరాన్ని తూలనాడి అవతలకి పొమ్మన్నారు. మరికొందరు రాజసగుణం నరనరాల ఒంటబట్టినవాళ్లు. అతడికి వచ్చింది ఒక కష్టమే కానట్టు, శేఖరం మాటలు విని విననట్టు వూరుకున్నారు. సాత్వికులు కొందరేమో అతణ్ణి దగ్గరకు చేరదీసి "ఏనా ఈడొంక తిరుగుళ్లెందుకు నాయనా? కీలెరిగిగదా వాత వేయాలి! కీ లెక్కడుందో తెలియక యింత దూరం పరుగెత్తివచ్చావు పాపం! వెళు రాఘవేంద్రంగారు మంచివారు. ఏమైనా చేస్తే ఆయనే చేయాలి. మనవల్ల నేమౌతుంది? వెళ్ళుబాబూ వెళ్ళు" అని ప్రబోధించి శేఖరానికి తిరుగుదారి చూపించారు.

ఆ పాటికి శేఖరంమనసు మొద్దుబారిపోయింది. ఆత్మాభిమానం తనలోనుంచీ వైదొలగిపోగా అతడు నిర్వికార, నిర్గుణ, నిరంజన స్వరూపుడై మిగిలిపోయాడు!

ఊళ్ళో బస్సుదిగగానే శేఖరం తలవంచుకుని వేగంగా వీధివెంబడే నడిచాడు. ఇనుపకమ్మీలగేటు ఒత్తిగించుకున్నాడు. కచేరీ చావడీ దాటాడు. పందిరికిందకు వచ్చాడు.

శేఖరం అదృష్టం మంచిది! రాఘవేంద్రంగారు పందిరిక్రింద పచారుచేస్తూ కనిపించారు.

శేఖరం దగ్గరికి పోయాడు. నమస్కారం చేశాడు. తను అయిదుగురు బిడ్డల తండ్రినన్న విషయం విన్నవించుకొన్నాడు. తను అపరాధం చేసిన మాట నిజమేనన్నాడు. బిడ్డలు తప్పుచేస్తే పెద్దలు గాక మరెవరు క్షమిస్తారని సవినయంగా ప్రశ్నించాడు. అయినా తను చేసిన తప్పుకు శిక్ష అనుభవించడం జరిగిపోయింది గనుక తననింకనైనా మన్నించవచ్చునని మనవిచేసుకున్నాడు.

అంతావిని రాఘవేంద్రంగారు నౌఖరును పిలిచి "క్రొత్త టీచరును యిక్కడికి వచ్చి పొమ్మను" అని కబురుపంపారు.

పదినిమిషాల్లో వేంకటేశం రాఘవేంద్రంగారి సముఖాన హాజరయ్యారు

రాఘవేంద్రంగారు వేంకటేశం వైపొకసారి చూచి "పోస్టాఫీసుఛార్జీ ఒప్పగించుకోండి" అన్నారు.

వేంకటేశం చేతులు నులుముకుంటూ "నాకు పోస్టాఫీసు వద్దండి" అన్నాడు

"ఏం! ఎందుకూ?" అన్నారు రాఘవేంద్రంగారు.

"మరేంలేదండీ! మూడు నెలలనుంచీ శేఖరంగారి అవస్థ చూస్తున్నాను. నాకెప్పుడైనా మార్పువస్తే, మళ్ళీ యిదే చిక్కు నాకూ దాపురించవచ్చునని భయంగా వుంది. అదీగాక నాకీవూరినీళ్ళు సరిపడ్డంలేదు. అందుచేత యిక్కడినుంచీ మార్పించుకోవాలని" అంటూ నీళ్ళు నమిలాడు వేంకటేశం.

రాఘవేంద్రంగారు శేఖరం వెపు తిరిగి "నాలుగు రోజులు నిదానించండి. అందాకా మీరిక్కడే భోంచేయవచ్చు. వంటవాడితో నేను చెప్పానని చెప్పండి" అంటూ చరచరా ఏకాంత గృహంలోకి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపడి ఎటు వెళ్ళడానికీ తోచక పందిరి క్రిందే నిలిచిపోయిన శేఖరం రాఘవేంద్రంగారి గదిలో టెలిఫోను మ్రోగడం విని మళ్ళీ ఈలోకంలో పడి మెల్లగా బయటికి దారితీశాడు.

కథాంతంలో ఒకటి రెండు మాటలు: వేంకటేశానికి అయిదోరోజున ట్రాన్స్ఫరు ఆర్డరు వచ్చింది. అతడి స్థానే శేఖరం నియమింపబడ్డాకు ఏండ్లు గడచిపోతున్నాయి. తనకావూరు అచ్చివచ్చిందనీ, తన సర్వీసంతా అక్కడే గడచిపోయినా మంచిదేనని శేఖరం చెప్పుకుంటాడు. లోలోపల తనకావూరినుంచి మార్పు రాదని కూడా అతడి దృఢనమ్మకం! నిజమే మార్పురాదు. ఎందుకొస్తుంది! ★

దిక్కుమాలిన వాచీ

ఆదిలో ఏ కర్మకర కోమల హస్తాన్ని అలంకరించిందో గానీ, పాపం చిక్కి శల్యమైపోయింది!—జుగుప్సాజనకంగా తయారయింది. ఆదరించి అలంకరించుకొనే సున్నిత హస్తంగలవారే కరువయిపోయేరు. ఎక్కడ పుట్టి ఎక్కడ పెరిగిందో గానీ ఆఖరికి దిక్కుమాలినదయింది!....

—అదో మేలురకం ఖరీదయిన రిస్టు వాచీయే అయి ఉన్నట్లయితే దానికీగతి బహుశా పట్టుండక పోయేదేమో!

అశక్తులూ చవకబారు వాటికే ఈ లోకంలో ఇంతే ఆదరణ కాబోలు మరి!

నామరూపాలు లేకుండా వికృతంగా తయారవడం చేత దాని ఖరీదు ఫలానా ఇంతుంటుందని చెప్పడం కష్టం. ఎలా అయినా ఇరవై రూపాయలకు తగ్గకుండా నలభై రూపాయలకు మించకుండా మధ్యస్థంగా ఉండుంటుందనుకోవచ్చు!—

ఇంతకీ దాన్ని ఏవ్యక్తి మొట్టమొదట పెట్టుకున్నాడో గానీ దాన్ని సవ్యంగా పోషించడం మాని దాని కన్యాయం చేశాడనే చెప్పాలి! బహుశా ఆ వ్యక్తి దాన్ని కొనే ఉండడు. ఏ 'బిజినెస్' 'ఆఫరు' రూపంలోనో, లేక 'ప్రెజంటేషను' రూపంలోనో ఉచితంగా సంపాదించి ఉంటాడు. లేకపోతే అంతనిర్లక్ష్యం అంత అనాదరణ దానిపట్ల చూపడు!—పాపం—అకాలంలో అన్యాయంగా అవస్థలకు లోనయింది.

క్రిందటి పండగ శెలవల్లో నేను మా మామగారింటికెళ్ళినప్పుడది నాకు లభ్యమయింది. పండుగ ప్రజెంటేషనుకాదు! మా బావ పుస్తకాల పెట్టె దులుపుతూ ఉన్నప్పుడది టపీమని క్రిందకు రాలింది. ఏదో అణా రకం పిల్లలాడుకునే వాచీ ఏమో అని మొదటనుకున్నాను. తీరా బాగా పరిశీలించి చూసే సరికి నా అభిప్రాయం మారింది!—

"ఇదేమిటోయ్ దీన్నిలా ఇంత నిర్లక్ష్యంగా పారేసేవ్?" అనడిగేను.

"పారేయలేదండీ!—మా చిన్న చెల్లి సరదాకి అప్పుడప్పుడు పెట్టుకొని ఆడుకుంటూ ఉంటుంది." అన్నాడు మా బావ.

"బాగుంది బాగుంది!...ఏదో అణారకం చవకబారు వాచీ అనుకున్నానేమిటి పిల్లలాడుకునేందుకివ్వడానికి!" అది అంతకంటే ఎక్కువగా ఉపయోగపడదనుకుంటా!"

"ఉపయోగించడం చేతకాక పోతేసరి. బాగుచేయిస్తే బంగారులాగుంటుంది!"

"దాన్ని బాగుచేయించేటందుకు వినియోగించే డబ్బుతో క్రొత్తవాచే వస్తుందనుకుంటా!"

"అదేమిటోయ్ అలా అంటావు?!—నేబాగుచేయిస్తాను చూడు దానిని!"

"సరే మీ యిష్టం!" అన్నాడు. ఆసందర్భంలోనే దాని గత చరిత్ర కొంచెం తెలుసుకోవాలనిపించి వాడినడిగేను, దాని గత చరిత్రను సంక్షిప్తంగా చెప్పమని.

వాడు చెప్పేడు—"ఈ వాచీ ఎక్కడ జన్మించిందో నాకు తెలీదు. దాని వయస్సెంతుంటుందో కూడా తెలీదు!—దాన్ని నేనసలు కొనలేదు. నేను బొబ్బిలిలో పని చేస్తూ ఉన్న రోజుల్లో నా స్నేహితుడొకడు దీన్ని నా దగ్గరకు తీసుకొచ్చి—"దీన్ని బాగుచేయించినట్లయితే ఏమయినా ఉపయోగపడుతుందో పడదో చెప్పమని నా సలహా అడిగేడు. "నీకంతగా వాచీ పెట్టుకోవాలనే సరదాయే ఉన్నట్లయితే క్రొత్త వాచీ కొనిపెట్టుకో బ్రదర్" అని సలహా ఇచ్చేను. అతను నా సలహాని మన్నించేడు. దాన్ని నా దగ్గరే వదిలేసేడు. ఇంతకీ దాని గత చరిత్రలోని పూర్వభాగం చాలా గొప్పది!—దాన్ని నా స్నేహితుడి మేనమామ మద్రాసు రైల్వే ప్లాట్ ఫారం మీద అతి రహస్యంగా మూడు రూపాయలకు కొన్నాడు. నిజం చెప్పొద్దూ?!—అది దొంగ సొమ్ము!—అంచేతే ఆవాచి ఎటువంటిదో కూడా గమనించకుండా, చవగా వస్తున్నాది కదా అనే సంతోషంతో 'గప్ చిప్'గా జేబులో పడేసుకున్నాడు!—

—"చాలా మార్లు బాగుచేయించి ఆఖరికి విసుగెత్తి మూలపడేసేడు. ఆతరువాతి దాన్ని మా స్నేహితుడు తీసుకు రావడం నా సలహా అడగడం ఆ విషయం చెప్పేను కదా!—ఓనాడు మా చెల్లి నా చేతిరిష్టు వాచీ చూచి తనకీ అలాంటిది కావాలని మారాం చేస్తే దానిచేతికి పెట్టేను కొన్నాళ్ళు ఆ వాచీ పెట్టుకొని ఆడుకొంది!—ఆఖరికి దానికీ అసహ్యం వేసి ఈ పుస్తకాల డొక్కులో పడేసింది!—ఇదీ దీనిచరిత్ర!!" అని ముగించేడు మా బావ.

ఎంచేతో గానీ ఆ వాచీని చూసే సరికి నాకు జాలేసింది!—ఆదరించే వ్యక్తుంటే అమోఘంగా పనిచేస్తుందనిపించింది. మెల్లగా మూత తీసి చూసేను. కాస్త బూజు పట్టిందన్న మాటే గానీ లోపలి భాగాలన్నీ సవ్యంగానే ఉన్నాయనిపించింది. నా మట్టుకి!—పైని గాజూ, ముళ్ళూ, కీ హెడ్డూ మినహా మరేలోటూ అనిపించలేదు!—ఇంతకీ ఏవస్తువుకయినా వాడకం పైనే మన్నిక ఆధారపడుంటుందని నా నమ్మకం!—జాగ్రత్తగా పొట్లాం కట్టి జేబులో వేసుకొన్నాను.

* * *

ఇంతకీ ఆ రిష్టువాచీది అదృష్టజాతకమని చెప్పడానికి వీల్లేదు! దాన్ని బాగుచేయించి అందంగా నా చేతికలంకరించుకోవాలని ఎంతో ఆశపడ్డాను. ఇక అది నా జీవితాన్ని క్రమపథంలో కాలానుగుణంగా నడిపిస్తుందనుకున్నాను!—

—కాని ఆ అభాగ్యురాలయిన వాచీకి మహా విపద్దశవచ్చింది!—అందుకు కారణం నా భార్య తెలివితక్కువతనం, అజాగర్త అనే చెప్పాలి!—లేకపోతే చాకలాడికి బట్టలేసేటప్పుడు జాగ్రత్తగా జేబులన్నీ పరిశీలించి చూసి మరీ వెయ్యద్దూ?—కనీసం ఒక్క జేబూ అయినా ఉండని తన చీరలూ జాకెట్లూ అనేసుకొని పడేస్తుందా?!—బుద్ధీ, జ్ఞానం లేకపోతేసరి!—ఇంతకీ నాకూ కొంచెం జ్ఞాపకశక్తి మందగించింది. చాకలాడికి బట్టలు పడేసిన పదిరోజులకు గానీ ఆ వాచీ నాకు మస్తిష్కంలో మెదల లేదు!—అప్పుడు జ్ఞాపకమొచ్చింది అది నా నల్ల ఫాంటు జేబులో ఉన్నట్లు!—ఇంతకీ ఆ వాళ నేనింటిదగ్గరున్నప్పుడు చాకలాడొచ్చి ఉన్నట్లయితే ఇలాంటి అఘాయిత్యం జరక్కపోయుండేది నేనసలు

ఆకుండి నారాయణమూర్తి

మహాజాగర్తాఅయిన వాడిని. సూరీడు ఊడి పోయిన సందర్భంలో ఫాంటుకు తగిలించిన పిన్నులను సహితం ఒక్కటేనా మిగిలి పోకుండా తీసి మరీ వేస్తాను!—అంతటి జాగ్రత్తగల నేను అవాళ ఇంటిదగ్గరున్నట్లే అయితే ఆ వాచీకలాంటవస్థపట్టనిస్తానూ?

—'భడీ' మని ఏ కర్కశిలమీదో ఉతికేసుంటాడు. ఎంతఘోరం! — తలుచుకుంటే గుండె బ్రద్దలవుతుంది!—ఇక శాశ్వతంగా ఆ వాచీ అంతర్థాన మవుతుందనుకున్నాను!

ఇక అప్పుటో ఆ చాకలాడింటికెళ్ళినా ప్రయోజనంలేదు. అప్పటికప్పుడే ఉతికేసే ఉంటాడనుకున్నాను. అయినా ఉతికే ముందు ఆమాత్రం చూడడూ? — వాడు దాన్ని నాకు సురక్షితంగా ఇచ్చేస్తే అదృష్టమే ననుకున్నాను. కానీ వాడు దాన్ని స్వంతం చేసుకోకుండా ఇచ్చేస్తాడనే నమ్మకమేమిటి మహా!......

...అవాళ నా భార్యతిన్న చీవాట్లన్నీ అన్నీ కావు! — ఆ వాచీమీద నాకుండే అభిమానమంతా నా భార్యమీద చాలా కోపంగా మారింది.

“ఇంతకీ మహా వంద రూపాయలిచ్చి స్వంతంగా కొన్నట్లూ, అది పోయినట్టూ అంతబాధపడతారేమిటండీ?!—మా చెల్లి ఆడుకొని పారేసిందేగా! — మీకూ మా చెల్లిలాగే పెట్టుకొని ఆడుకోవాలనుందేవిటి?” మరీ మరీ శృతిమించి పోయిందిదీను!

నాకు బాగా కష్టమండింది!—ఇంతకీ మా ఆవిడకు ఆ వాచీమీద మంచిఅభిప్రాయంలేదనే చెప్పాలి అదేదో పిల్లలాడుకొనే వాచీ అనే ఆమె అభిప్రాయం దాని అసలు ఖరీదంతో గానీ, మొత్తానికి దొంగాడిచేతిలోంచి మూడురూపాయల కమ్ముబడింది!—దొంగాడు కాబట్టి అంత చవగ్గా ఇచ్చేసేడు, మరొకడయితే అంత చవగ్గా ఇస్తాడూ?—

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్దర పట్టలేదు. అన్నీ పీడకలలే!-ఆ మర్నాడుదయాన్నే చాకలాడు బటలు పట్టుకొని వచ్చేడు. వాడు రాగానే మొట్ట మొదట నేనడిగినది రిష్టువాచీ గురించి! - వాడు తెల్లబోయేడు! అదంతా నటనే అని నా అనుమానం!—

వాడికీ నాకూ చాలా పెద్ద ఘర్షణే జరిగింది! - ఏదిఏటో అనుకొని ఇరుగు పొరుగుల వాళ్ళంతా మూగేరు. ఆ ఘర్షణంతటనీ వ్రాయడం నాకిష్టం లేదు. అంచేత ఫలితాన్ని క్లుప్తంగా తెలియజేస్తా!—

—బట్టలు పారేస్తూండడం, జేబులలో మరచిపోయినవి స్వంతం చేసుకుంటూ ఉండడం వాడి కలవాటు లేకపోలేదు. ఇక ఈమారు వాడి నూరికే విడిచి పెట్టడం నా కిష్టం లేకపోయింది. మొత్తాని కెలా అయితేనేం నేనూ వాడూ ఓ నిర్ణయాని కొచ్చి రాజీపడ్డాం! ఆ రకంగా రాజీ ఏర్పరచినది నా భార్య. అది పుసుక్కున ఆ నేయ బట్టి, దాని గౌరవం చాకలాడి ముందు నిలబెట్టడంకోసం అంత తక్కువ కొప్పుకున్నాను! - ఆ వాచీ విషయం ఏమీ తేలనందుకు గానూ వాడి జీతంలో మూడు రూపాయలు తెగ్గోసే అందుకు ఒప్పందం జరిగింది! - “సరే! ఏటి శాశ్వతం?! - తమకి న్యాయమని తోస్తే అలాగే-కానియ్యండి” అన్నాడు దొంగ వెధవ

వాడి కా నెల ఇవ్వవలసిన అయిదు రూపాయలలోనూ మూడు రూపాయలు కొట్టేసి మిగతా రెండు రూపాయలూ ఇచ్చేసేను. గొణుక్కుంటూ వెళ్లిపోయేడా వెధవ!—

* * *

పెటి బాగా దులిపి బట్టలు సర్దుదామని ఆ పని ప్రారంభించింది శ్రీమతి! - అట్టడుగున ఓ పొట్లాం దొరికింది. విప్పి చూసింది. డొక్కు రిష్టువాచీ పసందుగా కళ్ళపడింది.

ఎందుకు లెండి? - చెప్పకుంటే సిగ్గు సిగ్గు! - మా ఆవిడ నన్నెంతగా ఏడిపించాలో అంతగానూ ఏడిపించింది!

వాచీ దొరికిందనే సంతోషం లేక పోయింది! - అనవసరంగా చాకలాడి దగ్గర నుంచి మూడు రూపాయలు పుచ్చుకున్నాను కదా అనే బాధ పట్టుకుంది!

అయితే తిరిగి వాడికిచ్చేస్తేనో?!...

—ఛీ! - ఏం బాగుంటుంది? - వాడు తనకి తెలీదు మొర్రో అన్నా మూడురూపాయలు పుచ్చుకున్నాను. ఇప్పుడు 'నా వాచీ నాదగ్గరే ఉందని' చెప్పి వాడికా డబ్బిస్తే నేను వాడి దృష్టిలో చాలా తేలికయి పోతాను. అదీ కాక ఇక ముందెప్పుడయినా, నిజంగా ఏ వయినా జేబులో మరిచి పోయినా సంగ్రహించి మరివ్వడు!- ఏమయినా అంటే “అ తూరి అలా చేసినారు. తమకి యాదస్తుతక్కువ!” అని అనేస్తాడు. అంచేత తిప్పు వప్పుకొని వాడికి ఆడబ్బు తిరిగి ఇస్తే ముమ్ముందు మాకే ముప్పు!—అదీ కాక నా గౌరవానికే భంగం!

కానీ అలా అన్యాయంగా ఆర్జించిన ఆ డబ్బు నా దగ్గరుంచుకోడం వల్ల ఏదో అవ్యక్తమయిన బాధ పట్టుకుంది.

ఎంచేతో గానీ ఆవాచీని చూస్తూ ఉంటే నాకు కష్టమండింది. “దిక్కుమాలిన వాచీ”—నా నోటంట వచ్చిన మాటే అది. పెట్లో భద్రంగా ఉండమని గిరవాటేసేను.

“మొత్తాని కెలాఅయితేనేం ఘటికులు!- ఆ వాచీవల్ల మూడు రూపాయలు సంపాదించేరు. భద్రంగా పెట్లో ఉండనివ్వండి. మనబ్బాయి కొంచెం పెద్దవాడవగానే వాడి చేతికి పెడదాం ఆడుకొంటాడు!” అంది నా భార్య.

యథార్థానికి నాకు చాలా కోపం వచ్చింది దాని వేళాకోళానికి!—కాని ఏమనడం?—


లోపల్లోపల ఏదో బాధ!...అయ్యో!... అన్యాయంగా చాకలి దగ్గరనుంచి మూడు రూపాయలు గుంజేశాను కదా అని!— ఇంతకీ అది దొంగ వాచీ!—దానికి నీతి ఎక్కడుంటుంది?—నాలాంటి వాడిచేతే అసత్యాలు పలికించి అన్యాయం చేయించింది!—అందుకే దానిది దిక్కుమాలిన బ్రతుకయిందనుకున్నాను.

అసలింతకీ ఆ చాకలాడి కాడబ్బు తిరిగి ముట్టచెప్పడం ఎలా? అదే నా ఆలోచన!

ఆఖరికి మా ఆవిడే ఓ సలహా నిచ్చింది!

“న్యాయంగా వాడికేమీ ఇవ్వక్కర్లేదు, ఎన్నో బట్టలు పారేసేడు. అంతగా ఇవ్వాలనుంటే పండుగలకు మనంసామాన్యంగా ఇచ్చే 'బరాతాని'కి, ఎక్కువగా మంచి హుందాతనంగా ఇవ్వండి. ఆరకంగావాడిది వాడికిచ్చేసి సంతృప్తిపడి ఆత్మశాంతిని పొంది హాయిగా నిర్విచారంగా ఉండండి!”

ఆమె సలహా కొంచెం బాగుందేమో నని పించింది నాకు! ★



ఒకటో అంకం

సమయం : ఒక బుధవారం సాయంత్రం—6-30 అయింది.

స్థలం : హైద్రాబాదు—ఖైరతుల్లాబాద్‌లో ఫణిభూషణరావు ఇంట్లో హాలు. ప్రేక్షకులకు ఎదురుగా వరండాలోంచి హాలులోకి వచ్చే ద్వారంవుంది. ప్రేక్షకుల దృష్ట్యా ఎడమప్రక్కన తోటలోకి తెరచుకొని ఒక వాకిలివుంది. దాని అవతల చిన్న టెర్రేస్. ఆ గుమ్మానికి మందపాటి తెరలు వ్రేలాడదీసివుంటాయి.

కుడిపక్కన రెండు గుమ్మాలు—పడకగదిలోకి ఒకటి; భోజనాల గదిలోకి ఒకటి వుంటాయి. ఈ రెండు గుమ్మాలకీ పైన రెండు బ్రాకెట్ లైట్స్ బిగించి వుంటాయి. మధ్య గోడపై చిన్న మెల్ఫుమీద అలారం గడియారం ఒకటివుంది.

హాలులో ఎడమప్రక్కగా కోట్ రాక్ వుంది. దాని ప్రక్కనే గోడ అల్మైరాలో రెండు అరలలో పుస్తకాలు సర్దివుంటాయి. కింది అరలో న్యూస్‌పేపర్లు వగైరా మడతపెట్టి వుంటాయి. కుడిపక్కకూడా అలాంటిదే మరో అల్మైరా కూడా వుంటుంది. అందులో ఫణి నాటకాల్లో గెల్చిన బహుమానాలు—షీల్డులు, కప్పులు, కాస్కులు, మేకప్ బాక్స్ ఒకటీ వుంటాయి. కింది అరలో పద్మ అల్లిక దారాల బుట్ట ఉంటుంది. బుట్ట మూత సరిగా వేసివుండదు. అందులోంచి బైటికి వేలాడుతూ రిబ్బన్లూ, పూలు, చిన్న అల్లికగుడ్డ కనిపిస్తూంటాయి. అందులోనే ఒక కత్తెర, రంగుదారాల బంతులు కూడా వుంటాయి. గోడలకి ఫణి మేకప్‌లో వుండగా తీయించుకొన్న ఫోటోలు వ్రేలాడుతూ వుంటాయి.

పాత్రలు
ఫణి
పద్మ
శంకరం
గజపతి
జాఫర్
జలాల్

ఎడమ పక్క స్టేజీకి అడ్డంగా మధ్యలో టేబులు ఒకటి వుంటుంది. దానిమీద ఒక టెలిఫోను, డైరీ, టేబులు లైటూ, ఇంకేవో ఒకటి రెండు పుస్తకాలు, యాష్ ట్రే, వెండి సిగరెట్ కేసు వుంటాయి దానివెనుక ఒక కుర్చీ, దానికింద చిత్తు కాగితాలబుట్ట, ఎడమపక్క స్టేజి మధ్య సోఫా సెట్టు—టీపాయి.

తెర లేచేసరికి—హాలు వాకిలి మూసివుంది. దానికి యేల్ లైప్ లాక్ బిగించి వుంటుంది. ఈ ద్వారం తెరిచినప్పుడు అవతల వరండాలో పై అంతస్తుకు తీసుకుపోయే మెట్ల వరుసలోనివి ఐదారు మెట్లు ప్రేక్షకులకు కనిపిస్తూవుంటాయి.

హాలులో ఏ లైట్లూ వేసి లేవు. ఇంకా బాగా పొద్దుకూక లేదు. బైట బాగా వెల్తురుగా వుంది. పద్మ, శంకరం మాట్లాడుకుంటూ వుండగా క్రమంగా గదిలో లైటు సన్నగిలుతూంటుంది. పద్మ శంకరానికి కాఫీ కప్పు అందిస్తోంది. పద్మ, శంకరం సోఫాల్లో కూర్చుని వున్నారు—

శంకరం: మనిద్దరం కలుసుకుని ఇవ్వాల్టికి సరిగా ఏడాదైంది కదూ పద్మా?

పద్మ: ఆఁ ఆఁ-అవును—

[ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్టు మధ్య మధ్య హాలు గుమ్మంకేసి చూస్తూంటుంది.]

ఏం చేస్తున్నావ్ ఇన్నాళ్ళబట్టీ!


శం: ఏముందీ—

[పద్మ మధ్యలో లేచి హాలు గుమ్మం తలుపు తెరిచి తొంగిచూసి మళ్ళీ తలుపేసి వచ్చి కూర్చుంటుంది]

పద్మ: ఎవరో వస్తున్నట్లైతే వారేమోనని చూశాను...ఆఁ-ఏమిటి-ఎలా వున్నావ్-ఏం చేస్తున్నావ్?

శం: చేసేందుకేముంది ఖూనీలుతప్ప! ఈ యేడు యాభైరెండు ఖూనీలైనా జరిగి వుంటాయి మన చేతిమీదగా. అంతకంటే పనేముంది మనకి!

పద్మ: యాభైరెండా! అకేం లెక్క! (నవ్వుతూ) ఓ-వారాని కొకటన్నమాట!



మాతృక: ఫెడరిక్ నాట్ ★

అనుసరణ: ప్రఖ్యా శ్రీరామమూర్తి

అవునుగాని ఇంతమందిని చంపడానికి నీకు బుద్ధెలా పుడుతుంది శంకరం?

శం: ఎలా బుద్ధిపుడితే అలాగే! కొంతమందిని మేడ మూడో అంతస్తుమీది కెక్కించి తోస్తాను. కొంతమందిని కొండమీదనుంచి పొరబాటున పడదోస్తాను. ఒక్కొక్కసారి విషం పెట్టీ, రివాల్వరుతో కాల్చీ, బాకుతో పొడిచీ, కంఠం పిసికీ, దిండు మొహంమీద నొక్కి ఊపిరి సలపకుండా చేసి-ఓహ్-ఒకటేమిటి-ఎన్ని విధాల ప్రాణాలు తియ్యడానికి అవకాశం వుంటే అన్ని విధాలా హత్యలు చేస్తాను.

పద్మ: నిజంగా నీ బుఱ్ఱ 'డెవిల్స్ వర్క్‌షాప్' అనుకుంటాను. ఇన్నన్ని రకాలదారుణాలు అంత సజీవంగా విచిత్రంగా ఊహించడం-

శం: ఊహా!...హుఁ..యేడాదికి యాభై రెండుసార్లు ఈ చెత్త రాయాల్సివచ్చినప్పుడు మనం 'ఊహించడం' అంటూ ఒకటుంటుందా? ఊహించడానికసలు టైం వుంటుందా!

పద్మ: ఐతే అంతా సద్యస్స్ఫూర్తి అన్నమాట!

శం: హూ స్ఫూర్తీలేదు కీర్తీలేదు. ఏదో కడుపు కక్కుర్తి!

పద్మ: అసలు నీకీ ఐడియాలన్నీ ఎలా వస్తాయి శంకరం?

శం: దానిదేముంది? రోజూ పేపర్లో ఎవడో ఒకడి హత్య కనిపిస్తూనే వుంటుందా-పోతే పోలీసు కేసులూ, ఇతర్లు రాసిన పుస్తకాలూ బోలెడున్నాయి ఇన్స్పిరేషన్‌కి!

పద్మ: ఎప్పుడూ ఒరిజనల్స్ గాని రాయనన్నావు నాతో ఓసారి?

శం: నీతో పరిచయమైన కొత్తల్లో చెప్పివుంటా నలా.

పద్మ: ఐనా వారానికోసారి ఒరిజనల్ గా ఆలోచించి రాయడం ఎవరితరంలే, ఒక్కొక్కసారి అసలు ఆలోచనలే తట్టవనుకుంటాను.

శం: అంత పరిస్థితికూడా ఒక్కొక్కసారి వస్తూనేవుంటుంది. అలాంటప్పుడు మా అవ్వ పోపులపెట్టె తీస్తాను.

పద్మ: అదేమిటి?

శం: ఆ తాతలనాటి పెట్టెలో మూడు డబ్బాలుమాత్రం మిగిలివున్నాయి. 'ఎవర్ని' 'ఎలా' 'ఎందుకు' అని మూడు చీట్లు మూడింటిమీదా అతికించి వుంచాను.

పద్మ: ఏది ఏమిటి? అంటే - 'ఎందుకు' అంటె యేమిటి?

శం: 'ఎందుకు' అనేది హత్యాకారణాన్ని సూచిస్తుంది. దాన్నే 'The Big why' అంటారు పాశ్చాత్య పత్తేదార్లు. అసలు, 'కారణం' అంటూ ఒకటి వుండాలి తెలుసా హత్యకి? ఐదే ఐదు ముఖ్యమైన కారణాలున్నాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ హత్య జరిగినా వీటిల్లో ఏదో ఒకటి కారణం కాక తప్పదు. ఒకటి భయం—రెండు ఈర్ష్య—మూడు ధనం—నాలుగు ప్రతీకారవాంఛ—ఐదు తను ప్రేమించే వారిని రక్షించాలనే ఆకాంక్ష. ఈ ఐదూ ఐదు కాగితం ముక్కలమీద రాసి మడతపెట్టి ఆ 'ఎందుకు' అన్న డబ్బాలో పడేసి కళ్లు మూసుకుని ఏదో కాగితము తీస్తాను.

పద్మ: ఇదేం రచనయ్యా బాబూ. మరీ యింత లాటరీ పద్ధతైతే మంచి సాహిత్యం ఎలా వస్తుంది?

శం: సాహిత్యపు విలువలు ఎవరిక్కావాలి పద్మా యిప్పుడు? నాటకం ఎంత బాగున్నా, దానిమీద వాళ్ళకి ఎంతవిశ్వాసమున్నా రచయిత ప్రార్థించి, ప్రాధేయపడి యాచిస్తే గాని ఎవరూ ప్రదర్శనకు అంగీకరించని నాటకాలూ, పబ్లిషర్సు పబ్లిష్

★ ఫ్రెష్ ★

చెయ్యని నవలలూ వ్రాసేదాన్నంటే మనకేది లాభసాటిగా వుంది.

[వీధి గేటు తెరిచిన క్రీచు చప్పుడు. పద్మ మళ్ళీ హాలు తలుపు తెరిచి చూసి మళ్ళీ వేసి వస్తుంది.]

పద్మ: ఇందాక ఫోనులో నువ్వు మాట్లాడినప్పుడు నే నసలు నమ్మలేకపోయాను తెలుసా! మద్రాసునుంచి మాట్లాడుతున్నా వనుకున్నా.

శం: (కొత్త ఆదుర్దాగా) నేనలా ఫోనులో పిలవడం... మరేం ఫరవాలేదు గదా?

పద్మ: ఏం ఫర్వాలేదు.

శం: ముందు నాతో మాట్లాడింది ఫణేనా?

పద్మ: ఆఁ—వారే. [ఒక్క క్షణం నిశ్శబ్దము—పద్మ తల వంచుకుని.] తొందరగా వచ్చేస్తే బాగుండును. ఎప్పుడు సినిమా కెళ్దామనుకున్నా ఏదో అవాంతరం వచ్చిపడుతూనే వుంటుందాయనకు... అన్నట్టు - ఆయన రాకముందే నీతో ఓ సంగతి చెప్పాలి శంకరం—

శం: ఏమిటది?

పద్మ: మనిద్దరికీ పరిచయమున్నట్టుకూడా ఆయనకి తెలీదు... ఇందాక నువ్వు ఫోన్ చేసినప్పుడు మద్రాసులో మా అన్నయ్య స్నేహితుడివనీ నాటకాలూ నవలలూ రాస్తుంటావనీ చెప్పాను.


శం: అవునూ. అందులో అబద్ధం ఏం లేదుగా.

[పద్మ ఏదో బాధతోనో, భిడియంతోనో చెప్పలేక చెప్పలేక చెప్తుంది—]

పద్మ: ఎలాగూ హైద్రాబాదు వస్తున్నావ్ గదా - మా వాళ్ళనికూడా చూసి రమ్మని మా అన్నయ్య చెప్పి పంపాడట అని చెప్పాను... మా యిద్దరి మధ్యా ఇప్పుడు గొడవలుకూడా యేం లేవు...

[శంకరం ఏం మాట్లాడకుండా ఆమె ముఖంలోకి చూస్తుంటాడు. పద్మ తల వంచుకుంటుంది—]

చాలా హాయిగా వుంటున్నాం... నా మాట జవదాటడం లేదాయన... ఇంతకంటే నే కోరదగింది కూడా ఏం లేదు...



శం: (కొత్త వెటకారంగా చిరునవ్వుతో) ఊఁ... నేను కోరదగింది కూడా ఇకేం లేదనుకుంటాను.

పద్మ: ఇంకో సంగతి శంకరం—

శం: అదేమిటి?

పద్మ: అదసలు మర్చిపోదామనే అనుకున్నా—

శం: సరే - ఇప్పుడు చెప్దామనుకున్నావుగా - చెప్పు.

పద్మ: నాకు కొన్ని వుత్తరాలు రాశావు నువ్వు. జ్ఞాపకం వుందా?

శం: రాశానూ.

పద్మ: ప్రతి వుత్తరం చదవగానే భద్రంగా పెట్టెలో పెట్టి తాళం వేసేదాన్ని. ఒక్కటి తప్ప!

శం: అవును - అసలా వుత్తరం అలా వ్రాయకుండా వుండాల్సింది నేను.

పద్మ: ఆ వుత్తరం మాత్రం ఎక్కడికి వెళ్ళినా నాతో కూడా తీసుకుపోయేదాన్ని. నా పర్సులో పెట్టి హాండ్ బాగ్ లో వుంచుకునే దాన్ని. భద్రంగా వీలు చిక్కినప్పుడల్లా ఓసారి చదువుకునేదాన్ని. ఓ నాడు నేనూ, వారూ అజంతా వెళ్దామని బయలుదేరాం. ప్లాట్ ఫారం మీద రైలుకోసం వెయిట్ చేస్తుండగా నా హాండ్ బాగ్ పోయింది. ఉత్తరం వున్న మనీపర్సుకూడా అందులోనే వుంది.

శం: అఁహాఁ... ఎక్కడ ఇది?

పద్మ: హైద్రాబాదు స్టేషనులోనే. ఆ పక్కనే కూల్ డ్రింక్స్ షాపులో వదిలేశానేమో ననుకున్నా. వెళ్ళి చూశాగాని ఎక్కడా కనిపించలేదది.

శం: మరి దొరకనేలేదా?

పద్మ: రైలుపట్టాలపక్క దొరికిందని వారం పదిరోజుల తర్వాత లాస్ట్ ప్రాపర్టీ ఆఫీసువాళ్లు పంపించారు. కాని అందులో వుత్తరం మాత్రం లేదు. ఆ తర్వాత వారం రోజులకి కవర్లో పెట్టి ఒక చీటీ వచ్చింది పోస్టులో. ఇంగ్లీషులో టైప్ చేసివుంది. అది పంపినవాళ్ళ సంతకంలేదు.

శం: ఊఁ...?

పద్మ: ఆ పోయిన వుత్తరం కావాలంటే నేనేం చెయ్యాల్సిందీ ఆ చీటీలో రాసి వుంది.

శం: ఏం చెయ్యాలట?

పద్మ: పెద్దనోటు పనికిరావట! ఓ వేళ బ్యాంకులోంచి విత్ డ్రా చెయ్యాల్సివస్తే ఆ నోట్లు బజార్లో మార్చి బాగా వాడిన రూపాయి కాగితాలు సంపాదించి అట్టే పెట్టాలట. నే నీ సంగతి పోలీసులగ్గానీ ఇంకెవరిగ్గానీ రిపోర్టుచేస్తే వెంటనే ఆ వుత్తరం మా వారికి చూపిస్తామనికూడా బెదిరించారందులో.

శం: ఇంకా వుందా ఆచీటీ నీ దగ్గర?

[పద్మ తలవూపుతుంది]

ఏదీ—ఓసారి నన్ను చూడనీ.

[పద్మ లేచి పడకగదిలోకి వెళుతుంది. శంకరం లేచి కొంచెం ఆందోళనతో అటూయిటూ పచార్లు చేస్తూంటాడు. టేబులుమీది సిగరెట్ పెట్టెలోంచి సిగరెట్ తీసి ముట్టిస్తాడు. ఇంతలో పద్మ పడకగదిలోంచి రెండు తెల్లని కవర్లు తీసుకువచ్చి ఒకటి శంకరానికిస్తుంది. అతను తీసుకుని కవరులోంచి చీటీ తీసి పరిశీలిస్తాడు...]

ఊఁ...!

[పద్మ రెండో కవరు కూడా ఇస్తుంది]

పద్మ: తర్వాత మళ్లీ రెండురోజులకి ఇది వచ్చింది.

శం: (రెండో కవరులోని చీటీ, రెండు కవర్లమీద పోస్టుముద్రలు చూస్తూ) రెండూ సీతాఫల మండీలో పోస్టుచేసినవే. రెండిటిమీదా ఆ పోస్టు ముద్రలే వున్నాయి. (రెండో చీటీ చదువుతాడు-) "రెండువందల రూపాయినోట్లూ కట్టగట్టి పార్సిలు చేసి ఎస్. లోడీ ఖాన్. కేరాఫ్ ఎ. ఎస్. రామయ్యర్, నం 28. సీతాఫల మండి, సికింద్రాబాద్ అనే అడ్రెసుకు పంపిస్తే మీ వుత్తరం మీకు తిరుగుటపాలో చేరుతుంది"... డబ్బు పంపించావా నువ్వు?

పద్మ: పంపించాను. కాని ఆ ఉత్తరం మాత్రం రాలేదు. పదిపదిహేను రోజులు దానికోసం చూసి చూసి నేనే ఓ పూట ఆ అడ్రెసుకు వెళ్లాను. అదొక లాడ్జి. ఆ పేరుగల మనిషెవరూ రాలేదన్నారు. నేపంపిన పార్సిలు కూడా ఎవరూవచ్చి తీసుకోలేదట.

శం: తమాషాగానే వుందే! (కవరు రెండూ జేబులో పెట్టుకుంటూ) నాదగ్గర అట్టేపెట్టానివ్వి... ఫణికి చెప్పావా ఈ సంగతేమైనా?

పద్మ: లేదు. ఎవ్వళ్లకీ చెప్పలేదు. ఇంతా చేసి వాడు డబ్బెందుకు తీసుకోలేదో నా కర్థం కావడంలేదు.

శం: బహుశా అప్పటికింకే దొంగతనం చేసో జైల్లో పడివుంటాడు. మళ్ళీ నీకేం వుత్తరం రాలేదుగదా వాడి దగ్గర్నుంచి?

పద్మ: లేదు.

శం: ఊఁ...ఇందుకేనా యేమిటి నన్ని వుత్తరాలు రాయొద్దన్నావ్?

పద్మ: మరే. నిజంగా భలే భయం వేసింది. ఆ నాలుగు రోజులూ కాళ్లూ చేతులూ వణికిపోయాయి. నువ్వు నాకు రాసిన ప్రతి వుత్తరమూ నాకంటె ముందే యెవరో చించి చదువుతారని భయం...

శం: అసలప్పుడే నాకెందుకు వ్రాయలేదీ సంగతి?

పద్మ: రాసి ప్రయోజనం? అదీగాక — పోయినది రెండు వందలేగదా — అక్కడితో పోతే పోతుందిలెమ్మనుకున్నాను.

[ఇద్దరూ కాస్సేపు మౌనం]

శం: ఐతే...మనం మొదట్లో అనుకున్న ప్లాను...

పద్మ: ఏది?

శం: మనిద్దరం ఏ మద్రాసో, బొంబాయో...

పద్మ: (అదిరిపడి) శంకరం! ... వొద్దు శంకరం—మళ్ళీ ఆ పాత సంగతులు నాకు జ్ఞాపకం చెయ్యకు—

శం: ఎందుకని? ఈ దాగుడు మూతలు, ఈ దొంగచాటుకంటే అది ఎంత మేలు?

పద్మ: ఇవాళ నా జీవితంలో వాటికి చోటు లేదు. అవంతా ఓ పీడకల. ఆ రోజులు మర్చిపోయి యేడాదైంది...ఆయన ఈ యేడాదినుంచీ చాలా మారిపోయారు శంకరం... ఆయన వున్నట్టుండి ఆ చిన్నతనపు జులాయితనం వొదిలేశారు. నన్నొదలి వుండలేరు. ఆ నాటకాలూ, వేషాలూ అన్నీ మానేశారు. నేనంటే ఇప్పుడు ప్రాణం ఆయనకి...ఆ రాత్రి జ్ఞాపకం వుందా నీకు—తెల్లారితే నువ్వు మద్రాసు వెళ్ళిపోతావనంగా నీ రూముకి వచ్చాను—

★ ఫణి ★

శం : అవును—ఆరాత్రి నేనెలా మర్చిపోగలను? ఫణి మనకు చాలా సహాయం చేశాడు కూడానూ తనకేదో నాటకం రిహార్సల్సు వున్నాయని వెళ్ళిపోయి!

పద్మ : వెళ్ళిపోయారు. కాని మళ్ళీ వెంటనే వచ్చేశారు. ఈ సంగతులన్నీ ఎలా వ్రాయాలో నాకర్థం కాక నీకు వ్రాయలేదు. ఆరాత్రి సరాసరి నీదగ్గర్నుంచి ఇక్కడకు వచ్చేశాను. సోఫాలో పడుకుని కరువుదీరా ఒక్క యేడుపేడ్చి అలానే నిద్రపోయాను. తెలివివచ్చి కళ్ళు తెరిచిచూసేసరికి ఎదురుగుండా ఆయన నిలబడి వున్నారు. నాటకం పుస్తకం చించిపక్కన పోగులు పెట్టి వుంది. ఇహ నాటకాలు మానేసి హాయిగా ఇంటి దగ్గరే వుండిపోదామనుకుంటున్నా పద్మా అని మాత్రం అన్నారు.

శం : అదేం నాటకమో!

[పద్మలేచి ఫలహారపు ప్లేటు తీసుకుని వంటయింట్లో పెట్టి వస్తుంది. షెల్ఫులోంచి రెండు గ్లాసులూ ఫ్లాస్కూ తీసి ఫ్లాస్కులో కాఫీ గ్లాసుల్లో పోస్తుంది.]

పద్మ : అవును. ముందు నేనూ నాటకమే అనుకున్నా. అబ్బ-ఆయన వెనకే కొంగుముడేసుకుని తిరిగి తిరిగి దుంప తెగిపోయేది నాకు. అంతూ పొంతూ లేని నాటకాలు! కాని ఆరోజు ఆయ వన్న మాటలు స్థిర నిశ్చయంతో నే అన్నారు. మర్నాడే వెళ్ళి శ్యాంజీ నారాయణ్జీ కంపెనీలో అసిస్టెంటు మానేజరుగా కుదిరారు కూడానూ.

[ఎక్కడో టవర్ క్లాక్ గంటలు కొడుతుంది]

సరిగ్గా...ఇవ్వాల్టికి యేడాది...

[శంకరం కాఫీగాసు అందుకుంటాడు. ఇద్దరూ కాఫీ త్రాగటానికి నోటిదాకా గ్లాసు లెత్తుతారు. అంతలో నే హాలు తలుపు బీగంలో తాళం చెవిపెట్టి తిప్పిన శబ్దం. ఇద్దరూ అటు తిరుగుతారు. తలుపు తెరుచుకుని ఫణి లోపలికివస్తాడు. వయస్సు 34 సం. మనిషిలో మంచి ఆకర్షణవుంది. అతి చలాకీగా అతిధీమాగా వుంటాడు ఎప్పుడూ.]

పద్మ : అబ్బ—వచ్చారా బాబూ. ఇహ నీపూటకి రారనే అనుకుంటున్నాం... ఇంత ఆలస్యమైందే మండీ?

ఫణి : సారీ డియర్. గుమ్మంలో అడుగు పెట్టేసరికి ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు మా సీనియర్ ప్రొప్రయిటరు.

[ఫణి కోటుతీసి కోట్ రాక్ కు తగిలిస్తూంటాడు. శంకరం కాస్త ఇబ్బందిగా ఫీలయి ఇటు తిరిగి నిలబడతాడు]

పద్మ : వీరు ... వీరేనండీ శంకర్రావుగారు—మా అన్నయ్య ఫ్రెండు—మెడ్రాసు నుంచి వచ్చారని చెప్పానూ?

ఫణి : నమస్కారం.

శం : (కరస్పర్శ చేస్తూ) మీ పేరు నాకు తెలుసు — ఫణి!

ఫణి : క్షమించాలి సార్ నా ఆలస్యానికి. మా పద్మ మీకేం లోపం చెయ్యడం లేదుగదా?...ఎలా వుంది కాఫీ?

శం : ఫస్టుగా వుంది.

[పద్మ మరో గ్లాసులో కాఫీపోసి తెచ్చి ఫణికి ఇస్తుంది]

ఫణి : ఊఁ...హైద్రాబా దెలావుంది?.. ఇదే మొదటిసారా మీ రిక్కడికి రావడం?

శం : లేదు — ఏడాది కిందటో సారి ఫ్రెండ్సుతో కలిసి వచ్చాను.

ఫణి : ఆఁ ఆఁ అవునట. పద్మ చెప్పింది. మీరు నవలా రచయితలుకూడా నట?

శం : ఖర్మకాలి నాటకాలు కూడా రాస్తూంటాను. ప్రస్తుతం రేడియోలో కథ ఒకటి చదవడానికి పిలిపిస్తే వచ్చాను.

ఫణి : ఓ—అలాగా!

శం : ఇల్లా హైద్రాబాదు వెళ్తున్నానంటేనూ—మా వాళ్ళనికూడా చూసిరమ్మని మీ బావ మరీ మరీ చెప్పాడు...

ఫణి : అవునట. వాళ్ళంతా కులాసాగా వున్నారా?

శం : ఓ.

ఫణి : ఊఁ...ఉంటారా నాలుగు రోజులు?

శం : అప్పుడే చెప్పలేను. ఎల్లుండి ఈ ప్రోగ్రాం అయిపోతుంది. తర్వాత రెండు నాటికలు వ్రాసి వాళ్ళకే ఇవ్వాలి. అదికాస్తా ఐపోతే అలా అజంతా, ఎల్లోరా తిరిగి వద్దామని వుంది.

ఫణి : బాగానే వుంది. కాని అనవసరంగా టైమంతా ఆ అడవుల్లో కొండగుహల్లో వృథా చెయ్యకండి. నా వుద్దేశంలో మచ్చుకు ఒకటిమాస్తే చాలు మొత్తం చూసినట్టే. బోటు షికారంటే మీ కిష్టమేనా?

శం : లేదు...అంటే—

ఫణి : హుసేన్ సాగర్ లో చిన్న బోటు తీసుకుని తెడ్డు వేసుకు నడుపుతుంటే—

పద్మ : అబ్బే—అసలు నీళ్ళంటే భయమండీ ఇతనికి!

ఫణి : ఓహో...సరే—వూళ్ళో ఎక్కడైనా తిరగాలనిపించినప్పుడు మటుకు చెప్పండి. (పద్మతో) ఏం పద్మా, సాలార్ జంగ్ మ్యూజియంకు తీసుకుపోతే మీ ఫ్రెండుని?

శం : అది నిన్ననే చూశానండీ

ఫణి : ఓ. వాట్సే షేమ్! నాకు మటుకు అది ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనే అనిపిస్తుంది. ముఖ్యంగా నవరత్నాల పిడిగల బాకుఒకటివుంది—నురాజుద్దౌలాదట—అది చేతపట్టు కుంటే...we really feel the thrill of it!

పద్మ: ఏమండీ మనకి టైం అయిపోవడం లేదు?

ఫణి: ఒక చిన్న సవరణ పద్మా అనుకున్న ప్రోగ్రాంలో.

పద్మ: మీరు రావడానికి వీల్లేదనిమాత్రం అనకండీ మీకు పుణ్యంవుంటుంది.

ఫణి: వచ్చినగొడవే అది! రేపు మా ప్రొప్రయిటరు ఢిల్లీ వెళ్తున్నాడు. ఆఫీసు తాలూకు బిజినెస్ స్టేట్ మెంట్లు కొన్ని

తయారుచేసి రేపొద్దున్నే అందించాలాయనకి!

పద్మ: సినిమానుంచి వచ్చినతర్వాత చేసుకోరాదూ ఆపని?

ఫణి: సారీ డార్లింగ్. తెల్లార్లూ పట్టినా పట్టొచ్చు.

పద్మ: మరి....(శంకరంవంక చూస్తుంది.)

శం: పోనీ మానేదాం.

ఫణి: నో, నో, నో! పొద్దున్నుంచీ ఎదురుచూస్తున్న ప్రోగ్రాం మానుకోవడం యెందుకు? మీరిద్దరూ వెళ్లిరండీ.

శం: సరదాగా అంతా కలిసి వెళ్దామనుకున్నాం. అంతేగాని మిమ్మల్ని వొదిలేసి వెళ్లితీరాల్సినంత పెద్దసినిమాయేం కాదులెండి.

ఫణి: సీట్లుకూడా మధ్యాహ్నమే రిజర్వు చేశాను. ఎవళ్లం వెళ్లకపోతే వేస్టు! ఇదిగో టిక్కెట్లు.

శం: (కప్పిపుచ్చుకున్న ఆత్రుతతో తీసుకుంటూ) థాంక్స్!

ఫణి: నేను రాలేకపోతున్నందుకు క్షమించాలి.

శం: మీరు రాకుండా వెళ్లడం నాకూ ఏంబాగులేదు. కానివ్వండి ఏంచేస్తాం—వుద్యోగధర్మం కదా! ఐనా మిమ్మల్ని పక్కన కూర్చోబెట్టుకుచూస్తే ఏం ప్రయోజనం—[పద్మ కలవరంతో అతనివంక చూస్తుంది.]

ఫణి: అదేమిటి-మీ పక్కన కూర్చోడానికి ప్రత్యేకార్హతలేమైనా కావాలాయేమిటి?

శం: ఛా ఛా-అదికాదు నా వుద్దేశం. నాటకరంగంమీద ఇంతపేరు గడించుకున్న మిమ్మల్ని రంగంమీదనే చూడాలని నాఅభిలాష!

ఫణి: నా వేషం ఎప్పుడైనా చూశారా మీరు?

శం: ఆఅదృష్టానికినోచుకోలేదు. అసలు మీకు మొన్న మొన్న నాటకాల పోటీలో ప్రైజు వచ్చిందని పేపర్లలో చదివేదాకా మీరు నటులని నాకు తెలీనే తెలీదు. ఈసారి ఏదైనా ప్రోగ్రాం వున్నప్పుడు తెలియజెయ్యండి. తప్పకుండా చూడాలని వుంది.

ఫణి: (నిస్పృహతో ఓసారి నిట్టూర్చి) క్షమించండి. ఆరంగానికి స్వస్తి చెప్పాను.

శం: అదేం?

ఫణి: పాపం మీలాగానే నా కోసం, నా నటనకోసం నా కళా వైదుష్య ప్రదర్శనకోసం ఎదురుచూసే ప్రేక్షకులూ, ఫానూ చాలా మందివున్నారు. ఇప్పటికీ రోజూ కొందరు ప్రాసియేషను వాళ్లు కాళ్లా వేళ్లా బడుతూనే వున్నారు, ఒక్క నాటకం డైరెక్టు చేసి పెట్టమని. కాని—ప్చ్...లాభం లేదు. ఆ ఫీల్డు వదిలేశాను...అన్నట్టు—రేపు రాత్రి మీకేమైనా ఎంగేజిమెంటు వుందా!

శం: రేపు గురువారం కదూ?...లేదు.

ఫణి: ఐతే రేపు సాయంత్రమే ఇక్కడికి రండి. రేపు రాత్రికి మన శిష్యులదే నాటకం ఒకటుంది. ఇక్కడే భోజనం చేసి వెళ్దాం.

పద్మ: అసలు ఈ పూటే భోజనానికి వుండమని బతిమాలానండి. ససేమిరా వుండనంటున్నారు.

ఫణి: మా ఆవిడ పాకశాస్త్రంలో నలభీములిద్దర్నీ మించిపోయింది కూడా సంగీతం మీకు తెలీదేమో.

శం: ఐతే నేను రాను బాబూ.

★ ఫణి ★

పద్మ : అబ్బ పొండీ మీ జోక్స్! వేళా పాళా లేను.

ఫణి : మీరు రేపు తప్పకుండా రావాలి.

పద్మ : మొహమాట పడకు శంకరం.

శం : (నవ్వుతూ) ఇంతబలవంత పెట్టించుకోవడం నా కలవాటు లేదు. సరే కానీండి.

ఫణి : కాని పద్మమటుకు నాటకానికి రాదు.

శం : అదేంమళ్లీ?

ఫణి : ఆవిడ వ్రతం పట్టిందిలెండి.

శం : (పద్మతో) ఏమండీ?

పద్మ : అవును. ఆ నాటకాల వెంబడిపడి నేతిరిగిన తిరుగుడు మీకేం తెలుసు? విసుగెత్తిపోయేది. ఓసారి వొళ్ళునుండి నాటకాలు మరిచూడనని ఒట్టు పెట్టుకున్నాను.

ఫణి : మరి మనిద్దరమే పోవాల్సి వుంటుంది. వస్తారుకదూ?

శం : ఓ యస్. కాని నాదో ప్రపోజలు వుంది. మీరిప్పుడు మాతో సినిమాకి రాలేకపోతే సినిమా ఆఖరయ్యే టైముకైనా హాలు దగ్గరకు రావాలి. అక్కణ్ణుంచి ముగ్గురం కలిసి తాజ్ హోటలుకు వెళ్దాం. అక్కడ డిన్నరు-ఆన్ మై ఎకౌంట్.

పద్మ : అవునండీ-ఇది చాలా బాగుంది. అప్పటికీ మీ ఆఫీసుపని కాకుంటే మళ్లీ వచ్చి చూసుకోవచ్చు. మధ్య కాస్త విశ్రాంతిగా వుంటుంది కూడానూ.

ఫణి : (ఓ క్షణం ఆలోచించి) ఆల్ రైట్.

శం : థాంక్స్!

ఫణి : (వాచీ చూసుకుని) మరి మీకు టైం అవుతోంది.

పద్మ : సినిమా అయిపోయేముందు ఫోను చేస్తాను. మీకు వెంటనే బయల్దేరి వస్తారుగా?

ఫణి : సరేనన్నానుగా. పదండి మరి-హారి అప్.

[పద్మ, శంకరం బైటకు వెళ్తారు]

ఫణి : (బైటకు తొంగిచూసి) హాలో మిస్టర్ శంకరం!

శం : (బైటనుంచి) ఏమిటి?

ఫణి : ఆ మూడో టిక్కెట్టు వుంది చూశారూ-అది కాస్తా అమ్మెయ్యండి. రెండు డ్రింకులు తాగొచ్చు.

పద్మ : (బైటనుంచి) చాల్లే వూరుకుందురూ మీరు మరీనూ.

శం : (బైటనుంచి) సరేలే-ఒక కప్పు కాఫీ కోసం ఈ కవులు పడే కక్కుర్తి నీకేం తెలుసు! అచ్ఛా-

[ఫణి తలుపు వేసి తాళం తిప్పుతాడు. గోడ నున్న బ్రాకెట్ లైట్లు స్విచ్చాఫ్ చేసి ఆర్పుతాడు. తోటవాకిలి తెరలు లాగి మూసేస్తాడు. టేబిల్ లైటు వేసి టెలిఫోను వైపు తిరుగుతాడు. దాని వంక ఓ క్షణం చూసి, రిసీవరు యెత్తి ఒక నంబరు డయల్ చేస్తాడు. కొద్ది వ్యవధిలో ఫోనులోంచి గజపతి కంఠస్వరం వినిపిస్తుంది...]

గజపతి : హాలో!

ఫణి : హాలో-6337?

గజ : యస్.

ఫణి : ఆc-గజపతి రావు గారితో మాట్లాడాలి...

గజ: మీరు మాట్లాడుతున్నది వారితోనే!

ఫణి : ఓ-గుడీవెనింగ్! నన్ను మీరెరుగరు నా పేరు పరమేశ్వరం.... మీ కారేదో అమ్ముతారని విన్నాను...

గజ : అవును. మెర్కూరీ 1958.

ఫణి : అదే. పొద్దున గారేజీలో చూశాలెండి. ధర ఎంతలో వుంది?

గజ : ఆరు వేలు.

ఫణి: ఆరు వేలు!...ఓ...ఐసీ...కారైతే నాకు నచ్చింది గాని...ధరే బాగులేదు.

గజ : నేను కొన్నప్పుడు నాకూ అలాగే అనిపించింది.

ఫణి : (నవ్వి) మరి ... మన మెప్పుడు కలుసుకుందాం?

గజ : రేపు సాయంత్రం రండీ.

ఫణి : సారీ, ఆ టైములో నాకు కుదరదు. (విరామం) ఊc హూc-లాభంలేదు. ఎల్లుండి శనివారం-అసలే కుదరదు...పోనీ ఇవ్వాళే మా యింటికి రారాదూ మీరు?

గజ : ఎక్కడది?

ఫణి : ఖైరతుల్లాబాద్. వెనే వచ్చేవాణ్ణి గాని కాలు కాస్త బెణికింది...

గజ : సరే-అడ్రసు చెప్పండి.

ఫణి : 39 ఎ. ఫతీమా గార్డెన్స్.

గజ : 39 ఎ. ఫతీమా గార్డెన్స్?

గజ : దట్స్ రైట్. బస్ స్టాప్ దగ్గర దిగంగానే ఎడమపక్కకు తిరగండి. రెండు నిముషాలు నడక!

గజ : సరే ఓ గంటలో వస్తాను.

ఫణి : వెరీగుడ్. (ఆదుర్దాతో) అన్నట్టు కారులో వస్తారా మీరు?

గజ : నో సార్. టైరు ఒకటి కొత్తది వేయిస్తున్నాను.

ఫణి : (నిట్టూర్చి) ఫరవాలేదు. పొద్దున బాగానే చూశాలెండి.... ధరే కాస్త తగ్గితే వ్యవహారాలన్నీ ఇక్కడే పూర్తిచేసుకోవచ్చు మనం.

గజ : దయచేసి ధర తగ్గించే ప్రసక్తి మటుకు తీసుకురాకండి.

ఫణి : సరే రండి తప్పకుండా వస్తారు గదూ?

గజ : ఓయస్.

ఫణి : Goodbye for the present.

గజ : Goodbye.

ఫణి : (రిసీవరు దించేసి) హుc! (వెటకారంగా పెదవి విరిచి వికృతహాసం చేస్తూ) గజపతిరావు!

(లైట్లు ఫేడౌట్ అవుతాయి.)

(ఇంకా ఉంది)

హిందీలో "దొంగరాముడు"

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మంచి పేరు తెచ్చుకున్న సంస్థ అన్నపూర్ణా పిక్చర్స్ ఇపుడు హిందీలో చిత్ర నిర్మాణానికి ఉపక్రమిస్తున్నారు

ఆంధ్రలో విజయయాత్ర చేసిన వీరి "దొంగ రాముడు" చిత్రమే దీనికి కథా వస్తువు. ఈ చిత్రం ఇటీవలే తమిళంలో "తిరుట్టు రామన్" పేరిట విడుదల అయిన విషయం విదితమే.

ఇప్పుడు హిందీ చిత్రరంగంలో వీరు స్వతంత్రంగా కాకుండా, ఎ. వి. ఎం. వారితో కలసి చిత్ర నిర్మాణానికి పూనుకొంటున్నారు.

ఈ చిత్రంలో ప్రధాన భూమికను శ్రీ నాగేశ్వరరావే నిర్వహిస్తారు. తెలుగు చిత్రం దర్శకుడు శ్రీ కె. వి. రెడ్డికే ఈ చిత్రం దర్శకత్వ బాధ్యత కూడా ఒప్పగిస్తున్నట్లు నిర్మాత మధుసూధనరావు తెలియజేశారు మిగతా నటీనటుల విషయం, సంగీత దర్శకత్వం ఎవరికి ఒప్పగించేది, ఇంకా నిర్ధారణ కాలేదన్నారు.

ఈ విధంగా కట్టుదిట్టమైన పద్ధతిలో, నూతన విజయాలకై ప్రయత్నం చేస్తున్న అన్నపూర్ణా పిక్చర్స్‌కు శుభాకాంక్షలు.

ఎ. వి. ఎం. తరువాతి చిత్రం

ఎ. వి. ఎం. వారి తరువాతి హిందీ చిత్రములో ప్రధాన భూమికను శ్రీ నాగేశ్వరరావు నిర్వహించగలరని తెలుస్తున్నది.

నాగేశ్వరరావు ప్రస్తుతం ఎం వి. రామన్ నిర్మిస్తున్న "ఆశై" అనే తమిళ చిత్రంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్నారు. దీనికి హిందీ ప్రతి "ఆశా"లో కిశోర్ కుమార్ నాయకుడు. వైజయంతిమాల రెండు చిత్రాలలో నాయిక.

* * *

"బాలసన్యాసమ్మ"

జోయా అండ్ రేవతీవారి "బాల సన్యాసమ్మ" చిత్రం వారం రోజులలో విడుదల కాబోతోంది "వయారిభామ" చిత్రం తీసిన శ్రీ పి సుబ్బారావు దీనికి దర్శకుడు, నిర్మాత. ఆగస్టు 29 న ఈ చిత్రం సెన్సారు అయింది.

ఈస్టిండియా కంపెనీ ప్రభ వెలిగిన రోజులలో తెలుగునాట జరిగిన కథగా దీన్ని చిత్రించారు. అందువల్ల క్రొత్తదనంతో ఈ చిత్రం ఆకర్షణీయంగా రూపొందిందని రషెస్ చూసినవారు చెబుతున్నారు "బాల సన్యాసమ్మ" భూమికను కృష్ణకుమారి నిర్వహించింది. ఆమె భర్తగా ధలం, శాస్త్రి గారుగా జగ్గయ్య, తోడికోడలుగా జి. వరలక్ష్మి, ఆనపడుచుగా సూర్యకాంతం నటించారు రేలంగి మాజీసైనికుడుగా కనబడబోతాడు. శ్రీ వి నాగయ్య ఇందులో "గస్ట్ ఆరిస్ట్"గా పాల్గొన్నారు. ఈ చిత్రానికి రచన శ్రీ సముద్రాల రాఘవాచార్య సంగీత దర్శకుడు శ్రీ సాలూరు రాజేశ్వరరావు

వీనస్ స్టూడియోలో

"మంచి హుషారుగా చురుకుగా తయారవుతోంది మా చిత్రం" అన్నారు దర్శ



జోయా అండ్ రేవతీవారి "బాలసన్యాసమ్మ" చిత్రంలో మాజీసైనికుడుగా రేలంగి.

కుడు శ్రీ వేదాంతం రాఘవయ్య. అంతలో షాట్ కు సర్వం సిద్ధం అయింది.

"సైలెన్స్."

షాట్ ప్రారంభం అయింది.

మహామంత్రి హుందాపుడిగా ముస్తాబవుతున్నారు. "మహామంత్రికి జయము జయము" అంటూ హెచ్చరిక వినబడింది.

మహామంత్రి తలపాగా సర్దుకుని, గబగబ వెళ్ళి తలుపులు తీశారు.

"సముద్రస్నానానికి రమ్మని మహారాజా గారి సెలవైంది" అన్నారు ఆ వచ్చిన భటులు.

మహామంత్రి ఒక్క క్షణం ఆలోచించారు. "సరే పదండి" అన్నారు సాధ్యమైనంత గంభీరంగా

భటులు వెళ్ళిపోయారు. మంత్రి వెంట నడిచారు.

'కట్...ఓ కే.'

ఒక్క క్షణం తరువాత మహామంత్రి తాపీగా హాలులోకివచ్చి పంకాదగ్గర నిల్చున్నారు.

ఉక్కపోస్తోంది. అందుకని మహామంత్రి "ఉష్ అమ్మయ్య" అంటూ శిరోవేష్టనాన్ని తొలగించారు.

ఒక్కసారిగా మంత్రిగారి కాషాయ రంగు అంగరఖా వలగా అయిపోయింది. "తలిదండ్రులు పెట్టనిసొమ్ములు" పెన్నెరుల తెర వల్లగా నిగనిగలాడుతూ చరచర దిగి మహామంత్రి అంగరఖాను ఆవరించింది. కారణం వారు మహామంత్రి కారు. ఉత్తి మంత్రికూడా కారు. అవసరంకొద్దీ ఆ వేషం వేసి బుకాయింపుకి సిద్ధపడ్డ రాకుమార్తె భూమిక నిర్వహిస్తున్న అంజలీదేవి.

ఈ పన్ని వేశం అంజలీపిక్చర్స్ వారి జానపద చిత్రంలోనిది. ఇందులో నాగేశ్వర రావు నాయకుడుగా నటిస్తున్నారు. నిర్మాత శ్రీ ఆదినారాయణరావు. రచన శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి.

ఈ చిత్రం నిర్మాణం సగానికిపైగా పూర్తి అయినదని దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్య చెప్పారు.

శ్రీ గౌరి మాహాత్మ్యం

యోగానంద్ దర్శకత్వాన మహీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న "శ్రీ గౌరిమహాత్మ్యం" ఈ నెల ఆఖరువారంలో విడుదల కావచ్చునంటున్నారు. శ్రీరంజని, సూర్యకళ, అంజలి, రామారావు, రేలంగి పాల్గొన్నారు.

అనుపమా, ఫిలింస్ వారి "ముద్దుబిడ్డ"కు తుది మెరుగులు దిద్దటం ఆగస్టు ఆఖరు వారంలో పూర్తి అయింది ఈ చిత్రాన్ని ఈ నెల ఆరవ తేదీన విడుదల చేస్తున్నారు. శ్రీ తిలక్ దర్శకత్వాన తయారైన ఈ



"కినారే కినారే" చిత్రంలో మహమద్, నాట్యతార మీనూముంతాజ్.

చిత్రంలో జమున, లక్ష్మీరాజ్యం, నాగయ్య, జగ్గయ్య, మాస్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. శరత్ నవల "బిందు గారి అబ్బాయి" దీనికి ఆధారం.

శంకర్ ప్రొడక్షన్స్ వారి "సదారమ" ఆగస్టు 31 న విడుదల అయింది. జానకి, రేలంగి, ముక్కామల, కల్యాణకుమార్ ఇందులో పాల్గొన్నారు.

స్వర్గీయ 'కాశీ' ఇందులో ఒక ప్రముఖ భూమిక నిర్వహించారు.


* * *

"రేపు నీదే"

భాస్కర్ ప్రొడక్షన్స్ వారి మూడవ చిత్రానికి "రేపునీదే" అని నామకరణం చేశారు. ఇందులో జగ్గయ్య, రంగారావు, రేలంగి, జానకి, కృష్ణకుమారి, రాజసులోచన నటిస్తున్నారు. దర్శకుడూ, నిర్మాత, శ్రీ భాస్కరరావు. సంగీత దర్శకుడు ఘంటసాల.

వీరి నాలుగవ చిత్రానికి పాటల రికార్డింగు పూర్తి అయిపోయింది. దీనికి శ్రీ రమేష్ నాయుడు సంగీత దర్శకుడు ఈ చిత్రంలో హిందీ ప్లేబాక్ గాయకుడు తలత్ మహమద్ నాలుగు పాటలుపాడారు.

* * *



శావల్ ఫిల్మ్స్‌వారు, నిర్మిస్తున్న "మిస్ ఇండియా" చిత్రంలో నర్గీస్.

కీర్తిశేషుడు కౌశిక్

****

రేపు సెప్టెంబరు 25 వ 26 వ తేదీన పెళ్లి చేసుకోవలసిన నటుడు "కౌశిక్"ను ఆగస్టు 17 వ తేదీన హఠాత్తుగా నూరేళ్లు నిండిపోయాయన్న వార్త సినిమా కళాకారులు అందరికీ, ఆప్తులకూ, మిత్రులకూ పరిచితులకూ పిడుగుపాటులా వచ్చి పడింది. ఆ రోజున కౌశిక్, ఉదయా ఫిలింస్ వారి కన్నడ చిత్రం "భాగ్యోదయ"లో ఉదయం 7 నుంచి ఒక కాల్‌షీట్ పూర్తిగా పని చేశాడు. పన్నెండు గంటలకి కాఫీ పుచ్చుకొన్నాడు. తరువాత, ఒంట్లో బాగులేదన్నాడు.

ఒంటిగంటకు ఇంటికి వెళ్లి, గుండెలో నొప్పిగా ఉందంటూ విలపించాడు. కొద్ది సేపటిలో ప్రాణాలు పోయాయి.

కౌశిక్ నిజనామం లక్ష్మీనరసింహశాస్త్రి. జన్మస్థలం ప్రొద్దుటూరు. పచ్చయప్ప కళా[illegible] లోను విద్యాభ్యాసం చేశారు. శ్రీ కె. పుల్లయ్య 'కౌశిక్'ను చలనచిత్రరంగంలో ప్రవేశపెట్టారు. రాగిణీవారి "ధర్మదేవత" కౌశిక్ తొలిచిత్రం. తరువాత అరుణా ఫిలింస్ వారి "గుమాస్తా", శక్తీ రాజా వారి "ఒక్కతల్లి పిల్లలు" చిత్రాలలోనూ, శ్రీరత్న, రేణుకా మాహాత్మ్యం, అనేక కన్నడ చిత్రాలలోను ముఖ్యభూమికలు నిర్వహించారు. ఆయన ఆఖరు చిత్రాలు శంకర్ ప్రొడక్షన్స్‌వారి "సదారమ." ఇది కన్నడ తెలుగు భాషలలో తయారైంది. తెలుగు చిత్రం ఆగస్టు 31 న విడుదల అయింది. మరో చిత్రం ఉదయా వారి "భాగ్యోదయ".

"కౌశిక్"కు ఇద్దరు కుమార్తెలున్నారు. మొదటి కుమార్తెకు మూడేళ్లు. రెండవ కుమార్తెకు ఏడాది కూడా నిండలేదు.

జ్యోతిశ్శాస్త్రం అంటే కౌశిక్‌కు, ఆయన భార్యకూ కూడా చాలా అభిమానం.

"1960 తరువాత నా అదృష్టం బాగా రాణిస్తుంది" అంటూ ఉండేవాడు కౌశిక్ ఆప్తమిత్రులతో......

★



కౌశిక్

ఎ. వి. ఎం. వారి "బాలల చిత్రం"

పిల్లలకోసం ఎ. వి. ఎం. వారు ప్రత్యేకం నిర్మిస్తున్న చలనచిత్రం "హం పంఛీ ఏక్ డాల్ కే"ను ఆగస్టు 25 సాయంకాలం ఎ. వి. ఎం. స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది. బాల చలనచిత్ర సంస్థతో ప్రమేయం లేకుండా, స్వతంత్ర స్థాయిలో చలనచిత్ర పరిశ్రమ తరఫున తయారుకానున్న మొదటి "బాలల చిత్రం" ఇదే.

ఉత్తమ చిత్ర నిర్మాతగా పేరుగడించుకొన్న మహారాష్ట్ర చలనచిత్రకారుడు శ్రీ సదాశివ్ జె రావ్ కవి ఈ చిత్రానికి నిర్మాత.

తన కొడుకు బీదపిల్లలతో కలిసి తిరగడం తన పేరుప్రతిష్ఠలకు భంగకరమని భావించిన ఒక జమీందారు కథ దీనికి ఇతివృత్తం. చివరకు అనేక బీదబాలుడివల్లనే జమీందారు తన తప్పు తెలుసుకొని సరిదిద్దుకొంటాడు. కథ [illegible] నారాయణ్ రావు, మాటలూ, పాటలూ శ్రీ పి. ఎల్. సంతోషి వ్రాశారు. శ్రీ సంతోషియే దర్శకత్వం వహిస్తారు. సంగీతం ఎన్. దత్తా, ఛాయాగ్రహణం శ్రీ ఎస్. మారుతిరావు, కళాదర్శకుడు శ్రీ హెచ్. శాంతారాం.

బాలనటులు మాస్టర్ రోమీ, సతీష్ వ్యాస్ (తూఫాన్ ఔర్ దియా), రూప్ కుమార్ లు, అచలసచ్ దేవ్, డేవిడ్, మురాద్ బి.ఎం. వ్యాస్ ప్రభృతి నటీనటులు పాల్గొంటారు.

శ్రీ మెయ్యప్ప చెట్టియార్ ప్రసంగిస్తూ, ప్రభుత్వ సహాయం అపేక్షించకుండా, ప్రజాదరణే ప్రధానంగా పరిగణించి, తాము ఈ చిత్ర నిర్మాణానికి పూనుకొంటున్నామన్నారు.

ప్రస్తుతానికి తామీ చిత్రాన్ని హిందీలో నిర్మిస్తున్నారని, దీని విజయాన్ని బట్టి ఇతర ప్రాంతీయ భాషలలో చిత్రాలు నిర్మించాలని సంకల్పమనీ ఆయన చెప్పారు.

నిర్మాత శ్రీ సదాశివరావ్ మాట్లాడుతూ, అసలు మనదేశంలో పిల్లల చిత్రాల నిర్మాణం భారీఎత్తున జరగాలంటే, ఆచిత్రాల ప్రదర్శనకు వసతులు సమగ్రంగా ఏర్పాటుకావడం చాలా అవసరమన్నారు. హీరో హీరోయిన్, విలన్, భారీసెట్‌లూ, పెద్ద పెద్ద నృత్యాలూ మొదలైన హంగులతో తయారైవచ్చే పెద్ద చిత్రాల పోటీకి ఇవి తట్టుకు నిలబడాలంటే వీటికి ప్రదర్శన వసతులు విరివిగా ఉండడం అవసరమన్నారు.

చిత్ర నిర్మాణం నవంబరు నాటికి పూర్తి కాగలదని శ్రీ సదాశివ్ రావ్ తెలియచేశారు.

*   *   *

పరిచయం:

సంగీతదర్శకుడు రమేష్ నాయుడు

"మో జాకొర్డ్ పాశ్చాత్యసంగీతాన్ని గాని మరే పరాయి సంగీతాన్ని గాని ఎరువు తెచ్చుకుంటే తెచ్చుకోవచ్చు కాని, "మనది అయిన" మంచి సంగీతం కరువయినదని కారణం చెప్పుకోవడానికి ఆస్కారం లేదు మనకి సజీవమైన జానపద సంగీతం అపారంగా వుంది ఈ సజీవ స్వగార్జితాన్ని మనవారు చాలామంది పట్టించుకోనక పోవడం శోచనీయం"

తెలుగు వారికి త్వరలో నే సుపరిచితుడు కాబోతున్న యువ సంగీత దర్శకుడు శ్రీ రమేష్ నాయుడు వెలిబుచ్చిన అభిప్రాయం ఇది తెలుగునాట కాకపోయినా, మహారాష్ట్ర, గుజరాతీ, కర్ణాటక సీమలలో, ఈ మాటలు అక్షరాలా నిజమని ఋజువు చేశాడు రమేశ్ నాయుడు

సన్నగా, బక్కపలచగా, చామంచాయతో ఉండే రమేష్, ఎనిమిదేళ్ల వాడు (పదహారేళ్ల ఈడు), ఒకరోజున కొండపల్లి ఊరి శివారుకొచ్చి "చలో బొంబాయ్" అనుకున్నాడు స్వగతంవంటి నినాదానికి గొంతు కలిపే అన్న వాళ్లెవరూ అప్పుడు లేరు గట్టిగా పదివగల తండ్రి పూల నరసింహారావు గారు, రమేష్ ఆర్నెలల పసివాడు గా ఉన్నప్పుడే గతించారు. రమేష్ తన 16 వ యేట తల్లినికూడా కోల్పోయాడు

అందుకని, చల్లగా ఊరుదాటి వచ్చిన రమేష్ పిల్లగానే అయినా, ధైర్యంగా "చలో బొంబాయ్" అనుకుని బయల్దేరాడు. కంట కాల బాటన కష్టపడుతూ అటంకాలను ఒంటరిగానే ఎదుర్కొంటూ బొంబాయిలో కాలికి బలపంకట్టుకు తిరిగిన రమేశ్ రెండేళ్లలోనే స్థిమితపడి, కాలు నిలద్రొక్కుకోగలిగాడు

మొదట్లో, అందరికీ జరిగినట్లే, అతనికి కూడా 'నహీ' జవాబే వినబడేది కొన్ని సందర్భాలలో, "తుం ఆంధ్రా వాలా, మదరాస్ చలో" అంటూ సలహాలు మిళాయించిన జవాబులు ఎదురయేవి.

సంగీతం మనకెందుకు, ఇంజనీరు నవుదువుగాని అంటూ లాలించి, మందలించి, కోప్పడి, శతవిధాల చెప్పిన తల్లిమాటే వినలేక పోయిన రమేష్ ఈ సలహాలు పట్టించుకోలేదు. చేతినెతే నవ్వేవాడు లేకపోతే నవ్వుకునేవాడు మళ్లీ ఇంకో చోటుకూ మరో ప్రయత్నానికి.

"అసలు చిన్నప్పుడు కొండపల్లిలో, బడి ఎగేసి అస్తమానం సంగీతంకోసం పరుగెత్తేవాణ్ని మా అమ్మగారు కొట్టేవారు అంతలో హార్మనీ నేర్చుకున్నాను అప్పట్టి ముట్టుకుంటే వేళ్లు విరగ్గొడతా అనేవారు మా అమ్మగారు అని కొట్టేవారు కూడా. ఏనా నాకు సంగీతం నేర్చుకోవాలన్న ఆశ, పట్టుదల తగ్గలేదు ఒకసారి ఇంట్లో చెప్పకుండా పూనా పారిపోయాను నాకోసం వెతికించారు కొన్నాళ్ళకు నేనే తిరిగి వెళ్ళాను. మా అమ్మగారు అస్వస్థతతో తీసుకుంటున్నారు. కొద్దిమాసాల తరువాత ఆమె గతించారు అక్కడితో నన్ను కోప్పడే వాళ్ళు నాకోసం బెంగ పెట్టుకునేవాళ్లూ ఎవరూ లేకపోయారు నాకు అన్నదమ్ములూ అక్కచెల్లెళ్లు ఎవరూ లేరు" అంటారు రమేష్

ఒక్కడే కాబట్టి ఈసారి మరింత పట్టుదలతో తెగింపుతో బొంబాయి ప్రయాణమై వెళ్లాడు.

ఎక్కడికి వెళ్లినా లాక్షిత్యం ఎదురవుతున్న ఆరోజుల్లో బొంబాయి ఆలిండియా



రమేష్ నాయుడు ఆయన ఆప్తమిత్రుడు తలత్ మహమూద్.

★ రమేష్ నాయుడు ★

రేడియోలో మరాఠీ సంగీతశాఖ అధిపతిగా ఉన్న శ్రీ బాలకుర్డ్‌కర్, సన్నటి మెత్తటి కంఠంతో శ్రావ్యంగా పాడుతున్న ఈ తెలుగు యువకుణ్ణి ఆదరించి, రేడియోలో పాడే అవకాశం ఇప్పించారు. పాటలు బాగున్నాయని పదిమందీ మెచ్చుకున్నారు

హెచ్ ఎం. వి. కంపెనీకి ఒకసారి వెళ్ళిరోయ్ అని సలహా ఇచ్చారు రమేష్ శ్రేయోభిలాషి

"దానికి వరసాకూడా మీరే రాసుకు తెచ్చుకోవాలి" అన్నారు హెచ్ ఎం వి. వారు

రెండు రోజుల తరువాత రమేష్ స్వయంగా రెండు హిందీపాటలకు వరసలు కూర్చుకుని వెళ్ళి వినిపించాడు

అక్కడ రికార్డింగ్ వ్యవహారాలు చూస్తున్న శ్రీ జి ఎన్ జోషి ఆరోజున ఒక సలహా ఇచ్చారు.

"ఆయన అలా చెప్పి ఉండకపోతే, నేను ప్లేబాక్ గాయకుడుగానే కృషిచేసి ఉందును" అంటాడు రమేష్

ఉచ్చారణ ఓమోస్తరుగా ఉందికాని, రమేష్ ఆ పాటలకు పెట్టిన సంగీతం చాలా బాగుందని శ్రీ జోషి అభిప్రాయపడ్డారు. "అందుకని సంగీత దర్శకుడుగా పైకి రావడానికి ఇప్పటినుండీ కృషి చెయ్యి" అని ఆయన హితవు చెప్పారు.

ఆ తరువాత రమేష్ రోజూ అక్కడ నౌషాద్ ప్రభృతి సంగీతదర్శకులు, ఆర్కెస్ట్రా నిర్వహించే పద్ధతులూ తీరుతెన్నులూ శ్రద్ధగా పరిశీలిస్తూ వచ్చాడు

రమేష్ సంగీతం కూర్చిన రెండు పాటలను షంషాద్ బేగంకు చూపించారు చాలా బాగున్నాయనీ, వాటిని రికార్డు ఇవ్వడం తనకు ఇష్టమేననీ షంషాద్ అంది కాని అంతలోనే కథ తిరుమారైంది "హిందీ ట్యూన్‌లు అక్కర్లేదనీ, కావలిస్తే మరాఠీ పాటలకు సంగీతం ఇవ్వవచ్చుననీ రమేష్‌కు కబురందింది. అదేవేళాడు రమేష్ అతడు సంగీతం కూర్చిన ఆరు మరాఠీ గీతాలు "హిట్స్" అయ్యాయి

కొద్ది రోజుల్లోనే "ఛందవల్ పాహిజ్" అనే మహారాష్ట్ర చిత్రానికి సంగీత దర్శకుడుగా పనిచేసే అవకాశం లభించింది అందులో పాటలన్నీ బహుళ జనాదరణ పొందాయి.

దరిమిలా రమేష్ ఐదు మరాఠీ చిత్రాలకు సంగీత దర్శకత్వం నిర్వహించాడు

రమేష్‌గుప్త దర్శకత్వాన తయారైన "చేతన్" అనే హిందీ చిత్రానికి కూడా రమేష్ సంగీతం సమకూర్చాడు.

మరోకవంక ఇతర ప్రాంతాల సంగీతంలో కృషిచేశాడు. కన్నడ, గుజరాతీ. హిందీ, భాషలలో పాటలకు సంగీతం పెట్టాడు ఆ రికార్డులు బహుళ జనాదరణకు పాత్రమయ్యాయి

కొంతకాలంపాటు రమేష్, 'రేడియో సిలన్'లో కొన్ని సంగీత కార్యక్రమాలు నిర్వహించాడు

సునీల్ దత్ (బల్ రాజ్) తో అప్పట్లోనే పరిచయం కలిగింది ఈనాడు వారిద్దరూ ఆప్తమిత్రులు

1950 లో కిశోర్ సాహు "హామ్లెట్" చిత్రానికి సంగీత దర్శకత్వంకోసం పోటీ జరిగింది అందులో తనతో పోటీ చేసిన ఐదుగురికన్న మిన్న అనిపించుకొని, రమేష్ ఆ పదవి సాధించాడు

"హామ్లెట్" తో రమేష్‌కు సర్వత్రా మంచి పేరు వచ్చింది హిందుస్థాన్ చిత్రపర్ వారు నిర్మించే నాలుగు చిత్రాలకు రమేష్‌కు కాంట్రాక్టు ఇచ్చారు బి ఆర్. (ఏక్ హీ రాస్తా) చోప్రా మూడవ చిత్రానికి, దర్శక నిర్మాత వతుబ్ కొత్త చిత్రానికీ, మినర్వా మూవిటోన్ వారు నిర్మించనున్న మరో చిత్రానికి కూడా రమేష్ సంగీత దర్శకుడు.

మదరాసులో భాస్కర ప్రొడక్షన్స్ వారి నాలుగవ చిత్రానికీ, సెల్వకోటి పిక్చర్స వారి "స్వయంప్రభ" కూ రమేష్ సంగీతం కూర్చారు


"నాకు సహజంగా కర్ణాటక శాస్త్రీయ సంగీతం అంటే అభిమానం మన జానపద సంగీతం అంటే చాలా ఇష్టం" అంటారు రమేష్ నాయుడు.

ఏ పద్ధతిలో అయితే నేం, సినిమాలకి సంబంధించినంత వరకూ, సంగీతం అనేది ఆబాలగోపాలం ఆ పాట మధురంగా, మనసులో పదిసార్లు మెదలేదిగా ఉండడం అవసరం" అంటారాయన మోజుకొద్దీ చేసే చెయ్యాలితప్ప, మనకున్న సంగీతాన్ని కాదని మరో దేశంనుంచి మట్లు దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏమీ లేదని ఆయన అభిప్రాయం. అసలు మన దేశంలో ఏ ప్రాంతపు జానపద సంగీతమైనా చైతన్యవంతంగా హాయిగా, ఉత్తేజకరంగా ఉంటుందంటారు

"ఉన్న వాటన్నిటిలోకీ మన తెలుగు జానపద సంగీతం అంటే, నాక చాలా ఇష్టం నాకు ఆరు ప్రాంతాల జానపదగీతాలు వచ్చును" అన్నాడు రమేష్ సగర్వంగా.

ఇక్కడ తెలుగు చిత్రాలకు కూర్చిన పాటలు జానపద గేయచ్ఛాయలలో కొత్త బాణీలలో శ్రుతిపేయంగా ఉన్నాయి

"తెలుగుదేశం వచ్చి, తెలుగు చిత్రాలకు సంగీత దర్శకుడుగా పనిచేయాలని నా చిరవాంఛితం దర్శకుడు శ్రీ యోగానంద్, కెమెరామన్ శ్రీ ఎం ఎ రహమాన్‌లు ఈ విషయంలో నన్ను ప్రోత్సహించి, ఇది సిద్ధించడానికి దోహదంచేశారు, అన్నారు రమేష్‌నాయుడు కృతజ్ఞతా పూర్వకంగా ★



హైదరాబాదులో నెలకొనివున్న సారథీస్టూడియోలో ఒక భవనం.

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్‌వాలెస్

అరుణవలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

40 థాలియా పలాయనం

రాకేల్ విలింగ్స్‌పై జరిగిన దురంతంతో మంత్రివర్గం యావత్తూ అట్టుడికినట్లు డికి పోయింది.

పార్ పోలీసు కార్యాలయానికి వచ్చే సరికి రాగానే ఈ సంగతంతా తెలిసింది. ప్రధాన మంత్రి ఆందోళన పడడానికి తగిన కారణం లేకపోలేదు. తాము ఇకముందు ఎవరి పని ఎప్పుడు పట్టించదలచారో అరుణ వలయం వారు ప్రకటించలేదు.

ఇన్‌స్పెక్టరు పార్‌ను ప్రధానమంత్రి డౌనింగ్ స్ట్రీటుకు పిలిపించాడు. అతనితో రెండు గంటలసేపు సంభాషించాడు. పార్‌తో ప్రధానమంత్రి ఇంతకు ముందెన్నడూ మాట్లాడలేదు. ఆతరవాత మంత్రి వర్గంలో ముఖ్యులైన వారు సమావేశమై చర్చలు జరిపారు. ఈ సమావేశం సంగతి పత్రికలలో ప్రకటింపబడింది

ఈసారి ప్రధానమంత్రినే హత్యచేస్తామని అరుణవలయం బెదిరించిందని అనధికార రీత్యా బయటికి పొక్కిన వదంతిని ప్రభుత్వం ఖండించనూ లేదు, సమర్థించనూ లేదు.

ఆ రాత్రి డెరిక్ యేల్ తన బసకు రాగానే ఇన్స్పెక్టరు పార్ అక్కడ వేచి ఉన్నాడు.

"ఏమిటి విశేషం?" అని తొందరగా అడిగాడు యేల్.

"నీ సహాయం కావాలి" అని పార్ అన్నాడు. లోపల గదిలో ఇరువురూ సుఖాసీనులైన తరవాత పార్ ఇంకా ఇలా చెప్పాడు:

"నేను త్వరలో తప్పుకోవలసి వచ్చేట్లుంది. నేను అనుకున్న దానికంటే ముందే తప్పుకోమని ప్రధానమంత్రి నన్ను ఒత్తిడి చేస్తున్నాడు. మంత్రివర్గం ఒక చిన్న కమిటీని నియమించింది. ఈ కమిటీ పోలీసు శాఖ ఉపయోగిస్తున్న నేరపరిశోధన పద్ధతులన్నీ విచారణ చేస్తుందట. రేపు సాయంత్రం ప్రధానమంత్రి గృహంలో జరిగే సమావేశానికి నన్ను హాజరు కమ్మని కమీషనరు ఆజ్ఞాపించాడు."

"ఎందుకో?" యేల్ ప్రశ్నించాడు.

"నేనేదో ఉపన్యాసం లాంటిది ఇవ్వాలట. అరుణవలయాన్ని పట్టుకోడానికి నేననుసరించిన పద్ధతులన్నీ మంత్రివర్గానికి వివరించాలట నాకు అసాధారణాధికారాలు ఇవ్వబడిన సంగతి నీకు తెలుసు. నేను కనిపెట్టిన వివరాలేమీ చెప్పమని ఇంతవరకూ ప్రభుత్వం కూడా అడగలేదు. శుక్రవారం సాయంత్రం ఆ వివరాలన్నీ చెప్పేద్దామనుకుంటున్నాను. నీ సహాయం కావాలి."

"నువ్వు దానికింతగా అడగాలట్రోయ్?" అన్నాడు యేల్.

"అరుణవలయం గూర్చి ఇంకా అనేక విషయాలు నాకుఅభేద్యంగానే ఉన్నాయి. తెలిసినంత వరకూ అన్నీ గుదిగుచ్చుతున్నాననుకో. నా అనుమానం ఏమిటంటే మన పోలీసు శాఖలోనే ఎవరో అరుణవలయం మనుషులున్నారని," అన్నాడు. పార్

"నా అనుమానమూ అదే. నీకా అనుమానం ఎందుకు కలిగింది?"

"ఏం లేదు. జాక్ బియర్డుమోర్‌కి తన తండ్రి కాగితాలు వెదుకుతుండగా ఒక ఫోటో కనిపించింది. దాన్ని కవర్లో పెట్టి అతడు నాకు పంపించాడు. కవరు చేరింది గాని అందులో ఫోటో మాత్రం మాయమైంది. దాన్ని పోస్టు చెయ్యమని థాలియాకిచ్చాడట. ఆమె దాన్ని పోస్టుబాక్సులో వెయ్యడం తను కళ్ళారా చూశానని జాక్ చెబుతున్నాడు. అందుచేత కవరు పోలీసు కార్యాలయానికి చేరిన తరవాతనే ఎవరో దాన్ని తెరిచి ఉండాలి," అని పార్ చెప్పాడు.

"ఏం ఫోటో అది?" అని యేల్ ఆత్రుతగా అడిగాడు.

"ఏదో ఉరి శిక్షకు సంబంధించిన ఫోటో గాని, లైట్‌మన్ ఫోటో గాని అయి ఉండాలి. లైట్‌మన్‌ను ఉరితీయబోయి మానేసిన సందర్భంలో తీసిన ఫోటో అనుకుంటాను. చనిపోయిన బియర్డుమోర్‌కు చనిపోక ముందుగోజున అది వచ్చిందట అది జాక్ చేతులో పడిందట. దాన్ని పంపింది—"

"థాలియాడ్రమండ్ అన్న మాట. నా ఉద్దేశంలో పోలీసు శాఖలో వారిని అనుమానించడం ముఖ్యం కాదు. ఈ థాలియాడ్రమండ్‌కు అరుణవలయంతో సంబంధం ఉన్నదనుకున్న దాని కంటె సన్నిహితమని నా ఉద్దేశం. రాత్రి ఆమె ఇంటిని సోదా చేశాను. ఇదిగో నాకు కనిపించింది ఇది"

యేల్ అవతల హాలులోకి వెళ్ళి ఒక పార్సిలు తీసుకొచ్చి విప్పాడు. పార్సిలులో ఒక గ్లోవ్, పొడుగాటి బాకు కనిపించాయి.

"ఈ గ్లోవ్ ఆ రోజున ఫ్రాయంట్ శవం దగ్గిర కనిపించిన గ్లోవ్ తాలూకు జత. ఈ బాకు కూడా ఫ్రాయంట్‌ను పొడిచిన బాకు లాంటిదే", అన్నాడు యేల్.

ఆ గ్లోవ్‌ను తీసుకుని పార్ పరీక్షించాడు.

"అవును. ఇది ఎడమ చేతి గ్లోవ్. ఫ్రాయంట్ శవం వద్ద కనిపించినది కుడి చేతిది. ఇది ఎవరిదై ఉంటుంది, నీ అసాధారణ మేధాశక్తి ఉపయోగించి కనిపెట్టు" అని పార్ యేల్‌ను అడిగాడు.

"ఇదివరకే ప్రయత్నించాను. కాని ఈ గ్లోవ్‌ను ఎందరో తాకి ఉండడం వల్ల నాకు సరైన స్ఫూర్తిని ఘ్రాతి కలగడం లేదు. ఏమైనా, ఈ వస్తువులు థాలియా ఇంట్లో కనిపించడంవల్ల ఆమెకు హత్యతో సంబంధం ఉందనే సంగతి తెలుస్తోంది. ఇక నువ్వెం దాక అడిగిన సహాయం ఉందే, నేను హృదయపూర్వకంగా నీకే సహాయం కావలసినా చేస్తాను."

"నాకు కావలసిన సహాయమల్లా, నా పరిశోధనలో పూర్తి చెయ్యలేక పోయిన ఖాళీలు నువ్వు పూర్తిచెయ్యాలి మా అమ్మ కూడా ఆ టేముకి అక్కడ ఉంటే బాగుండేది"

"మీ అమ్మా!" అని యేల్ విస్మితుడయ్యాడు.

"అంటే మా నాయనమ్మ. ఇంగ్లండులో నిన్నూ, నన్నూ తప్పించి అంతమంచి డిటెక్టివ్ ఎవరూ లేరు."

పార్ హాస్యంగా కూడా మాట్లాడగలడని డెరిక్ యేల్‌కు మొదటిసారిగా తెలిసింది.

ఎవరినోట చూచినా అరుణవలయం ప్రసక్తే. అన్నిటికంటే డెరిక్ యేల్‌కు ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఆ మర్నాడు ఉదయం పత్రికలలో ప్రచురిత మైన ఒక వార్త...థాలియా గ్రేహమ్ జైలు నుంచి తప్పించుకుంది!

కథలలోనూ, నవలలోనూ ఖైదీలు తప్పించుకు పోవడం ఉంది. కాని హోలోవే జైలు నుంచి ఒక స్త్రీ తప్పించుకుపోవడం ఇదే మొదటిసారి.

తెల్లారి థాలియా ఉన్న గది చూస్తే ఖాళీగా ఉంది, ఖైదీ తప్పించుకుపోయింది.

సాధారణంగా భూకంపం వచ్చినా చలించని వ్యక్తి డెరిక్ యేల్. అటువంటి వాడు ఈ వార్త చదివి దిగ్భ్రాంతి పొందాడు. జాగ్రత్తగా ప్రతిమాటా చదివాడు. అయినా చివరికి మిగిలింది దిగ్భ్రాంతే. ఏమీ అర్థం కాలేదు.

ఆ వార్త అబద్ధమనడానికి వీల్లేదు. అధికారులు ఒప్పుకున్నారు. ప్రభుత్వమే స్వయంగా ఏ కారణంవల్లనో అంత తొందరగా ఆ వార్తను ఉదయం పత్రికలకు అందజేసింది.

"ఖైదీ చాలా ముఖ్యమైన వ్యక్తి కావడం వల్లనూ, ఆమెమీద మోపబడిన అభియోగం చాలా దారుణమైనది కావడంవల్లనూ ఆమెను కాపలా కాయడానికి గట్టి బందోబస్తే చేయబడింది. గస్తీదళాన్ని రెండింతలు చేశారు. గంట గంటకి బదులు అధికారులు అరగంట అరగంటకీ ఆమె గది సమీపంలో తిరిగారు. మామూలుగా ఖైదీల గదుల్లోకి తొంగిచూడరు. కాని ఈ వేళ తెల్లవారుఝామున కాపలా ఉండే స్త్రీ మూడుగంటల వేళ ఆ గదిలోకి తొంగిచూసింది. ఖైదీ అప్పటికక్కడే ఉంది. ఆరుగంటల వేళ తలుపులు తెరిస్తే ఖైదీ కనిపించలేదు. తలుపులు బద్దలుగొట్టిన జాడకూడా లేదు.

జైలు పరిసరాలన్నీ జాగ్రత్తగా పరిశీలించారు. ఆమె అడుగుజాడలు కూడా కనబడ లేదు. గోడదూకి పారిపోవడం అసంభవం. మామూలుగానే వెళ్ళిపోవడంకూడా అసంభవం. ఎందుకంటే అలా వెళ్ళడానికి ఆరు ద్వారాలు దాటాలి. కాని ఏ ఒక్క ద్వారమూ బద్దలు గొట్టబడలేదు. దర్వాన్ ఉండే ఇంట్లోంచి వెళ్ళే వీలుకూడా లేదు. రాత్రంతా దర్వాన్ అక్కడే ఉన్నాడు.

అరుణవలయం శక్తిసామర్థ్యాలకు ఇది కొత్త ఉదాహరణ. ఇది ఆశ్చర్యకర సంఘటన. మంత్రివర్గ సభ్యుల ప్రాణాలకే ముప్పు వాటిల్లనున్న ఈ సమయంలో ఇది జరగడం మరీ దారుణంగా ఉంది," ఇది ప్రకటన పాఠం.

యేల్ గడియారంవంక చూశాడు. పది కొండున్నర అయింది, అతను తొందరగా లేచి ఉదయ భోజనం చేయకుండానే పోలీసు కార్యాలయానికి వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ పార్ అటువంటి విషమ పరిస్థితిలో కూడా ఉత్సాహంగానే కనిపించాడు.

"పార్! ఇది అసంభవం నమ్మలేకుండా ఉన్నాను. జైలులో ఆమె కెవరన్నా స్నేహితు లున్నారేమో?"

"నేనూ అదే అనుకుంటున్నాను. జైలులో ఆమె కెవరో స్నేహితు లున్నారని నేను కమీషనరుతో ఇందాకే చెప్పాను. లేకపోతే ఆమె ఎలా పారిపోయింది?"

యేల్ పార్ వంక అనుమానంగా చూశాడు. వేళాపాళా లేకుండా వేళాకోళమాడడం బాగా లేదనుకున్నాడు యేల్. నిజానికి పార్ ధోరణి అంతా వేళాకోళంగానే ఉంది.



41. అరుణవలయం ఎవరు?

పత్రికలలో చదివిన దానికంటె కొత్తగా యేల్‌కు తెలియలేదు. టాక్సీ తీసుకొని నగరంలో ఉన్న తన కార్యాలయానికి వెళ్ళాడు. అక్కడ కతను వెళ్ళి రెండు రోజులైంది.

థాలియా పలాయనం పార్ దృష్టిలో అంత ముఖ్యమైనదిగా కనిపించక పోవడం అతని కాశ్చర్యం కలిగించింది. పార్! హఠాత్తుగా యేల్‌కు ఒక ఆలోచన వచ్చింది. జాన్ పార్! ఆ బండశరీరం, ఆ బండ ముఖం, అంతకంటే బండ మెదడు—అతడా? అసంభవం! పార్‌తో సంబంధం ఉన్న ప్రతి సంఘటననూ, సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొని అన్నీ గుదిగుచ్చి ఆలోచించాడు. చివరికి:

(55-వ పేజీ చూడండి)

వనితాలోకం

పెనిమిటి ప్రతిభా విశేషాలు

ఆ వాడలో హైమవతిని చూసి నవ్వని వారుండరు. దానికి కారణము కనబడిన వారందరితోటీ తన పెనిమిటిని గురించి అప్రస్తుతముగా ఆమె ప్రసంగింటటమే. ఆ చెప్పటములో కూడా ఆయన గొప్పతనాన్ని గురించీ ప్రతిభా విశేషాలను గురించీ విపరీతమైన వరనలు చేస్తుంది. తన సంభాషణలో ఏమైనా సందర్భమూ, వాస్తవికతా ఉన్నాయా అన్న సందేహము ఇతరులకు కలగదన్న విశ్వాసముతో మాట్లాడుతుంది. తోటి వారంతా చాటున నవ్వుకొని ఆమెను హేళనచేస్తూ ఉంటారు.

“పూజ కొద్దీ పురుషుడు, పుణ్యం కొద్దీ బిడ్డలు” అంటారు పెద్దలు. తన అదృష్టాన్ని తోటి వారితో చెప్పి, ఔననిపించుకొని, ఆనందిస్తేగాని స్త్రీలకు తృప్తిగా ఉండదు. ప్రతి స్త్రీకి తన పెనిమిటిని గురించి గొప్ప భావము ఉంటుంది. అతడు గొప్ప మేధావనీ పండితుడనీ, పరాక్రమము కలవాడనీ, ప్రయోజకుడనీ విశ్వసిస్తుంది; విశ్వసించి పూజిస్తుంది; ఆరాధిస్తుంది. అంతటితో తృప్తి లేక పదిమందితో చెప్పుకొని మురుస్తుంది. ఇది స్త్రీల సహజ లక్షణము. ఈ లక్షణము కొందరిలో ముఖముమీదనే కనబడుతుంది, కొందరిలో అంతర్గతమయి ఉండి అప్పుడప్పుడు పైకి పొంగుతుంది.

వాస్తవముగా స్త్రీకి-ఆమె దృష్టిలో-ప్రపంచములో ఉన్న మేధస్సూ, పరాక్రమమూ, అందమూ, తెలివీ అంతా కలిసి ముద్దకట్టిన మూర్తి తనకు భర్త కావాలన్న కోరిక ఉంటుంది. అటువంటి వాడికే ఆత్మార్పణ చేయాలన్న సంకల్పము కలుగుతుంది. ఈ భావాన్నే బమ్మెర పోతన్న

ఇల్లిందల సరస్వతీదేవి

గారు “ధన్యున్ లోక మనోభిరాముకుల విద్యారూప తారుణ్య సౌజన్య శ్రీ బలదాన శౌర్య కరుణా సంశోభితు”డయిన శ్రీకృష్ణుని ఏ కన్యలు కోరరు?” అని కన్యా హృదయాన్ని వ్యక్తీకరించారు. ప్రతి కన్యా తన ఆశలూ ఆశయాలూ ఫలించాలని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటుంది. ఆమె మనోరథాలు రూపొందేనాటికి కన్యాహృదయము నవ్యనవనీత సమానముగా ఉంటుంది. తన మనోరథమీడేరి తానాశించిన లక్షణాలు నూటికి నూరుపాళ్లు తన పెనిమిటిలో ఉన్నాయని విశ్వసించి ఆనందించటము వారికి సహజము.

కాని లోకములో స్త్రీలందరూ అంతటి అదృష్టవంతురాండ్రా? అయినా పూజకొద్దీ దొరికిన పురుషుడిలో తానాశించిన గుణాలలో ఏ కొన్ని లోపించినా కొందరు చింత పడరు. వారి సంతోషానికి వెలితి ఉండదు. ఆ ఉల్లాసములో లోకమంతా ఆనందమయముగా కనుపిస్తుంది. జీవితమంతా మధుమాస

ముగా తోస్తుంది. కొంతమంది స్త్రీలు కొత్తవారికి వచ్చిన క్రొత్తలో-మొదటి మెచ్చుకోళ్ళలో మునిగి భర్తలను గురించి అతిగా శ్లాఘించుతూ ఉంటారు. ఆయన ఇలా అనుకోగానే అలా చేసేస్తారు. 'ఆయన ఏ వస్తువయినా తీసుకురాటము అది బాగుండక పోవటమూనా!' అంటూ ఇంట్లోనే అనుకొండి. ఆడబడుచుల దగ్గర, తోటి కోడళ్ల దగ్గర, కన్నవారిదగ్గర ప్రారంభిస్తారు. వీరిలో చాలామందికి తోటివారు నవ్వి హేళన చేయగానే ఈ ధోరణి కొంత తగ్గుతుంది. కాని కొంత మందికి తగదు. ఈ ధోరణి ఇంటివారి దగ్గరమాత్రమే కాక బయటికి కూడా వ్యాపిస్తుంది. అందులోనూ నిత్యమూ ఎదురుగా ఉండి చూసేవారితోకంటే క్రొత్తవారి ఎదుట సరికొత్త బాణీలో సాగిపోతుంది. ఆయన శౌర్యాన్నీ, పరాక్రమాన్నీ, ప్రతిభనే కాకుండా ఆయనకు తనమీదఉన్న అనన్య సామాన్యమయిన ప్రేమను కూడా వ్యక్తపరుస్తుంది. ఆ వ్యక్తపరచటములో 'చక్కని దానవంచు, నెఱజవ్వనివంచు, జగంబులోన చేరెక్కినదానవంచు, బతిమాలితియు నా కనురక్తుడంచు' అన్న అంశాలను నొక్కి నొక్కి వినిపిస్తారు.

లోకములో స్త్రీలందరి మనస్తత్వమూ ఒకమాదిరిగా ఉండదుగా! కొందరికి భర్తలను గురించిన అభిప్రాయాలు ఎంత కాలమయినా మారవు. లోకమంతా కోడై కూసినా వారు చలించరు. ఆస్తి అంతా హరించుకుని పోయినా, సంసారమంతా అమ్ముడుపోయినా పెనిమిటి ప్రతిభ రచ్చ కెక్కినా వారి మనస్సు మారదు - "మా వారు అటువంటివారు కారే. ఆయన ఎప్పుడూ అటువంటి పనులు చేయరే! అందరివలె ఆయన సైచ్యానికి ఒడంబడరే! ఆయన అంత తెలివితక్కువ వారు కారే!" అంటూ భర్తలమీద అమితమైన విశ్వాసాన్ని కలిగి ఉంటారు. వారి జీవితమంతా భ్రమలోనే గడిచిపోతుంది.

కాని—కొందరు స్త్రీలు భ్రమపడలేరు. పెనిమిటితో పరిచయమైన కొంత కాలానికి వాళ్లు సామర్థ్యాన్ని గ్రహించ గలుగుతారు. ఆయన ధైర్య స్థైర్యము కలవాడని భ్రమించిన స్త్రీకి అతడు పిరికివాడనీ, గొప్ప మేధావనుకొన్న స్త్రీకి అతడు వట్టి తెలివి తక్కువ వాడని తేలగానే ఆదిలో కలిగిన సంతృప్తి కాస్తా తుడిచినట్టు మాయమవుతుంది.

ఏదో అసాధారణమైన పనిచేసి తన మనసును రంజింప చేస్తాడని ఆశించిన భార్యకు నైరాశ్యములో మునిగితేలే పెనిమిటిచేష్టలు అసంతృప్తిని కలిగిస్తాయి. ఈ అసంతృప్తిని కొందరు గడుసుతనముగా కప్పిపుచ్చుకుంటారు కాని—కొందరికి ఆ సంతృప్తి మనసులో అణచుకొనటానికి సాధ్యపడదు. ఈ సందర్భములో చేతనము కలవారు ముడిమాటలతో "ఆయన వట్టి పనికిమాలిన వాడు" అనటము కూడా లోక సహజమే. కాని నిజ పరిస్థితులను కొందరు గంభీర హృదయులు బైట పెట్టలేరు. వాటిని బయట పెట్టటానికి పరిస్థితులు కొందరికి అనుకూలించవు. వాటిని వ్యక్తపరచినట్లు తెలియగానే, తననుగురించి అసంతోష కరముగా భార్య ప్రసంగించిందని తెలియగానే కొందరు భర్తలు దండనకు సిద్ధపడతారు. దుష్పరిణామము ఉంటుందని అందరి మనసూ ఊరుకోలేదు. మనసులో ఊటలూరుతున్న అసంతృప్తి అంతటితో అంతరించలేదు. కనుక ఎవరు విన్నా ఆక్షేపణ లేని పూత పూసి తమ అసంతృప్తిని వెళ్ళగక్కుతారు. కొందరు స్త్రీలు 'వారు చాలా సత్యసంధులు.' 'వారి పనికి వంక ఉన్నదా?' వారి సంపాదన చూశారా! ఈనగలన్నీ వారు చేయించి పెట్టినవే' ఈ ధోరణిలో చెణుకులు విసురుతూ ఉంటారు. ఆ వాక్యాలు ఆలంకారికులు వ్యంగ్య సూచకముని ఉదహరించటానికి అనువుగా ఉంటాయి.

నిత్య జీవితములో సాంసారికముగా పనులు జరిగిపోవటానికి భార్యాభర్తలు వారి వారి బాధ్యతలు నిర్వర్తించుకోవలసి ఉంటుంది. బాధ్యతలను ఎవరివి వారు సక్రమముగా నిర్వర్తించుకొంటే పనులుకూడా సత్ఫలితాల నిచ్చేవిగా ఉంటాయి. సాంసారికమయిన బాధ్యతలను నిర్వహించటములో ఒకరు వెనుకముందయినా రెండవవారు కుటుంబాభ్యుదయ దృష్ట్యా వాటిని నిర్వర్తించటములో దోషము లేదు. గొప్పతనమంతకంటె లేదు. కాని కొందరి హృదయాలు చేమంతిపని చేయగానే ఏదో ఘనకార్యము చేసినట్టుగా 'ఇంట్లో అన్ని పనులూ నేనే చూసుకోవాలి, ఆయనేమీ అంటించుకోరు. నేనొక్కదాన్నీ ఇంత సంసారాన్ని నిర్వహించుకొని వస్తున్నాను. నేను కల్పించుకొన్నాను కనుక ఇంటిమాత్రము ఇలునిలబడ్డది. ఇంకొకరయితే ఎక్కడివక్కడ విడిచిపెట్టే వారే! సంసారమంతా తింతేరాగా ఉండేది." అని చెప్పుకొంటారు, బయటపడిపోతారు.

ఈ రకాలలో అన్నిటికంటె దిగువరకము భర్తలు కేవలము జడులని నిరూపించబోవటము. నీలాటి రేవున చేరిన నారీగణములో ఒకపడుచు 'మావారెంత పండితుడనుకొన్నావు? ఇతరులకు తెలియకుండా వ్రాస్తాడని' తోటిపడుచుతో చెప్పబోయిందట. అతరుణి వెంటనే "ఓస్! ఇంతేనా మీ వారి గొప్ప! మీవారు తనకు తెలిసేటట్లయినా వ్రాస్తారు. మావారు చాలా గొప్ప పండితులు వ్రాసిన దానిని తానుకూడా చదువలేకుండా వ్రాస్తారు' అని సమాధానమిచ్చిందట.

ఈ విధముగా భర్తలను గురించి చెప్పుకోవటములోనూ, ప్రగల్భాలు కొట్టటములోనూ చీత్కారాలు చేయటములోను ప్రావీణ్యముగల స్త్రీలు ప్రాచీనులలోనే కాదు ఆధునికులలోనూ ఉన్నారు. సంస్కారమెరుగని గ్రామీణులలోనే కాదు, నాగరికత బలిసిన పట్టణాలలో కూడా ఉన్నారు. అవిద్యావంతులలో కాకుండా విద్యావంతులలో కూడా ఉన్నారు.

ఈ జగమంతా రామమయమన్నట్లుగా హృదయమంతా ఆవరించుకొని పోయిన భర్తలను గురించి ఘనముగా గాని, హేళనముగా గాని, వ్యంగ్యముగాగాని, తృణీకార భావముతో గాని ఇతరులతో చెప్పకుండా ప్రసంగించటము కష్టమయిన పనే. కాని అందులోనే ప్రౌఢిమ ఉన్నది. విందు తనములోనే నేర్పు ఉన్నది. ★

బాల సాహితి

శాద్వలాంకురమ!


'సరోజిని'

★

తళా తళా మెరిసేటి
ఓ శాద్వలాంకురమ!
తొలి సంజలో వెలుగు
మలి సంజలో సొగసు
నీకోస తారిందిలే.
నన్నెంతో
కదిలించి గెంతిందిలే.

గరిక కన్నెల మధ్య
ధగధగా వెలిగేటి
ఓ శాద్వలాంకురమ!
వలపు సౌలపుల బరువు
విరుల సొగసుల సుఖవు
నీకోస విరిసిందిలే,
నన్నెంతొ
సమ్మోహ పరచిందిలే.

మసిమసక సంజలో
మాటుమణిగెను పగలు
మలయానిలమ్మేదో
మాటిమాటికి పిలచు
మిలమిలా మెరసేటి
ఓ శాద్వలాంకురమ!
నీ రూపు నీ సొగసు
చూశానులే
ఆనందరసవార్ధిలో
మునిగానులే.



జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేస్తే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది అమెరికా ప్రభుత్వం అబ్రహాంలింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొన వలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతీరం గాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్లవర్షం కురిపించారు అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు తిరిగీ తమ కన్నపానాలు రాలేదని అంతా మథన పడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టెన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరుచు కున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. తరవాత సాగరగర్భంలో క్రెస్పోద్వీపంలో వేట జరుగుతుంది జలాంతర్గామి వానికొరో ద్వీపంమీదుగావెళ్లి గిలోల్చవాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు ముగ్గురు గిలోల్చవాద్వీపంలో వేట ముగించుకొనివస్తూండగా హఠాత్తుగా ఒకరాయి వారిదగర పడుతుంది. పిమ్మట కెప్టెన్ నీమో వజ్రాయుధంతో ఆటవికుల నందరినీ హడలగొట్టి వేస్తాడు క్రమంగా జలాంతర్గామి పగడాలదీవి చేరుకుంటుంది. చనిపోయిన నావికునికొకనికి అక్కడ సమాధి ఏర్పాటుచేస్తారు.

22

కోటిఫ్రాంకులు ఖరీదుచేసే ముత్యం

అనువాదం: "వినాయక"

తరవాత మా జలాంతర్గామి చాలా తొందరగా ప్రయాణం చేసి క్రమక్రమంగా హిందూ మహాసముద్రంవైపు నడిచిపోయింది. ఇంకా కొన్నాళ్లయ్యేసరికి హిందూ మహాసముద్రంలో ప్రవేశించింది.

తరవాత మా ఓడ సింహళం చేరుకొన్నా ఇంకా మన్నారు శాఖలో ప్రవేశించలేదు అక్కడికి చేరుకొనేసరికి మా పరిసరాలన్నీ అత్యద్భుతంగా మారిపోయినట్లనిపించింది.

అంతలో కెప్టెన్ నీమో నాదగ్గరకు వచ్చాడు:

"ప్రొఫెసర్! మీరు వెంటనే

బయలుదేరుతున్నారా లేదా?" అన్నాడు.

"నేను సిద్ధంగానే ఉన్నాను."

"అయితే వెంటనే నాతో బయలుదేరండి!"

"మరి నా అనుచరులమాట?"

"వాళ్లప్పుడే దుస్తులు అన్నీ వేసుకొని తయారుగా ఉన్నారు."

"ఓహో! మేమంతా సాగర గర్భంలో ప్రవేశించే దుస్తులు వేసుకోవాలా?"

"ఇంకా అంత తొందరపడవలసిన అవసరం రాలేదు. మనం ఇంకా మన్నారుతీరంచేరుకోలేదు. ఈలోగా మనం అక్కడికి వెళ్లడానికివీలుగా ఒక చిన్ననావ సిద్ధం చేసి పెట్టమని నావికుల కొక ఫర్మానా జారీచెయ్యడం జరిగిపోయింది. దానిమూలంగా మనకు అనవసరమైన శ్రమఉండదు."

వెంటనే నేను నాటిలస్ టాపు మీదికి వెళ్లిపోయాను. నెడ్ లాండ్ కాన్సెలు లిద్దరు అక్కడే ఉన్నారు. మన్నారుతీరం వ్యవహారం వారితో చెప్పగానే వాళ్లిద్దరు దానికెంతో సంతోషించారు. సింహళద్వీప సమీపంలో ఉన్న మన్నారు సింధుశాఖ ముత్యాల పరిశ్రమకు బాగా ప్రసిద్ధి పొందింది. అక్కడ బెస్తలు కొంతమంది చాలా చాకచక్యంతో సముద్ర గర్భంలో ప్రవేశించి ముత్యపుచిప్పలు సేకరిస్తూంటారు. వాళ్ల సేకరణ చాలా సాహసంతో కూడిన వ్యవహారం. అది చూడాలని మేమంతా చాలా ఉబలాటపడ్డాము.

క్రమక్రమంగా మా జలాంతర్గామి సింహళ తీరానికి చేరుకుంది. కెప్టెన్ నీమో, నెడ్ లాండు, నేను, ఒక చిన్ననావలో కూర్చుని మన్నారుతీరానికి బయలుదేరాము

మేము మా తీరానికి చేరుకొనేసరికి క్రమక్రమంగా సూర్యోదయం అయింది. వెంటనే వెలుతురు నాలుగువైపులా వ్యాపించింది. తరవాత మేమంతా నీటిలో మునగడానికి వీలైన దుస్తులు వేసుకొన్నాము. చిన్ననావకు అక్కడే లంగరు వేశారు. నావికులెవరూ మాతో రాలేదు. వాళ్లంతా ఆ నావలోనే ఉండిపోయారు. తరవాత 7 గంటలయ్యేసరికి మేమంతా మన్నారు తీరానికి చేరుకొన్నాము. ఎందుకైనా మంచిదని మాతో బాటు బాకులుకూడా తీసుకుని పోయాము. ముత్యపు చిప్పలు సముద్ర గర్భంలో రాళ్లకంటి పెట్టుకునిఉంటాయి. ముత్యాల చేపలవల్ల ఈ ముత్యపుచిప్ప లేర్పడతాయి.

మేమంతా దుస్తుల సహాయంతో తేలికగానే సాగరగర్భంలో ప్రవేశించాము. నెడ్ లాండ్ కొన్ని ముత్యపు చిప్పలేరి తన సంచీలో వేసుకోవాలని అనుకొన్నాడుగాని కెప్టెన్ నిమో తొందరగా తనతో రావలసిందని పిలవడంవల్ల వెంటనే అతనితో కలిసి వెళ్లక తప్పలేదు.

తరవాత మేమంతా సాగర గర్భంలో ఇంకా లోతుగా దిగిపోయాము అలాగ ఇంకా కొంత దూరం వెళ్లేసరికి మాకొక గుహ లాంటిది కనిపించింది. కెప్టెన్ నిమో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆ గుహలోకి వెళ్లాడు. మేము కూడా అతని వెనకాలే నడిచి వెళ్లాము.

కెప్టెన్ నీమో హఠాత్తుగా ఒక పెద్ద ముత్యపు చిప్పదగ్గర ఆగిపోయాడు. కెప్టెన్ నిమో సునాయాసంగా అక్కడికి చేరుకోవడాన్ని బట్టీ, ఆ ముత్యపుచిప్ప తేలికగా గుర్తుపట్టడాన్ని బట్టీ నేనది చాలాకాలంగా అతని పర్యవేక్షణలో ఉన్నదని అనుకొన్నాను.


అతడు నెమ్మదిగా ఆ ముత్యపు చిప్పదగ్గరకువెళ్లి బాకుతో దాని చుట్టూ ఉన్నవన్నీ విదగొట్టివేశాడు. వెంటనే మాకొక పెద్ద కోడిగుడ్డంత ముత్యం ప్రత్యక్షమైంది. దాని ధాళధళ్యంచూడగానే అంతటి అమూల్యమైన ముత్యం మరింక ఎక్కడా దొరకదని అనిపించింది. ఎంత తక్కువగా లెక్కకట్టినా అది కోటిఫ్రాంకులైనా ఖరీదు చేస్తుందని అనుకొన్నాను. కెప్టెన్ సంపాదించిన ముత్యాలలో అంతపెద్ద ముత్యం వేరొకటి ఏదీ లేదు. ఆ ముత్యం తనకవచంలో ఒక చోట జాగ్రత్తచెయ్యగానే కెప్టెన్ నిమో నెమ్మదిగా ఆగుహ విడిచిపెట్టి ఇవతలకు వచ్చివేశాడు. మేమంతా అతణ్ణి అనుసరించాము.

తరవాత మేమంతా మెల్లి మెల్లిగా అడుగులు వేసుకుంటూ నడక సాగించాము.

తరవాత కెప్టెన్ నిమో హఠాత్తుగా మావైపు తిరిగి ఆగిపోవలసిందని సంజ్ఞ చేశాడు. మేమంతా అక్కడే ఆగిపోయి ముందేమి జరగనున్నదో అనే తహతహతో నాలుగువైపులా పరిశీలించాము.

అంతలో మా కనతి దూరంలో నీడలాంటి దేదో కనిపించింది. ఏదో పెద్ద సొరచేప అయి ఉంటుందని అనుకున్నాను. కాని పొరపాటు పడ్డాను. అది సొరచేపకాదు.

అది మనిషి! నిండు ప్రాణాలతో కదులుతున్న మనిషి. పాపం ఎవరో



స్నానం

—ఫొటో: ఆర్. సుబ్రహ్మణ్యం

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

సింహళ దేశీయుడు. చాలా బీద వాడిలా కనిపించాడు. ముత్యపుచిప్ప లేరుకోడానికే ఆ విధంగా మునిగి ఉండాలి. అతడు తన శరీరానికొక పెద్దరాయి వేలాడుగట్టుకున్నాడు. దానిసాయంతో లోపలికి దిగి ముత్యపుచిప్ప లేరుతున్నాడు. అతడలాగ అప్పుడే నాలుగైదు సారులు లోపలికి మునిగి చాలా ముత్యపు చిప్పలు జాగ్రత్త చేశాడు.

అయితే అతడు మమ్మల్ని ఎవరినీ చూసినట్టు లేదు.

నేను కనురెప్పపాటు లేకుండా అతనికేసి చూశాను. చాలా సేపటి వరకు అతని కేవిధమయిన అపాయము కలగలేదు అరనిమిషంలో నీటిలో మునిగి కొన్ని ముత్యాలు చేత దొరకబుచ్చుకొని మళ్ళీ పైకి వచ్చేస్తున్నాడు. అలాగ ఆ వ్యవహారం అంతా ఒక అరగంటసేపు సాగింది.

అంతలో అతని ముఖంలో పెద్ద కంగారు బయలుదేరింది. మనిషి ఎందుచేతనో గజగజ వణికిపోయాడు. అతని కెదురుగా ఒక పెద్ద సొరచేప నోరు తెరుచుకొని మింగడానికి సిద్ధంగా ఉంది. ఉత్తర క్షణంలోనే అది అతనిమీద విరుచుకు పడింది. చేప అతణ్ణి మింగివేసిందనే అనుకొన్నాను గాని అతడెలాగో తప్పించుకొన్నాడు. కాని అతనికి సొరచేప తోక దెబ్బ మాత్రం తప్పలేదు!

ఆ దెబ్బతో బెస్తవాడు చావు చుట్టగా నేలమీద పడిపోయాడు.

అంతలోనే ఆ సొరచేప మళ్ళీ అతణ్ణి మింగివెయ్యాలని ఉరకలు వేసుకుంటూ వచ్చింది. అది తన వాడి కోరలతో అతగాణ్ణి రెండు ముక్కలుగా చీల్చివేసేదే!

కాని కెప్టెన్ నీమో అది కనిపెట్టి సొరచేప మీద కురికాడు. సొరచేప నీమోను చూడగానే ముందుగా అతనిమీదికి లంఘించింది. నీమో దానిదెబ్బ తప్పించుకొని బాకుతో శక్తికొద్దీ దానిపొట్టలో పొడిచాడు.

ఆ వెంటనే ఆ ప్రాంతం అంతా రక్తమయమైపోయింది! కాని కెప్టెన్ నీమో అంతటితో వదిలిపెట్టలేదు.

ఇంకా శక్తికొద్దీ దాని ఒంటినిండా బాకుపోటులు పొడిచాడు. సొరచేప ఆ పోటులతో గిలగిలా తన్నుకోవడం మొదలు పెట్టింది. అది అటు, ఇటు కొట్టుకోవడంతో ఆ ప్రాంతంలో అంతటా పెద్ద ప్రవాహాలు లేచాయి. నేనా ప్రవాహాలలో పడి కొట్టుకు పోవలసిందే గాని ఎంతో కష్టంతో వాటితాకిడి తట్టుకొని అక్కడే నిలుచున్నాను.

నేను నాశాయశక్తులా కెప్టెన్ నీమోకు సాయపడాలని అనుకొన్నాను గాని, భయంవల్ల ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. నాలో నేనే హడిలిపోతూ అలాగే నిలుచుండిపోయాను. అన్ని బాకుపోటులు తిన్నా సొరచేప అమాంతంగా నోరు తెరిచి కెప్టెన్ నీమోమీదికి దూకింది. ఆ దెబ్బతో కెప్టెన్ పని అయిపోయిందనే అనుకున్నాను.

అంతలో నెడ్‌లాండ్ బల్లెంతో సొరచేప కడుపులో ఒక్క పోటు పొడిచాడు. అది గిలగిలా తన్నుకుని చచ్చిపోయింది.

తరవాత కెప్టెన్ నీమో ఆ బెస్తవాడి దగ్గిరికి వెళ్లి అతని నడుంమీది ముడి విప్పివేశాడు. దానితోనే బెస్తవాడొక రాయి వేళ్లాడుగట్టుకున్నాడు. కెప్టెన్ నీమో ఆ బెస్తవాడి జబ్బ చేత్తో దొరకబుచ్చుకొని వెంటనే వాణ్ణి సముద్రం మీదికి తీసుకువచ్చేశాడు. తరవాత అతగాణ్ణి నెమ్మదిగా అతని నావలో ప్రవేశపెట్టాడు. దానితో బెస్తవాడు ప్రాణాపాయం తప్పించుకొని బైటపడ్డాడు.

బెస్తవాడు కొంత సేపటికి నెమ్మదిగా కళ్లు తెరిచాడు పాపం! వాడు మా నలుగుర్నీ చూసి ఏమనుకొన్నాడో! కొంత సేపటివరకు అలాగే ఆశ్చర్యపోతూ నిలబడ్డాడు.

కెప్టెన్ నీమో కతని పరిస్థితి చూస్తే ఎంతో జాలివేసింది! తన జేబులో ఉన్న సంచితీసి అతని చేతికిచ్చాడు. ఆ సంచీనిండా అమూల్యమైన చిన్న ముత్యాలెన్నో ఉన్నాయి. బెస్తవాడా ముత్యాలమూట ఎంతో ఆప్యాయంగా కళ్ళకద్దుకొన్నాడు.

దేవత లెవరైనా వచ్చి తనకా మూట అందించారేమో అని అతడా క్షణంలో అనుకొన్నాడేమో! ఎవరు చెప్పగలరు ?

తరవాత బెస్తవాడు కెప్టెన్ నీమోదగ్గిర సవినయంగా సెలవు తీసుకుని తన యింటికి వెళ్ళిపోయాడు.

కెప్టెన్ నీమో మొట్టమొదటగా నెడ్‌లాండ్‌కు తన కృతజ్ఞత తెలియజేశాడు.


మేమంతా నెమ్మదిగా నాటిలస్ జలాంతర్గామి దగ్గరికి వెళ్లిపోయాము.

కెప్టెన్ నీమో ఔదార్యంచూచి నేనెంతైనా ఆశ్చర్యపోయాను. అతనికి మాలవుంటే వల్లమాలిన ద్వేషమని అనుకుంటూ ఉండేవాణ్ణి.

కెప్టెన్ నిమో ఆ బెస్తవాణ్ణి సంరక్షించడానికి తన ప్రాణాలైనా లెక్కపెట్టలేదు.

నేనా విషయం అతనితో ప్రస్తావించి అతని ఔదార్య సాహసాలు మెచ్చుకొన్నాను. కాని కెప్టెన్ నీమో ఒక్క చిరునవ్వు నవ్వి నాతో ఇలాగన్నాడు: "సింహళదేశం పరాయిపాలనలో పడి సతమతమవుతున్న దేశం! అందువల్లనే ఆ బెస్తవాణ్ణిచూస్తే నాకంతటి జాలి వేసింది. నేను అలాంటివాణ్ణే!"

—ఇంకా ఉంది.



దేవగఢ్ రాజుగారిదగ్గరమంత్రిగా వుంటున్న సర్దార్ సుజాను సింగుకు ముసలితనం మీదపడడంతో భగవంతుడుగుర్తుకొచ్చాడు. ఒకరోజు రాజుగారివద్దకు వెళ్ళి చేతులు జోడించి ఇలా విన్నవించుకున్నాడు—మహారాజా! మీ సేవ చేస్తూ ఇప్పటికి నలభై సంవత్సరాలు గడిపాను. ఇక బ్రతికిన నాలుగురోజులూ భగవంతుని స్మరించుకుందామని బుద్ధిపుట్టింది నాకు. పైగా వయస్సు మళ్ళేకొలది పరిపాలనావ్యవహారాలు చూసే శక్తికూడ సన్నగిలిపోతోంది. అదీగాక ఈ వృద్ధాప్యంలో ఏ కొద్ది పొరపాటుజరిగినా జీవితంలో చేసిన మంచి అంతా మట్టిపాలు అయిపోతుంది. కాబట్టి తమరు ఇక నన్ను ఈ భారాన్నుండి విముక్తి చేయవలసిందిగా కోరుతున్నాను.

రాజుగారికి అనుభవశాలి, సత్యసంధుడు అయిన మంత్రి అంటే చాలా ఇష్టం. ఇంకా కొంతకాలంపాటు మంత్రిపదవిని నిర్వహించమని నచ్చచెప్పడానికి రాజు అనేకవిధాల ప్రయత్నించి చూచాడు. చివరకు లాభం లేక పోయింది. మంత్రిమాట అంగీకరించక తప్పలేదు. అప్పుడు రాజు "సరే, అలా అయితే సమర్థుడైన మంత్రిని వెదకి తీసుకురావలసిన బాధ్యత నీదే" నన్నాడు.

ఆ మరునాడే పత్రికల్లో "దేవగఢ్ పరిపాలనావ్యవహారములు చూచుటకు ఒక యోగ్యుడైన మంత్రి కావలయుననీ, ఈ పదవికి యోగ్యత కలిగినవారు ప్రస్తుతము మంత్రిగా వుంటున్న సుజానుసింగు వద్దకు హాజరు కావలయుననీ, గ్రాడ్యుయేటు కాకపోయినా బలము, ఆరోగ్యము అత్యవసరమనీ, ఇట్లు వచ్చినవారి ఆచార వ్యవహారములు ఒక నెలరోజుల పాటు పరిశీలించబడతాయనీ, అందులోగూడ విద్యకు తక్కువ, కర్తవ్యానికి యెక్కువ ప్రాముఖ్యత ఇవ్వబడుతుందనీ, ఈ పరీక్షలో నెగ్గినవారిని మాత్రమే మంత్రిగా తీసుకొనబడుననీ" ప్రకటించబడింది.

ఈ ప్రకటన అప్పటికప్పుడే దేశమంతటా వ్యాపించిపోయింది. ఎంత గొప్ప ఉద్యోగం! సర్టిఫికెట్లు అవసరంలేదు. కేవలం అదృష్టానికి సంబంధించిన విషయం.

వందలకొలదీ బయలుదేరారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి. ప్రతి రైలునుండి అభ్యర్థులు లెక్కలేకుండా దిగుతున్నారు. ఒకరు మద్రాసునుండి వస్తే మరొకరు బొంబాయినుండిదిగుతున్నారు. ఒకరు న్యూఫేషను డ్రస్సులో వుంటే మరొకరు సాదా దుస్తులు ధరించారు. గ్రాడ్యుయేట్లు, పండితులు తమ సర్టిఫికెట్లనుగురించి ఏమేమో చెప్పుకుంటున్నారు. సర్టిఫికెట్కు విలువ ఇవ్వకపోవడం వాళ్ళకు కొరవగానే వుంది. వచ్చినవారిలో గ్రాడ్యుయేట్ల సంఖ్య హెచ్చుగానేవుంది. సర్టిఫికెట్తో పనిలేకున్నా ఆశ అనేది వుంటుందిగా.

సర్దార్ సుజానుసింగు వచ్చినవారి మర్యాదల కొరకు మంచి ఏర్పాట్లుచేసివుంచాడు. అంతా తమకు ప్రత్యేకించబడిన గదుల్లో కూర్చొని ఉపవాసములు చేస్తున్న మహమ్మదీయునివలె రోజులు లెక్కించుకొంటున్నారు. ఎవరికి నచ్చినవిధంగా వారు తమ ప్రవర్తనలను ప్రదర్శించుతున్నారు. ఇంటి దగ్గిర ఉదయం 9 గంటలవరకూ నిద్రనుంచి లేవని మిస్టర్ ఎ. ఇప్పుడు ఆరుగంటలకేలేచి తోటలో పచారు చేస్తున్నాడు. మిస్టర్ బి ఇంటిదగ్గర ప్రొద్దస్తమానం హుక్కా త్రాగుతూవుండేవాడు. ఇప్పుడు తలుపులు బిగించి చీకట్లో సిగరెట్లు త్రాగుతున్నాడు. ఇంటిదగ్గర నౌకర్లను పీక్కుతినే 'సి, డి'లు ఇక్కడ నౌకర్లను "జనాబ్" "తమరు" అని సంబోధిస్తున్నారు. ఒక నాస్తిక మహాశయుని ధర్మనిష్ఠ, దైవభక్తి చూస్తే నిత్యనైవేద్యం చెల్లించే అర్చకుడుగూడ అతని దెబ్బకు రద్దే అనిపిస్తుంది. మిస్టర్ 'ఇ'కి ఇంటిదగ్గర పుస్తకాలంటే ఈర్ష్య. ఇప్పుడు తెంపులేకుండా పెద్ద పెద్ద పుస్తకాలు తిరగవేస్తున్నాడు. ఇంకెందుకు ఎవరిని పలకరించినా వినయమూర్తులుగాను, సదాచారదేవతలుగాను ప్రత్యక్షమౌతున్నారు. ఏదో విధంగా ఒక నెల గడిపామా చాలు. కార్యంఫలించిందంటే మనలను అడిగేదెవరు? అన్నట్లు గడుపుతున్నారు రోజులు.

ఈ కొంగలగుంపులో హంస ఎక్కడవుందా అని వెతకుతూనే వున్నాడు ముసలి సర్దార్ సుజానుసింగ్.

ఒకరోజు సాయంత్రం న్యూఫేషన్ పూజారులు కొందరు హాకీ ఆడాలంటే ఆడాలనుకున్నారు. పట్టణం బయట కోర్టుతయారుచేసి సూర్యాస్తమయందాకా ఆడారు. ఈ మైదానం దగ్గిరలో ఒక కాలువ వుంది. ఆ కాలువకు వంతెన లేకపోవడంచేత పట్టణంలోనికి రావాలన్నా బయటకు పోవాలన్నా దిగి పోవలసిందే. చీకటి పడింది. ఆట ముగించి అలసట తీర్చుకోవడానికి కూర్చున్నారంతా. ఇంతలోనే ఒక రైతు బండిమీద ధాన్యంబస్తాలు వేసుకొని కాలువలో దిగతోలాడు ఆవల, ఒడ్డుకు వెళ్లేందుకు. కాలువలో బురద ఉండడంచేత సగం దూరం శక్తినంతా ఉపయోగించి లాగాయి. ఇక ముందుకు పోలేక మొండికేశాయి యెద్దులు. ఒకసారి యెద్దులను తోలుతూ మరోసారి చక్రం నెట్టుతూ తంటాలుపడుతున్నాడు రైతు. బరువు ఎక్కువ, ఎద్దులు బలహీనమైనవి కావడంచేత రైతు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. సహాయం కొరకు నాలుగుప్రక్కల చూచాడు. ఎవ్వరూ లేరు. వూళ్లోకెళ్ళి ఎవరినైనా తీసుకొచ్చు

కుందామా అంటే బండిదగ్గర దిక్కెవరు? ఇంతలో ఆటగాండ్రు లేచి బేటులు త్రిప్పుకుంటూ ఇంటికి బయలుదేరారు. రైతు జాలిగా చూచాడు వారిని. కాని సహాయము కోరడానికి రైతుకు నోరాడలేదు. ఆటగాండ్రు రైతు అవస్థ చూచికూడ చూడనట్లే నటించి వెళ్లిపోయారు. సానుభూతి, ఉదారత్వము, వాత్సల్యము వారిలో ఏకోశానా లేవు. ఉంటే అలా చూస్తూ పోలేరుగదా! వారికి ఉన్నదేమంటే స్వార్థము, గర్వము.

కాని ఆ సమూహంలో సానుభూతి, వాత్సల్యముగల వ్యక్తి లేకపోలేదు. అయితే ఆ వ్యక్తికి హాకీ ఆడే సందర్భంలో కాలుకు దెబ్బ తగిలింది. అందు చేత కుంటుకుంటూ మెల్లగా వెనుక వస్తున్నాడు. అకస్మాత్తుగా అతనిదృష్టి బండివైపు మళ్ళింది. నిలబడిపోయాడు. రైతుముఖం చూడగానే అతని అవస్థ అవగాహన చేసుకున్నాడు. చేతిలోని బేటు ఒడ్డున పెట్టి, కోటువిప్పి రైతుదగ్గరకు వెళ్ళి బండి నెట్టమంటావా అన్నాడు.

బలిష్టమైన ఒక వ్యక్తి తన ఎదురుగా నిలబడివుండడం చూచాడు రైతు. భయంతో "అయ్యా! మిమ్ములను సహాయము కోరుటకు నాకు నోరు రావడము లేదు" అన్నాడు రైతు. వెంటనే ఆ వ్యక్తి ఫరవాలేదులే, పాపం! నీవు చాలా సేపటినుండి ఇక్కడ చిక్కుపడి వున్నట్లున్నావు. నీవు బండి ఎక్కి ఎద్దులను తోలు, నేను చక్రం నెడతాను. బండి బయటకు పోతుంది" అన్నాడా యువకుడు. రైతు సంతోషంతో బండెక్కి ఎద్దులను అదిలించాడు. యువకుడు బలంకొద్దీ చక్రం పట్టాడు. యువకుడు మోకాళ్ళ వరకు బురదలో పూడిపోయాడు. అయినా అధైర్యపడలేదు. మళ్లీ ఎద్దులను అదలించమని తన బలాన్నంతా వుపయోగించాడు. ఎద్దులకు కూడ ధైర్యం వచ్చింది. ఒక్కపట్టుపట్టాయి. బండి ఒడ్డున పడింది.

రైతు ఆ యువకునికి దణ్ణంపెట్టి "మీరు లేకపోతే ఈరాత్రి నేను ఇక్కడే వుండవలసివచ్చేది. మీ పుణ్యాన బయటకొచ్చింది బండి" అన్నాడు వినయపూర్వకంగా.

యువకుడు నవ్వి-"అయితే నాకు బహుమతి ఇస్తారుగదూ!" అన్నాడు. "దేవుని దయ వుంటే దివానిగిరి మీదేలే" అన్నాడు రైతు గంభీరంగా.

యువకుడు రైతుని శ్రద్ధగా చూచాడు. సుజానుసింగు కాదుగదా? అన్న సందేహం కలిగిందతనికి. స్వరం అలాగే వుంది. ముఖం వాలకంఅంతా అలాగేవుంది. అతని సందేహం తీరేటట్లుగా రైతుకూడా అతనిని తదేకదృష్టితో చూస్తూ "లోతుకు మునిగితేగాని ముత్యం దొరకదు" అన్నాడు నవ్వుతూ.

నెల పూర్తి అయింది. ఎన్నికరోజు వచ్చేసింది. సాయంత్రం రాజదర్బారు అలంకరించబడింది. తమకు కాబోయే మంత్రినిచూచుకొనేందుకు పట్టణంలోని ధనికులు, పేదలు అంతా వచ్చారు. అభ్యర్థులు రంగురంగుల గుడ్డలతో, రకరకాల వేషాలతో వచ్చి కూర్చున్నారు. వారిగుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నట్లుంది.

సర్దార్ సుజానుసింగ్ లేచి ఇలా చెప్పాడు—అభ్యర్థి మహాశయులారా! నేను మిమ్ములను ఇంతగా కష్టపెట్టినందుకు నన్ను క్షమించాలి. మన దేశంకొరకు యోగ్యుడైన మంత్రిని నిర్ణయించుకొనేందుకు మిమ్ములను ఇంత కష్టపెట్టవలసివచ్చింది. ఉదారహృదయుడు, కష్టాలను ధైర్యంతో ఎదుర్కొనే ఆత్మబలముగల యువకుడే మంత్రి పదవికి యోగ్యుడు. మనదేశం యొక్క సౌభాగ్యంచేత అట్టి యోగ్యతగల యువకుడు మనకు లభించాడు. ఇట్టి గుణవంతులు ప్రపంచంలో చాలా అరుదు. కాబట్టి మనకు జానకీనాథుడువంటి మంత్రి దొరకడం మన అదృష్టం.

అందరి కండ్లు ఒక్కసారిగా జానకీనాథునివైపు మళ్ళాయి. ప్రభుత్వోద్యోగులు, ప్రజలు జానకీనాథుని సంతోషంతో చూస్తుంటే, అభ్యర్థుల కండ్లు ఈర్ష్యతో ఎర్రబడ్డాయి.

సర్దార్ సుజానుసింగు మళ్ళీ ఇలా అన్నాడు—మీరంతా ఈ విషయాన్ని సంతోషంతో అంగీకరిస్తారనుకుంటాను. ఉదారత్వము, సాహసమూ, ఆత్మబలము గలిగిన వ్యక్తి ఎవరు అన్న ప్రశ్నకు సమాధానం-కాలుకు బలమైన గాయము తగిలినప్పటికీ లెక్కచేయక ఆ రైతు బండిని బురదలోనుండి గట్టెక్కించిన ప్రముఖుడే అని చెప్పాలి. అలాంటి వ్యక్తి బీదలను ఎప్పుడూ పీడించడు. అతడు దృఢసంకల్పము గలవాడు. అతడు మోసపోతే పోవచ్చుగాని దయా, ధర్మం అనేవి వానిని ఎప్పటికీ విడిచిపోలేవు. ★

పిన్నల పాండిత్యం

1

అపరాధికి శిక్ష

గ్రీష్కా, 12 ఏండ్ల వయస్సు.
శంకా, 10 ఏండ్ల వయస్సు.
టిష్కా, 13 ఏండ్ల వయస్సు.

టిష్కా: అతన్ని జైల్లో పెడతారు. మళ్ళీ ఎన్నటికీ ధాన్యపు కొట్లో దొంగతనం చేయకుండా బుద్ధి వచ్చేలా చేస్తారు. ఇహ రెండోసారి ఆ పని చెయ్యాలంటే భయపడతాడు.

శంకా: నిజంగా అతను దొంగతనం చేసివున్నట్లయితే శిక్షార్హుడే. కాని మా తాతయ్య ఒకసారి చెప్పాడు. ఏం తప్పు చేయకపోయినా అన్యాయంగా 'మిత్రోఫాన్'ను జైల్లో పెట్టారట.

టిష్కా: 'అన్యాయంగా'— అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం? అతన్ని అన్యాయంగా జైల్లో పెడితే ఆ జైల్లో పెట్టినవాణ్ణికూడా శిక్షిస్తారు. నీకాసంగతి తెలుసునో లేదో?

గ్రీష్కా: అవును. అలా అక్రమమైన పని చేసినవాణ్ణి ముద్దు పెట్టుకోరు. అతన్ని కూడా శిక్షించి తీరుతారు.

శంకా: అయితే, అతన్ని ఎవరు శిక్షిస్తారు?

టిష్కా: అతనిపై వాళ్లు.

శంకా: పైవాళ్లు అంటే ఎవరు?

టిష్కా: అంటే అతనిపైన వుండే అధికార్లు.

శంకా: ఆ అధికార్లు కూడా తప్పుచేస్తే? అప్పుడూ?

గ్రీష్కా: అప్పుడు ఇంకా పైన వుండే అధికార్లు వాళ్ళను శిక్షిస్తారు. అందుకనే అందరిపైనా జార్ చక్రవర్తి వున్నాడు.

శంకా: జార్ చక్రవర్తి కూడా తప్పు చేస్తాడనుకుందాం. అప్పుడతన్ని ఎవరు శిక్షిస్తారు?

టిష్కా: ఎవరు శిక్షిస్తారు? ఎవరు శిక్షిస్తారు? మనకు తెలియడం......

గ్రీష్కా: అతన్ని దేవుడు శిక్షిస్తాడు.

శంకా: అయితే అప్పుడు, ఈ ధాన్యపుకొట్లో దూరినవాణ్ణికూడా నిశ్చయంగా దేవుడే శిక్షిస్తాడు కదూ? కనుక ఎవరు తప్పు చేసినా శిక్షించేవాడు ఈశ్వరుడొక్కడే! ఆయన తప్పుచేయడు.

టిష్కా: కాని అలా ఎన్నటికీ జరగదు.

శంకా: ఏం? ఎందుకు జరగదూ?

టిష్కా: ఎందుకంటే...... ఎందుకంటే......ఏమో?......

2

కోర్టులో వ్యాజ్యం

ఒక రైతు
అతని భార్య
అతని స్నేహితుడు
ఫెద్యా } అతని
పెట్కా } కొడుకులు

రైతు: [ఇంట్లోకి వచ్చి తనవద్దనున్న వస్తువులన్నీ అవతల పెడతాడు] అయ్యో! దేవుడా! ఏం గాలి, ఏం గాలి! అంత దూరం పోయి వచ్చేసరికి నా ప్రాణాలు అన్న పట్టాయి.

భార్య: అవును. చాలా దూరం. ఇరవై మైళ్ళకు తక్కువ వుండదు.

రైతు: ఇరవై కాదు. ఖచ్చితంగా ముప్ఫయి మైళ్లుంది. [ఫెద్యాతో] వెళ్ళి ఆ గుర్రాన్ని లోపలికి తోలు బాబూ!

భార్య: సరే, ఇంతకూ మన పక్షం అయిందా?

రైతు: ఏం పక్షమోనే, దాని పాడుగాను! బుద్ధితక్కువై ఇందులో ఇరుక్కున్నాం.

స్నేహితుడు: ఏమిటోయ్ నీవు చెప్పేది? నాకేం అర్థం కావడం లేదు.

రచన: టాల్‌స్టాయ్ అనువాదం: రెంటాల గోపాలకృష్ణ

★ పిన్నల పాండిత్యం ★

రైతు: ఏముంది? అవర్యాన్, నా దొడ్డిని తన దొడ్లో కలుపుకున్నాడు. పైగా అదంతా తనదేనని చెపుతున్నాడు. ఈ పేచీ ఎంతకూ తెగకుండా వచ్చింది.

భార్య: అందుకని కోర్టుకు వెళ్ళాం. కోర్టులో రెండేండ్ల బట్టీ ఈ వ్యాజ్యం నలుగుతూవుంది.

స్నేహితుడు: ఓ! అదా! ఆవిషయం నేనూ ఎరుగుదునులే. ముందు మన ఊరికోర్టులో విచారణ జరిగింది. నాపక్షమే తీర్పు చెప్పారని విన్నాను.

రైతు: అవును. ఆ తరువాత 'అవర్యాన్' తాలూకా కోర్టుకు వెళ్లాడు. అక్కడ కూడా నాపక్షమే అయింది. కాని మళ్ళీ ఒక చిక్కు వచ్చిపడింది. జడ్జీలు విచారణ చేసి ముందు నాపక్షమే తీర్పు చెప్పారు. తిరిగీ ఇవాళ ఆ స్థలం అతనికే చెందాలని అంటున్నారు. మరి అదేమిటో? ఒకసారి నాదనీ, మరోసారి అతనిదనీ చెబుతున్నారు. మనకీ జడ్జీలు భలేవాళ్లు దొరికారు!

భార్య: అయితే, ఇప్పుడింతకూ ఏం చేయాలి?

రైతు: నా ఆస్తిని అన్యాయంగా అతను ఆక్రమించుకుంటే ఊరుకుంటానా? ఆ విషయం పై కోర్టులో ఫిర్యాదు చేస్తాను. అప్పుడే ఈ విషయం ప్లీడరుతో సంప్రదించానుకూడా.

స్నేహితుడు: మరి పైకోర్టులో కూడా అతని పక్షమే అయితే?

రైతు: అప్పుడు ఇంకా పైకోర్టుకు వెడతాను! ఆ దుర్మార్గుణ్ణి ఊరికే వదిలిపెడతానా? నాకున్న చివరి ఆవుదూడను కూడా అమ్మి వ్యాజ్యం ఆడతాను. వాడికి బుద్ధి వచ్చేలా చెయ్యాలి.

స్నేహితుడు: సరే. ఆ పైకోర్టులోకూడా అతనికే అనుకూలం అవుతుందని అనుకుందాం. అప్పుడూ?

రైతు: అప్పుడు ఏకంగా జార్ చక్రవర్తి దగ్గరికే వెడతాను...... సరే. ముందు గుర్రానికి దాణా వెయ్యాలి. [వెళతాడు.]

పెట్కా: జార్ చక్రవర్తికూడా మనకు వ్యతిరేకం చేస్తే అప్పుడెవరి దగ్గరికి పోవాలి?

భార్య: జార్ చక్రవర్తికి పైన మరెవరూ లేరు.

ఫెడ్యా: అయితే మరి, కొందరు అవర్యాన్‌కు అనుకూలం చేశారు; మరికొందరు నాన్నగారికి అనుకూలం చేశారు. ఎందుకమ్మా అలా చేశారు?

భార్య: అసలు న్యాయంగా ఎవరిపక్షం తీర్పు చెప్పాలో వాళ్ళకే తెలీదు.

పెట్కా: అలా తెలీనివాళ్లదగ్గరికిపోయి మనం తీర్పు చెప్పమని అడగడం దేనికి?

భార్య: ఎవరైనా తమ ఆస్తి పోగొట్టుకోగలరా? అందుకే తీర్పు చెప్పమని జడ్జీలదగ్గిరికి వెడతారు.

పెట్కా: నేను పెద్దవాణ్ణి అయిన తరువాత అలా చెయ్యను. ఏ విషయంలోనైనా, ఎవరితోనైనా నాకు పేచీ వస్తే గుంపులు గుంపులుగా జనాన్ని పిలుస్తాను. ఎవరి పక్షం చెందాలో న్యాయం చెప్పమని అడుగుతాను. వాళ్లు చెప్పిన ప్రకారం నడుచుకుంటాను. దాంతో ఆ వ్యవహారం ఫయిసలా అయిపోతుంది. నేను 'అకుల్కా'తో పేచీ వచ్చినప్పుడల్లా అలాగే చేస్తుంటాను.

స్నేహితుడు: బహుశా అది చాలా మంచిమార్గమని తోస్తోంది. ఎలాంటి పాపం లేకుండా తగువు పరిష్కారమైపోతుంది.

భార్య: అవును. మేము అలా చెయ్యకుండా ఈ కోర్టుకు ఎక్కాం. కోలుపోయాం! కాస్తంత జాగా కోసం డబ్బంతా తగలేశాం. అసలు అది చేసే ఖరీదుకంటె మేం పెట్టిన డబ్బే ఎక్కువ! ఓ! పాపంలో పడ్డాం! మహా పాపం! ★

★ అరుణవలయం ★

(42-వ పేజీ తరువాయి)

"అసంభవం!" అని మళ్లీ అనుకున్నాడు. మెల్లిగా తన ఆఫీసు మెట్లెక్కి వెళ్లాడు. తలుపు తెరుస్తూనే మొదటగా యేల్ చూసినది ఉత్తరాలు పెట్టె ఖాళీగా ఉన్న సంగతి. ఆ పెట్టె ఎలాంటిదంటే ఎవరూ చెయ్యి పెట్టి ఉత్తరాలు దొంగిలించటానికి వీలులేని విధంగా నిర్మింపబడింది. అందులో ఉత్తరాలు ఎవరు తీసి ఉంటారు?

తలుపుమూసేసి గదిలోకి వెళ్లాడు. గుమ్మం దాటి ఒక అడుగు వేసి ఆగిపోయాడు. బల్లలోని ప్రతిసొరుగూ తెరిచి ఉంది. చాటుగా దించిన ఇనపపెట్టె తాళం తీసి ఉంది. బల్ల కింద ఒక చిన్న పెట్టె ఉంది. బాగా అనుభవమున్నవాడు వెదకితే తప్ప ఆ పెట్టె ఒక పట్టాన కనిపించదు. అందులో అరుణవలయంకు సంబంధించిన రహస్య పత్రాలన్నీ డెరిక్ యేల్ దాస్తూ ఉంటాడు. ఆ పెట్టె కూడా బలాత్కారంగా తెరవబడి ఉంది.

యేల్ కుర్చీలో కూర్చుని కిటికీలోంచి చాలా సేపు అలాగే చూశాడు. తన ఆఫీసులో ఈ గందరగోళమంతా చేసిందెవరో ఊహించడం కష్టం కాదు. అయినా తెలుసుకుందామని లిఫ్టు వద్ద పనిచేసే నౌకరుకు అడిగాడు. వాడిలా చెప్పాడు:

"అవునండి. మీ సెక్రటరీ ఇవాళ పొద్దున్నే వచ్చింది. ఇక్కడొక గంటసేపు ఉండి వెళ్ళిపోయింది."

"ఆమె చేతిలో ఏదన్నా సంచీ ఉందా?"

"చిన్న సంచీ ఉందండి."

యేల్ వెంటనే పోలీసు కార్యాలయానికి వెళ్లి జరిగిన గందరగోళమంతా పార్‌తో చెప్పాడు.

"పార్! నీతో ఒక విషయం చెబుతా విను. ఇది ఇంతవరకూ కమీషనరుతో కూడా చెప్పలేదు. అరుణవలయం యజమాని పురుషుడని ఇంతవరకూ మనం అనుకుంటున్నాము. ఈ థాలియాడ్రమండ్ అరుణవలయంలోకి ఒక పురుషుని ద్వారానే ప్రవేశించిందని నాకు తెలుసు. కాని ఆ పురుషుడు నిజానికి వలయ నాయకుడు కాదు. ఆ నాయకుడు, ఇతర సభ్యులతోపాటుగా థాలియాడ్రమండ్ ఆజ్ఞలేపాలిస్తూ ఉంటాడనికూడా నాకు తెలుసు!"

"నిజంగా?" అన్నాడు పార్.

"అటువంటప్పుడు ఆమెను నేను సెక్రటరీగా ఎందుకు నియమించుకున్నాననిగదూ నీ అనుమానం. ఆమె ద్వారా నేను అరుణవలయానికి సన్నిహితంగా వెళ్లవచ్చునని భావించాను. నా భావన సరైనదని బుజువైంది."

"అయితే ఆమె నెందుకు ఉద్యోగం నుండి తొలగించావు?"

"తొలగించవలసినంత పని ఆమె చేసింది కనుక. ఆమెను ఆ క్షణంలో తొలగించకపోతే నేనే ఉద్దేశంతో ఆమెను ఉద్యోగంలోకి తీసుకుందీ ఆమె గ్రహించి ఉండేది. కాని ఆమెకు ఎలాగూ తెలిసిపోయింది. ఇవ్వాళ ఉదయం ఆమె చేసినపని చూస్తే ఆమె నా ఉద్దేశం పూర్తిగా గ్రహించినట్లు కనిపిస్తోంది. సరె గాని పార్! ఇవ్వాళ సాయంత్రం సభలో నువ్వు చెప్పేది చెప్పింది తరవాత, నేను చెప్పేది నేను చెబుతాను. నీకు ఆశ్చర్యం కలిగించే విషయాలు చెబుతాను."

"నువ్వు ఎంత అద్భుత విషయాలు చెప్పినా నాకు ఆశ్చర్యం కలిగించలేవు."

ఆరోజు యేల్ ఇంటికి తిరిగివచ్చేసరికి మరో అద్భుత సంఘటన జరిగింది. అతని ఇంట్లో రాత్రి తొమ్మిది గంటల దాకా కాచుకొని ఉండాల్సిన పనిమనిషి ఐపు లేదు. కాని సాయంత్రం ఆరు కాకముందే ఆమె వెళ్లిపోయింది.

ఇల్లంతా చీకటిగా ఉంది. లైట్లు వేశాడు. గదులన్నీ తిరిగాడు. డ్రాయింగ్ రూమ్ తప్ప మిగతా గదులన్నీ మామూలుగానే ఉన్నాయి. ఆ గదిమాత్రం చిందరవందరగా ఉంది. చిందరవందర చేసిన వ్యక్తి ఎవరో అతను సులభంగానే ఊహించాడు. పనిమనిషిని వెదికి పట్టుకుని అడగనక్కర్లేకుండానే అతనికి సంగతంతా బోధపడింది. యేల్ రమ్మన్నాడని ఎవరో చెప్పి ఉంటారనీ, ఆమాట నమ్మి పనిమనిషి వెళ్లిపోయి ఉంటుందనీ అతడు గ్రహించాడు. ఆమె లేనప్పుడు థాలియా జొరబడి తీరికగా ఇల్లు సోదాచేసి ఉంటుంది.

"తెలివైన యువతి!" అని డెరిక్ యేల్ అనుకున్నాడు. అతని మనస్సులో కోపం లేదు. తనంతటి తెలివైనవాణ్ణే కన్ను గప్పి వ్యవహరించిన యువతిని అతను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. జైలులోంచి తప్పించుకొన్న పన్నెండు గంటలలోగా ఆమె తన ఆఫీసును, ఇంటిని సోదాచేసి అరుణ వలయం కేసులకు సంబంధించిన ముఖ్యమైన పత్రాలను దొంగిలించిపోయింది.

ఆమె ఆ తరువాత ఏంచేస్తుంది బహుశా అని ఆలోచిస్తూ, తీరికగా అతను దుస్తులు మార్చుకున్నాడు. తానేం చెయ్యదలచిందీ తనకు నిశ్చయమైపోయింది. ఇరవైనాలుగు గంటలలోగా ఇన్‌స్పెక్టర్ పాక్ పస బయట పడుతుంది.

ఒక డ్రాయరు తెరిచి రివాల్వరు బయటికి తీశాడు. దాని కేసి పరీక్షగా చూశాడు; పంట్లాం జేబులో పెట్టుకున్నాడు. అరుణవలయ రహస్యం అతి విచిత్రంగా, అద్భుతంగా బయటపడబోతోంది.

ప్రధానమంత్రిభవనం వరాండాలో జాక్ బియర్డ్‌మోర్ కనిపించాడు. అక్కడ అతడెందుకు ఉన్నాడా అని డెరిక్ యేల్ ఆశ్చర్యపడ్డాడు. అరుణవలయ బాధితుల్లో జాక్ బియర్డ్‌మోర్ ఒకడు. కావచ్చు గాని, అతనికి ఆ తరవాత జరిగిన సంఘటనలు వేటితోనూ సంబంధం లేదే!

"నేనిక్కడ ఉండడం మీ కాశ్చర్యంగా ఉందిగదూ మిస్టర్ యేల్? నన్నీ సమావేశానికెందుకు పిలిచారో నాకూ ఆశ్చర్యంగానే ఉంది," అన్నాడు జాక్ నవ్వుతూ.

"నిన్నెవరు ఆహ్వానించారు? ఇన్‌స్పెక్టరా?"

"సరిగా చెప్పాలంటే, ప్రధానమంత్రి సెక్రటరీ. కాని పార్ సూచన మీద నేనా కాహ్వానం వచ్చి ఉండవచ్చు. ఈ ప్రముఖులందరి మధ్యా మీకు జంకు పుట్టడంలేదూ?"

"ఊహు, లేదు," అని యేల్ జాక్ వీపు తట్టాడు.

ప్రైవేటు సెక్రటరీ ఒకడు వచ్చి వారిద్దర్నీ డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఓ డజనుమంది ప్రముఖులు రెండు జట్లుగా విడిపోయి గుసగుసలాడుతున్నారు.

డిటెక్టివ్ యేల్ వద్దకు ప్రధానమంత్రే సరాసరి వచ్చాడు.

"ఇన్‌స్పెక్టర్ పార్ ఇంకా రాలేదు," అని జాక్ వంకచూసి "ఈయన మిస్టర్ బియర్డ్‌మోర్ అనుకుంటాను. మిస్టర్ బియర్డ్‌మోర్! పార్ మిమ్మల్ని తప్పకుండా సభకు ఆహ్వానించమన్నాడు. బహుశా జేమ్స్ బియర్డ్‌మోర్ మరణాన్ని గూర్చి కొత్త విషయాలేమన్నా చెబుతాడేమో. అన్నట్టు మీ తండ్రిగారు నాకు మంచి స్నేహితుడు," అన్నాడు ప్రధాని.

ఇన్‌స్పెక్టరు అప్పుడే వచ్చాడు. అతని దుస్తులు, వాలకం చూస్తే, ఆ మేధావంతుల సభలో అతడు అడుగుపెట్టడానికే అనర్హుడనిపించేట్లున్నవి. అతని వెనకనే కమీషనరు వచ్చాడు. అతడు ప్రధాన మంత్రిని ఒక పక్కకు తీసుకుపోయి ఏదో మాట్లాడాడు. కొంతసేపు గుసగుసలాడి కమీషనరు యేల్ వద్దకు వచ్చాడు.

"పార్ ఏం చెప్పబోతున్నాడో మీకేమైనా తెలిసిందా? అతన్ని ఈ ఉపన్యాసం ఇవ్వడానికి ప్రభుత్వమే పిలిచిందని నేనింతవరకూ అనుకుంటున్నాను. కాని ప్రధాని చెప్పిన దాన్నిబట్టి పార్ తనంతతనే అరుణవలయం చరిత్ర చెప్ప



ఢిల్లీలో ఇండియాగేట్

ఫొటో: బి. ఏ. నరసింహా, సికింద్రాబాదు.

అరుణ వలయం

కానికి సిద్ధపడ్డాడని తెలిసింది ఏం చెబుతాడో మరి? చివరికి తెల్ల మొహం వేస్తాడేమోనని నా భయం," అన్నాడు కమీషనరు.

"ఆ భయం అనవసరం" అన్నాడు జాక్ ఇతడెవరా అని కమీషనరు అతని వంక తీవ్రంగా చూశాడు యేల్ అప్పుడు వారిద్దరినీ పరస్పరం పరిచయం చేశాడు.

"బియర్డ్‌మోర్ చెప్పిందే నిజం పార్ తెల్ల మొహం వేస్తాడని నేననుకోను నిజానికి అనేక విషయాలు కొత్తవి బయట పడవచ్చు. అతడు పూర్తి చెయ్యలేకపోయిన ఖాళీలు నేను పూర్తి చేస్తాను" యేల్ అన్నాడు.

అందరూ ఆసీనులయ్యారు. ప్రధాని ఇన్‌స్పెక్టర్‌ను లేచి మాట్లాడమని సంజ్ఞ చేశాడు.

పార్ లేచి గొంతుక సవరించుకున్నాడు. "మీ కేమనా కోకపోతే, నేనిక్కడే నుంచుని మాట్లాడతాను నేను వక్తను కాను మీలో ఎవరికో ఒకరికి చెబుతూ ఉన్నట్టే మామూలుగా చెప్పేస్తాను," అని మొదలు పెట్టాడు. మొదట మొదట మాటలకోసం తడబడుతూ, మధ్య మధ్య ఆగుతూ, చివరికి నిలకడగా స్పష్టంగా మాట్లాడ సాగాడు.

"అరుణవలయం అనే వ్యక్తి అసలు పేరు లైట్‌మన్. ఫ్రాన్సులో ఇతడు చాలా హత్యలు చేశాడు ఆతనికి మరణ దండన విధించారు కాని ఒక అనుకోని సంఘటన మూలంగా అతనికి శిక్ష తప్పిపోయింది. అతని పూర్తి పేరు ఫెర్డినాండ్ వాల్టర్ లైట్‌మన్ అతనికి ఉరిశిక్ష జరగవలసిన రోజున అతని వయస్సు ఇరవై మూడేళ్ళ నాలుగు నెలలు అతన్ని కొయెన్‌కు ద్వీపాంతరవాసం పంపారు. అక్కడ కాపలావాణ్ణి ఖూనీచేసి తప్పించుకుని బహుశా ఆస్ట్రేలియాగాపును పారిపోయాడు. ఎందుకంటే సరిగ్గా అతనిలాంటి మనిషే ఒకడు మరో పేరుతో మెల్‌బోర్న్‌లో పద్దెనిమిది నెలల పాటు ఒక షాపులోనూ, రెండేళ్ళ ఆయిగు నెలల పాటు మరో చోట ఉద్యోగం చేశాడు అతడు తన యజమానిని బ్లాక్ మెయిల్ చేయ జూచిన కారణాన పోలీసు వారంటు జారీ కావడం, హఠాత్తుగా అతడు ఆస్ట్రేలియా నుండి పారి పోవడం జరిగింది.

ఆతరవాత ఏం జరిగిందో మనకి సరిగా తెలియదు ఇటీవల ఇంగండులో ఒక అజ్ఞాత అభూత వ్యక్తి అరుణవలయం అనే రహస్య నామంతో దారుణ కాండ సాగించాడు ఆ అరుణవలయ వ్యక్తి గొప్ప ఘటనాఘటన సామర్థ్యంతో, ఓపికతో, శక్తితో కొందరు సహాయకులను తనతో చేర్చుకొన్నాడు. ఈ సహాయకులలో ఏ ఒకరికీ మరొరు తెలియకుండా ఉండేలాగు ఏర్పాటు చేశాడు. డబ్బుకి ఇబ్బంది పడే వాణ్ణో, ఏదో నేరం చేసి దొరికి పోతానే భయంతో బాధపడే వాణ్ణో ఈ అరుణవలయ వ్యక్తి పట్టుకుని, వాడి పుట్టు పూర్వోత్తరాల ఆరాతీసి, ఆఖరికి వాణ్ణి ఫలానా చోటికిరమ్మనే వాడు సాధారణంగా చీకటి చీకటిగా ఉన్న చోట, అయినా దారులోడ్డ కూడలి స్థలంలో తాను రమ్మన్న మనిషిని కలిసేవాడు తాను అన్ని వేళలా మూసివేసిన కారులో నిశ్శబ్దంగా వచ్చేవాడు

జైలు శిక్ష అనుభవించి విడుదల అయిన వాళ్ళని కూడా అరుణవలయ వ్యక్తి తనతో చేర్చుకునే వాడు ఈ విధంగా పీటీ అనే వానికుణ్ణి, అదివరకే హత్యచేశాడని అనుమానింప బడిన వాణ్ణి చేర్చుకున్నాడు దొంగలతో కలిసి తిరిగిన దొంగ థాలియా డైమండ్‌ను కూడా ఈ విధంగానే అతడు చేర్చుకున్నాడు. బాంకర్ బ్రబజాన్‌ను చేరదీశాడు ఫిలిక్స్‌మార్ల్‌ను కూడా చే వాడే కాని ఈమార్ల్, లైట్‌మన్ లిద్దరు ఇదివరలో జాయింటుగా నేరాలు చేసిన వాళ్ళే. పైగా లైట్‌మన్‌ను చూడగానే మార్ల్ గుర్తు పట్టాడు. అందుచేత లైట్‌మన్ మార్ల్‌ను హత మార్చివేశాడు ఆ హత్యలో హంతకుడుపయోగించినవిధానం అత్యాగ్భతమైనది, అపూర్వమైనది

ఈ విధంగా అరుణవలయం అనే ఆ అజ్ఞాత వ్యక్తి—" అని పార్ చెప్పుకుపోతున్నాడు. సభికులందరూ పార్ మాటలను అత్యంత శ్రద్ధాసక్తులతో చెవులు రిక్కించుకుని వింటున్నారు

"అతడు అరుణవలయం అనే పేరెందుకు పెట్టుకున్నాడు?" అని డెరిక్ యేల్ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ పార్ కాసేపు మౌనంగా ఊర్కుని ఇలా అన్నాడు.

"ఎందుకంటే లైట్‌మన్‌ను అతని తోటి నేరస్థులందరూ ఆ పేరు పెట్టారు. అలాగే పిలిచేవారు. అతని మెడ చుట్టూ వలయాకారంలో ఎర్రని పుట్టుమచ్చ ఉండేది—కదిలావంటే తల ఎగిరి పోతుంది!"

పార్ బరువైన రివాల్వరొకటి చేతిలో పట్టుకుని డెరిక్ యేల్‌పై గురి పెట్టాడు

"ఎత్తు-చేతులెత్తు", అంటూ పార్ హఠాత్తుగా ముందుకువంగి యేల్ మెడకు బిగుతుగా ఉన్న కాలరు పట్టుకుని ఒక్కసారి గుంజి చించి వేశాడు.


అందరూ స్తంభీభూతులై చేష్టలు దక్కి నిలుచున్నారు.

డెరిక్ యేల్ కంఠం చుట్టూ అరుణ వలయం ఉన్నది. ఎర్రగా, నెత్తురంత ఎర్రగా, భయంకరంగా ఎవరో చిత్రకారుడు కుంచెతో గీసినంత తిన్నని రేఖగా అరుణవలయం కనబడింది. (ఇంకా ఉంది)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor: S. Sambha Prasad.



—ఫొటో : ఎ. వి. రామమూర్తి


విశాలాంధ్రంతటా
ప్రదర్శింప బడుచున్నది
శంకర్ ప్రొడక్షన్సు వారి
సదారమ
తారాగణం:
జానకి - రేలంగి - ముక్కామల....
కల్యాణకుమార్-కౌశిక్-ఇ.వి.సరోజ
కుమారి కమల
మరియు
గేవాకలర్‌లోనున్న దొంగయొక్క దృశ్యములు
ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణ
స్టూడియో:
ఏ.వి.ఎం
GHRAO
...విజయా రిలీజ్...